ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 220 పేజీలు: 10+4 వెల: 6.50

భారత్ తరహాలోనే అమెరికాలో కూడా 'సర్'! 5లో

గ్యాస్ బుకింగ్‌కు గడువు ఇక 25 రోజులే



మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు లోకేష్, నిమ్మల, రామ్మోహన్ నాయుడు, పయ్యావుల కేశవ్, పల్లా శ్రీనివాసరావు

## పార్టీయే సుప్రీం

### నిర్ణయాలను గౌరవించాల్సిందే

### టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేష్

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను, నిబంధనలను కార్యకర్త నుంచి బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందేనని ఆ పార్టీ తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, నారా లోకేష్ వ్యాఖ్యానించారు. 'పార్టీయే సుప్రీం' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని ఆదేశించారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో లోకేష్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఏదైనా పని చెబితే.. దానికే ప్రయారిటీ ఇవ్వాలని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. క్వాంటం టవర్స్‌కు సంబంధించిన ఓ కార్యక్రమం ఉందని తనను ఆహ్వానిస్తే, పార్టీ తనకో పని అప్పచెప్పిందని తాను రానని స్పష్టం చేశానని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే, దానికే హై ప్రయారిటీ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ పదవుల్లో ఉన్న వారు పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడానికి ఎవరి అనుమతి అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. >>2

# ప్రతి ఎకరాకూ నీరు

## తెలుగుతల్లికి జలహారతి

- సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణపై పనిచేయటమే సంతృప్తి
- పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు
- కష్ట కాలంలో నిలబడిన కార్యకర్తకే పార్టీలో పూర్తి గౌరవం
- ప్రజల ఓటే మనకు గీటు రాయి.. 2029లో మెరుగైన ఫలితాలు రావాలి
- వైసిపి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి
- ఉగ్రవాదుల్లా హిట్- రన్- హైడ్ విధానంతో గొడ్డలి పార్టీ రాజకీయం
- టిడిపి లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సాగునీటి రంగంపై చేస్తున్న కృషికి సిఎంకు పార్టీ నేతల స్టాండింగ్ ఓవేషన్

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం సహా రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చి తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని ముఖ్య మంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. వాటర్‌మెన్‌గా ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొనటం సంతోషంగా ఉందని, జల సంరక్షణపై చేస్తున్న కష్టానికి దక్కిన గుర్తింపని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్షిప్ కాన్క్లేవ్‌లో నేతల్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు వెళ్తున్నామని ఆయన అన్నారు. కష్టకాలంలో నిలబడిన కార్యకర్తకు పూర్తి గౌరవం ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన సామాన్య కార్యకర్త దళవాయి రమాదేవి దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఓటే గీటు రాయిగా పనిచేద్దామని నేతలకు పిలుపునిచ్చారు. 2029లో >>2



## నేరాలు చేయడంలో జగన్, సాయిరెడ్డి పార్టనర్స్

### ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించి నడపొచ్చు

### తిరుపతిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు

**తిరుపతి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయపార్టీ స్థాపించి, నడపొచ్చని అయితే ఏ ఉద్దేశ్యంతో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెడుతున్నారనేది స్పష్టం కావాలని రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. విజయసాయి కొత్తపార్టీ ప్రయత్నాలపై సత్యకుమార్ విమర్శలు గుప్పించారు. ప్రజాధనాన్ని దోచుకున్న వ్యక్తి ఏ ముఖం పెట్టుకుని పార్టీ పెడుతున్నారని ప్రశ్నించారు. జగన్ కేసుల్లో విజయసాయి ఎ2గా ఉన్నారని వ్యాఖ్యానించారు.
ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కు అందరికీ ఉందని, అయితే దశాబ్దాల పాటు ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచుకున్న వ్యక్తి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పార్టీ పెడుతున్నాడో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. వైసిపి అధినేత జగన్ అక్రమాస్తుల కేసుల్లో విజయసాయిరెడ్డి ఎ2గా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.
"జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ నేరాలు చేయడంలో పార్టనర్స్" అని మంత్రి ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల హయాంలో విచ్చలవిడిగా సాగిన నాసిరకం, అక్రమ మద్యం సరఫరా వల్ల రాష్ట్రంలో ఏకంగా 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది తీవ్ర అనారోగ్య పాలయ్యారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేయడంతో పాటు వేలాది కుటుంబాల నాశనానికి కారణమైన జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ ప్రజల కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని అన్నారు.

## సిడబ్ల్యుసిలోనూ జలజగడం

### కృష్ణా జలాల వినియోగంపై ఎపి, తెలంగాణ అధికారుల వాగ్వాదం

### కేటాయింపు కంటే ఎక్కువగా వాడుతున్నారని ఒకరిపై ఒకరు ఫిర్యాదు

### విద్యుదుత్పత్తిపై ఎపి ఫిర్యాదు, తాగునీటి పేరుతో తోడేస్తున్నారన్న తెలంగాణ

### కేంద్ర జలసంఘం చైర్మన్ అధ్యతన సమన్వయ కమిటీ సమావేశం

### గోదావరి - కావేరి అనుసంధానం ప్రాజెక్టుపై పురోగతి

### బ్లూప్రింట్ తామే రూపొందిస్తామని కేంద్ర జలవనరుల సంఘం స్పష్టీకరణ


సిడబ్ల్యుసి చైర్మన్ రాజేంద్ర కుమార్ జైన్

**హైదరాబాద్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** తమకు నాగార్జున సాగర్‌లో తాగునీరు అవసరాలే అత్యంత ముఖ్యమని, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగానే శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం వినియోగంపై నిర్ణయాలు తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జల వనరుల సంఘం సమక్షంలో ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టం చేసింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) జల వివాదాలపై సమన్వయ కమిటీ సమావేశం సిడబ్ల్యుసి చైర్మన్ రాజేంద్ర కుమార్ జైన్ అధ్యక్షతన జరిగింది. ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై అధికారులు చర్చించారు. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని వెంటనే నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేయగా, తెలంగాణ దానిని తిరస్కరించినట్లు సమాచారం. శ్రీశైలం నుండి నీటిని నాగార్జునసాగర్‌కు తరలించేందుకు తెలంగాణ ఈ విద్యుత్ ఉత్పత్తిని ఒక సాకుగా వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ఆరోపించింది. దీనికి బదులుగా, ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి నిల్వలు ప్రభావితమైనందున తాము నీటిని చాలా పొదుపుగా వాడుతున్నామని తెలంగాణ స్పష్టం చేసింది. అలాగే, హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం దిగువన ఉన్న నాగార్జునసాగర్ వద్ద నీరు అవసరమని >>2

## సమాజ సేవతోనే వికసిత్ భారత్ సాధ్యం

### ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

### గ్రామీణాభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయమని ప్రశంసలు




**వెంకటాచలం (నెల్లూరు), సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** సమాజ సేవతోనే వికసిత్ భారత్ సాధ్యమని ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా 2001లో స్వర్ణభారత ట్రస్ట్ సేవా ప్రయాణం ప్రారంభమైందని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణం ప్రజా >>2

## 913 ఆశా పోస్టుల భర్తీకి నేడో రేపో నోటిఫికేషన్

### జీరో వేకెన్సీ విధానంలో డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు

### మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల ముంగిటకు వైద్య సేవలు చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించే ఆశా (సామాజిక ఆరోగ్య కార్యకర్త) కార్యకర్తల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీటి భర్తీతో రాష్ట్రంలోని ఆశా పోస్టులన్నీ భర్తీ అయినట్లవుతుందని పేర్కొన్నారు. జీరో వెకెన్సీ విధానంలో ఈ పోస్టుల భర్తీ చేపడుతున్నామని తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాల్లో 1,294 ఆశా పోస్టులను భర్తీ చేశామని, తాజా 913 పోస్టులతో కలిపితే మొత్తం 2,207 పోస్టులు భర్తీ చేసినట్లవుతుందని మంత్రి తెలిపారు. తాజా ఖాళీల్లో 673 గ్రామీణ, 64 గిరిజన, 176 పట్టణ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీ జరగనుంది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. సంబంధిత గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానిక మహిళల్లో పదో తరగతి కనీస అర్హత కలిగి, 25-45 ఏళ్ల మధ్య వయసున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నియమ నిబంధనలను అనుసరించి ఈ నెల 30వ తేదీ నాటికి నియామకాల జాబితాను పంపించాలని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు.

**జిల్లాల వారీగా పోస్టుల వివరాలు:** జిల్లాల వారీగా చూస్తే... అనకాపల్లిలో 77, కర్నూలులో 65, తూర్పుగోదావరిలో 44, అల్లూరి >>2


సోమవారం న్యూఢిల్లీలో తక్కువ ధరకే బియ్యం విక్రయం కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల

## తక్కువ ధరకే బియ్యం

### కెఎన్‌ఎం, బిపిటి వెరైటీలు అందుబాటులో ఉంచేలా చర్యలు

### ఎన్‌సిసిఎఫ్ ద్వారా నిత్యావసర సరుకులు సబ్సిడీతో విక్రయం

### పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఎపి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైస్ అవుట్‌లెట్‌ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతోతో మాట్లాడుతూ మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన,నాణ్యమైన మనఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకు >>2



## ఆక్వారంగ సమస్యలు పరిష్కరించకపోతే 'పంట విరామమ్మే' 2లో

- సిండికేట్, దళారీ వ్యవస్థలను రూపుమాపాలి
- రైతులకు న్యాయం జరిగేలా కనీస మద్దతు ధర కల్పించాలి
- ఆక్వా రైతు బతుకు పోరాటం సభ డిమాండ్
- అమలాపురం తరలివచ్చిన ఆక్వా రైతన్నలు

## ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి జెజెఎం-అమరజీవి జలధారలు

### రూ. 2,370 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు

### 25 లక్షల మంది ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత



**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టుల పనులు వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. యేడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలవారీ, వారాల వారీగా విభజించుకుని, ఎప్పటికప్పుడు పూర్తికావాల్సిన పనులపై సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా వేగంగా నిర్మాణం పూర్తి చేసి, గడువులోపు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్- అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందాలి. ప్రతి >>2

8-9pg2exHMNWJQE:8-9pg2exHMNWJQE.qxd 9/7/2026 11:37 PM Page 1





# పార్టీయే సుప్రీం

>> పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు బిఫారం ఇవ్వకుంటే మంత్రులు కాలేరని, ఎమ్మెల్యేలు కారని తేల్చిచెప్పారు. పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదనే విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయనేది నిరంతరం సమీక్షించుకుంటూ టిడిపి కేడర్ వెళ్లాలని సూచించారు. 'మై టిడిపి' యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నామని వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

# పార్టీ పెడుతున్నా!

## సిఎం అభ్యర్థిని నేను కాదు: విజయసాయిరెడ్డి

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరమని, అందుకే తాను జెన్‌జీ ఎక్కువ గుర్తింపును ఇస్తూ కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు మాజీ ఎంపి విజయసాయిరెడ్డి వెల్లడించారు. టిడిపి - వైఎస్ఆర్సీపీతో ప్రజలు విసిగిపోయారు.. అందుకే కొత్త పార్టీ పెడుతున్నట్లు తెలిపారు. నా పొలిటికల్ గాడ్ ఫాదర్స్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలే అన్నారు.. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో ప్రత్యేక సమావేశంలో విజయసాయిరెడ్డి తాను ఎందుకు పార్టీ పెడుతుంది అనే అంశాన్ని వివరించారు. తమ పార్టీకి కీలకంగా 5 అంశాలపైనే మా నూతన మేనిఫెస్టో ఉంటుందన్నారు. దసరా తర్వాత పార్టీ ఆవిర్భావం జరుగుతుందన్నారు. జెన్‌జీకి 66శాతం సీట్లు. కేటాయిస్తామన్నారు. రైతులకు, గృహావసరాలకు ఉచిత కరెంటు అందిస్తామన్నారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు.

ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసిపి, టిడిపిల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. టిడిపి, వైసిపిలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. 'అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపి విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బిసిలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని, తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. "తన పార్టీకి తాను సిఎం అభ్యర్థిని కాద్ను అని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం మెంటర్‌ని మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. ఇప్పటివరకూ అధికారానికి దూరమైన కులాల నుండే సిఎం అవుతారని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రతి ఎకరాకూ నీరు

>> మరింత మెరుగ్గా ఫలితాలను సాధిద్దామని నేతల్లో ఉత్సాహం నింపారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో తన జన్మ ధన్యమైందని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాలను చూసి అక్కడి ప్రజల కళ్లల్లో ఆనంద భాష్పాలు వచ్చాయని తెలిపారు. ఎల్ నినో విపత్తుపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజల్ని భాగస్వాములు చేయాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు, వెలిగొండ, పోలవరం ఎడమ కాల్వ ప్రారంభోత్సవాల్లో ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. జిల్లాలు నియోజకవర్గాలవారీగా విజన్‌ప్లాన్ ఇచ్చామని పరిపాలనా వెసులుబాటు కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు సమర్ధ నాయకత్వం వహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తున్నామని పొలిట్‌బ్యూరో, చట్టసభల్లోకి తీసుకు వచ్చామన్నారు. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్త బలంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ బలపడటం ఎంత ముఖ్యమూ కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని సిఎం దిశానిర్దేశం చేశారు. ఫొటోల గురించి ఫ్లెక్సీల గురించి వివాదాలు వద్దని కూటమిగా కలిసి క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. 2024 కంటే ఎక్కువ ఓట్లు వచ్చేలా పనిచేయాలని అన్నారు. పనిచేయటంతో పాటు చేసిన పనిని సమర్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లటం కూడా ముఖ్యమన్నారు.

**వాటర్ మాన్‌కు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ అభినందన**

అంతకు ముందు కాన్ క్లేవ్‌లో 'సిఇఒ సిఎం టూ వాటర్ మ్యాన్' అంటూ ఎకనామిక్ టైమ్స్ రాసిన కథనంపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి అభినందన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటికి ప్రాధాన్యం ఇచ్చి తెలుగు యువతను ఐటి నిపుణులుగా మార్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణతో వాటర్ మ్యాన్‌గా మారారని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా వివిధ ప్రాంతాలకు జల వనరులు అందించేలా డ్రిప్ ఇరిగేషన్ సహా వివిధ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారని ఆ కథనంలో పేర్కొందని మంత్రి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా ఎపికి సిఇఒగా మారిన సిఎం.. ప్రస్తుతం నీటి విలువను గుర్తించి వాటర్ మాన్‌గా రూపాంతరం చెందారని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. సాగునీటి రంగంపై చేస్తున్న కృషికి గానూ తెలుగుదేశం పార్టీ నేతలంతా స్టాండింగ్ ఓవేషన్‌తో ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

**నాయకత్వానికి చిరునామా టిడిపి**

నాయకత్వానికి కేరాఫ్ ఆడ్రస్ తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "సమర్ధ నాయకత్వంతోనే సమస్యల పరిష్కారం దొరుకుతుంది. వర్తమానాన్ని అర్ధం చేసుకుని భవిష్యత్తును అంచనా వేయాలి. గత పాలకులు రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై నిలబెట్టారు. వ్యవస్థలను విధ్వంసం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమిగా ప్రజల మద్దతు దక్కించుకున్నాం. పాలకుడు ఏ విధంగా ఉండకూడదో అనే దానికి గత పాలకుడే ఓ కేస్ స్టడీ. కేంద్ర సహకారంతో ఇచ్చిన హామీల అమలుకు అనునిత్యం పనిచేస్తున్నాం. అభివృద్ధి- సంక్షేమం- సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ పాలన చేపట్టాం. నెలకు నాలుగు రోజులు తక్కువ కాకుండా క్షేత్రస్థాయిలో ఉంటున్నాను. పేదల సేవలో, మీ భూమి- మీ హక్కు, స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర, సంజీవని కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం అవుతున్నాను. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం... ప్రైవేట్ స్కూళ్లకు గుడ్ బై చెప్పి ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నారు. 63 లక్షల మందికి రూ.73 వేల కోట్ల మేర పింఛన్ ఇప్పటికే పంపిణీ చేశాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్ల, ఆటో డ్రైవర్ల సేవలో, నేతన్నల సేవలో, దీపం, మత్స్యకారుల సేవలో వంటి చాలా సంక్షేమ కార్యక్రమాలుచేపట్టాం. మెగా డిఎస్సీ ద్వారా టీచర్ల రిక్రూట్మెంట్ చేశాం. ఒక్క డిఎస్సీ కూడా పెట్టని వ్యక్తి మనపై విమర్శలు చేస్తున్నారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం. నిర్దేశిత గడువులోగా పోలవరం, అమరావతి పూర్తి అవుతాయి. 28 పాలసీలతో 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పరిశ్రమలు గ్రౌండ్ అవుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ లాంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర ఇప్పుడు అభివృద్ధికి కేంద్రం. అమరావతి క్వాంటం టెక్నాలజీతో పాటు నాలెడ్జి హబ్‌గా మారుతుంది. రాయలసీమ రైజింగ్ నినాదంతో గోల్డ్ ఫీల్డ్, ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ వచ్చాయి. త్వరలో హార్టికల్చర్ హబ్‌గా మారుతుంది. డేటా ఇంటిగ్రేషన్ ద్వారా పౌరసేవల్ని సులభతరం చేశాం. రెవెన్యూ సమస్యల పరిష్కారం తో పాటు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తాలు అందిస్తున్నాం. క్యూఆర్ కోడ్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తున్నాం. 22 ఏ భూముల వివాదాన్ని పరిష్కరిస్తున్నాం. దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరిస్తే ప్రజా ప్రతినిధులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటార్ను అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ఫేక్ ప్రచారానికి ఫ్యాక్ట్‌తో గట్టిగా కౌంటర్**

వైసిపి చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దని ఫ్యాక్ట్‌తో గట్టిగా కౌంటర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతలకు దిశానిర్దేశం చేశారు. గొడ్డలి పార్టీ ఉగ్రవాదుల తరహాలో హిట్ -రన్ - హైడ్ విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఓ మంచి పనిపై విమర్శలు చేసేందుకు గొడ్డలి పార్టీ సిద్ధంగా ఉంటోదన్నారు. గతంలో టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డంగా ఉన్నప్పటికీ పనులు పూర్తి కాకపోయినా వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం అంటూ డ్రామాలాడారన్నారు. ఆ ప్రాజెక్టును ఇప్పుడు పూర్తిచేసిప్రారంభిస్తే అది అప్పుడే పూర్తి చేసేశామని మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరసిస్తే గోదావరి జలాలు కావు పురుషోత్తపట్నం నుంచి వచ్చాయంటున్నారని, కానీ ఆ ప్రాజెక్టుకు గొడ్డలి పార్టీ నాడు అడ్డుపడిందని గుర్తు చేశారు. ఆ పార్టీ చేస్తున్న వక్రీకరణలకు దిమ్మతిరిగేలా సమాధానం చెప్పాలన్నారు. ఎపిపిఎస్సీలో అడ్డగోలుగా అక్రమాలు చేశారని అడుగడుగునా అవకతవకలకు పాల్పడ్డారన్నారు. అసెంబ్లీలో చర్చిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రజలు చూస్తారనే భయం వారిలో ఉందని అన్నారు. బయట కూర్చుని అసత్యాలు అదే పనిగా చెబుతారని ఎద్దేవా చేశారు. సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్ స్టా గ్రామ్‌లో యాక్టివ్ గా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు మరింతగా ఎదిగేందుకు పూర్తిగా సహకరిస్తామని వారు కూడా అదేస్థాయిలో పనిచేయాలని అన్నారు. నాయకత్వాన్ని పెంచుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని పార్టీకి బలం చేకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## ఆక్వారంగ సమస్యలు పరిష్కరించకపోతే

# 'పంట విరామమే'

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** ఆక్వా రంగాన్ని నమ్ముకున్న రైతులను నష్టాల ఊబిలోకి నెడుతున్న స్థిరీకరణ లేని ధరల పెంపుదలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఆక్వా రైతు సంఘ అధ్యక్షుడు గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజు పిలుపు నిచ్చారు. సెప్టెంబరు నెలాఖరులోగా మేతల తయారీదారులనుంచి సానుకూల నిర్ణయం వెలువడకపోతే ఆ కంపెనీలకు చెందిన మేతల కొనుగోళ్లు నిలిపివేయాలని, వచ్చే యేడాది నాటికి పంటకాలం పూర్తిచేసుకుని ఆతరువాత పంట వేయకుండా పంట విరామం చేయాలని ఆయన రైతులకు ఉద్బోదించారు. ఆక్వారంగంలో ఎదుర్కొంటోన్న సమస్యలపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఛలో అమలాపురం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆక్వారైతు బ్రతుకు పోరాట సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న ఆక్వా రైతు సంఘ నాయకులు, రైతులు భారీ స్థాయిలో తరలివచ్చారు.అంతకుముందు వై.జంక్షన్ నుంచి సభావేదిక వరకు భారీగా ఆక్వారైతులంతా ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ తరలివచ్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆక్వారైతు సంఘ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్రం నుంచి తరలివచ్చిన నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈసందర్బంగా రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రంగంలో సీడ్ దశ నుంచి పంట చేతికి వచ్చి రొయ్యల ఎగుమతివరకు ఆక్వారైతులు దగాపడుతున్నారన్నారని అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు స్థిరంగాఉన్నా కానీ రైతుల వద్ద తక్కవకు కొనుగోలు చేస్తు న్నారని ఆరోపించారు. ప్రభుత్వం చొరవ చూపించి ఆక్వారంగంలో తిష్టవేసిన సిండికేట్, దళారీ వ్యవస్థలను రూపుమాపాలని కోరారు. సమస్యలు పరిష్కారం చూపకుంటే వచ్చే యేడాది మార్చి తరువాత పంటలు వేయకుండా రైతులంతా పంట విరామం ప్రకటించాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగేలా కనీస మద్దతు ధరకల్పించాలన్నారు. అప్సడాచట్టం రైతులకు నిరుపయోగంగా ఉందన్నారు. ఆక్వారైతుల సమస్యలపరిష్కారానికి పంటవిరామమే శరణ్యం అన్నారు. ఆక్వా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం మాట్లాడుతూ ఆక్వాలో సిండికేట్ వ్యవస్థ లేకుండా చేసి భారంగా మారుతోన్న ఆక్వామేతల ధరలను స్థిరంగా ఉండేలా చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతు వరుస నష్టాలతో చావు బ్రతుకుల మధ్య పోరాడుతున్నాడన్నారు. దేశ రక్షణలో జవాన్ మరణానికి ఎదురొడ్డి ఎలా తప్పక పోరాటం చేస్తాడో ఆక్వా సాగులో కూడా రైతు అదే స్థితిలో నష్టాల ఊబిలో కూడా సాగును కొనసాగిస్తున్నాడన్నారు. ఆక్వారంగంలో రైతులు ఎదుర్కొంటోన్న సమస్యలపై పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఫీడ్ ధరలు తగ్గించుకుంటే 30 వ తేదీ తరువాత ఆ ఫీడ్ కంపెనీలును బ్యాన్ చేస్తామని, 57 జీవోలో ఉన్న పవర్ ఫ్యాక్టర్ నిభందన తొలగించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 12500 విద్యుత్తు కనెక్షన్లను వెంటనే విద్యుత్తు సబ్సిడీ అమలు చేసి లోపాలను సరిదిద్దుకోవడానికి సమయం ఇవ్వాలని, ధరల విషయంలోఉన్న అస్థిరతను సరిచేసి గతంలో ఉన్న వేరియేషన్‌ను కొనసాగించాలని, అలాగే ప్రతీ పది రోజులకు మార్కెట్ రేటు నిలకడగా అమలు చేయాలని తదితర తీర్మానాలు చేసి అల్టిమేట్ జారీచేశారు. ఈదరి యశ్వంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ ముదునూరి శ్రీహరి వర్మ, దాట్ల పృధ్వీరాజు, అల్లూరి రమేష్ రాజు, యాళ్ల వెంకటానందం, కాకర్ల వినాయకం, మేడిది జాన్ డేవిడ్ రాజు, చిలికాని సూర్యారావు, కొటికలపూడి కృష్ణశ్రీ, బోస్ రాజు, కొప్పుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సిడబ్ల్యుసిలోనూ జలజగడం

>> తెలిపింది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం జరిగిండే సాగర్ నీటి అవసరాలు తీర్చడానికి అని, దీని కోసం శ్రీశైలంలో జల విద్యుదుత్పత్తి చేసి నీటిని సాగర్కి పంపించాల్సిన అవసరం ఉందని తెలిపింది. మరోవైపు, శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్స్ వద్ద ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి నీటిని తరలిస్తోందని తెలంగాణ గుర్తు చేసింది. పోతిరెడ్డి పాడు ద్వారా 34 టిఎంసిల నీటిని తరలించేందుకు అనుమతి ఉండగా, ఆంధ్ర ఇప్పటికే 30టిఎంసిలను తరలించిందని తెలంగాణ కేంద్ర జలసంఘంకి వివరించింది. తరలించిన నీటిలో తాగునీటి అవసరాల కోసం కేటాయించిన పరిమితిని ఎపి ఇప్పటికే దాటిందని, తెలంగాణపై వేలెత్తి చూపే ముందు ఆంధ్రప్రదేశ్ ముందుగా పోతిరెడ్డిపాడువద్ద అదనంగా నీటినితరలించడం ఆపాలని సమావేశంలో తెలంగాణ అధికారులు ఎపి అధికారులకు సూచించినట్లు తెలిసింది.

**గోదావరి- కావేరి నదుల అనుసంధానంపై పురోగతి:**

గోదావరి కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు అంశంపై కూడా ఈ సమావేశంలో కొంత స్పష్టత వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికను (బ్లూప్రింట్) తామే రూపొందిస్తామని సిడబ్ల్యుసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు స్పష్టం చేసింది. గోదావరి నీటిని కావేరికి తరలించేందుకు తెలంగాణలోని సమ్మక్క సాగర్ బ్యారేజీని "ఆఫ్‌టేక్ పాయింట్" (నీటిని మళ్లించే కేంద్రం)గా ఎంపిక చేసే అవకాశం ఉంది. అయితే, ఆంధ్రప్రదేశ్ తన పోలవరం ప్రాజెక్టును ఆఫ్‌టేక్ పాయింట్‌గా చేయాలని పట్టుబడుతుండటంతో దీనిపై కొన్ని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ అది అమలైతే, గోదావరి నీటి వాటా విషయంలో తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరువు నివారణ చర్యల్లో భాగంగా 2013కి ముందే గుర్తించిన 25 ప్రాజెక్టులలో, ప్రస్తుతం తెలంగాణ పరిధిలో ఉన్న 22 ప్రాజెక్టులకు సంబంధించి ఎటువంటి మార్పులకూ అంగీకరించబోమని తెలంగాణ స్పష్టం చేసినట్లు సమాచారం. గోదావరి నదిలో నీటి లభ్యతను తిరిగి అంచనా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ఆ ప్రతిపాదనను వ్యతిరేకించింది. అలాగే, ప్రస్తుతం ఉన్న నీటి కేటాయింపులు పంపిణీ ఒప్పందాలే కొనసాగాలని కేంద్ర జల సంఘం కు తెలియజేసింది. దీనిపై స్పందించిన సిడబ్ల్యుసి, తమకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని మా దృష్టికి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది.

## వారం - వర్జ్యం

08-09-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి. ద్వాదశి మ.2.44. న. పుష్యమి సా.4.41
వ. తె.4.44 - ఉ.6.14
దు.ఉ.8.22 - ఉ.9.11
2) రా.11.11- రా.12.00
రాహు.ఉ.9.00-ఉ.10.30,
శుభ స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. పనులలో విజయం సాధిస్తారు. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు.

**వృషభం :** కొత్త మిత్రులతో పరిచయాలు. వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మిథునం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**కర్కాటకం :** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**సింహం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ముఖ్యవ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్వల్ప ధనలాభం.

**కన్య :** దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు, ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. శ్రమకు తగిన ఫలితం పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**తుల :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు ముందుకు సాగవు.

**వృశ్చికం :** ఇంటా బయట అనుకూల వాతావరణం నెలకొంటుంది. కొత్త మిత్రుల కలిసి విలువైన సమాచారం అందుతుంది.

**ధనుస్సు :** దూరపు బంధువులను కలిసి ఉత్సాహంగా గడుపుతారు. ముఖ్యపనులలో విజయం సాధిస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం :** పనుల్లో జాప్యం జరుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది.

**కుంభం :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. పనులలో ఏర్పడిన ఆటంకాలు కొంత వరకు తొలగుతాయి.

**మీనం :** కొత్త పనులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తి చేస్తారు. పాత మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ప్రయాగ్‌రాజ్‌లోని దశశ్వమేథ్ ఘాట్ వద్ద భారీ వర్షాల కారణంగా గంగానదిలో పాక్షికంగా మునిగిన ఓ గోపురం

# సమాజ సేవతోనే వికసిత్ భారత్ సాధ్యం

>> మందిరంలో సోమవారం నిర్వహించిన "స్వర్ణభారత్-సేవా హారతి" 25 వసంతాల సేవోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 యేళ్ల ప్రస్థానం, స్వర్ణ భారత ట్రస్ట్ 25 యేళ్ల ప్రస్థానం ఒకేసారి పూర్తి కావడం ఆనందదాయకం అన్నారు. గ్రామాలే భారతదేశానికి బలమైన పునాదులు భారతదేశంలో గ్రామాలు ఒకప్పుడు జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, జల సంరక్షణ, ఆర్థిక వ్యవస్థకు కేంద్రాలుగా ఉండేవని యోగి తెలిపారు. పశుపోషణ, గ్రామీణ చేతివృత్తులు, ఉత్పత్తి వినియోగం వంటి అన్ని అంశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉండేవని వివరించారు. మహాత్మా గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్యం నానాజీ దేశ్‌ముఖ్ రూపొందించిన చిత్రకోట గ్రామీణ అభివృద్ధి నమూనా స్ఫూర్తితో స్వర్ణ భారతి ట్రస్ట్ గ్రామీణ సాధికారతకు కృషిచేసిందని ప్రశంసించారు. గ్రామీణప్రాంతాల సమగ్రవికాసం, నిస్వార్థ ప్రజాసేవలో గత 25 సంవత్సరాలుగా స్వర్ణభారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముప్పవరపు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా అక్షర విద్యాలయ ప్రాంగణాన్ని, సోమా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించిన సిఎం యోగి ఆదిత్యనాథ్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు, ట్రస్ట్ శిక్షణార్థులతో ముచ్చటించారు.

# శాంతి ద్వారా సమాజం అభివృద్ధి

## ప్రతి ఒక్కరూ సేవాభావం అలమార్చుకోవాలి

## పూర్వపు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**వెంకటాచలం (నెల్లూరు) సెప్టెంబరు 7 ప్రభాతవార్త :** సమాజంలో శాంతి లేకపోతే మనగూడ సాధించడం కష్టమని, ప్రతి ఒక్కరూ సేవాభావం అలవార్చుకోవాలని పూర్వపు ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. వెంకటాచలంలోనే స్వర్ణ భారత్ ట్రస్టులో 25 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్స కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కలిసి వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. ముందుగా స్వర్ణ భారత ట్రస్ట్ 25 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు అన్ని క్షుణ్ణంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వర్ణ భారతి ట్రస్ట్ దీప వెంకట్, చైర్మన్ కామినేని శ్రీనివాస్, ట్రస్టుద్వారా చేస్తున్న కార్యక్రమాలను సందర్శించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలోనే ప్రజలకు విద్య,వైద్యం వ్యవసాయం మహిళలకు యువకులకు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా తయారుచేసి వాళ్లకు శిక్షణ ఇచ్చి సొంత కాళ్లపై నిలబడే విధంగా తయారు చేయడం స్వర్ణ భారతి ట్రస్ట్ ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు సేవాభావం అలవరుచుకుని తమ సంపాదనలో కొంత భాగం సేవకు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు పి.నారాయణ, సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుల బీద మస్తాన్ రావు జిల్లా కలెక్టర్ హిమాన్ శుక్ల తదితరులు పాల్గొన్నారు.

# పోస్టుల భర్తీకి నేడో రేపో నోటిఫికేషన్

>> సీతారామరాజు జిల్లాలో 43, పార్వతీపురం మన్యంలో 43, పశ్చిమగోదావరిలో 42, అన్నమయ్యలో 41, ప్రకాశంలో 38, వైఎస్సార్ కడపలో 38, కృష్ణాలో 37, విశాఖపట్నంలో 33, చిత్తూరులో 32, కోనసీమలో 32, పల్నాడులో 31, విజయనగరంలో 31, కాకినాడలో 29, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరులో 29, ఏలూరులో 27, అనంతపురంలో 26, మార్కాపురంలో 25, శ్రీ సత్యసాయి జిల్లాలో 22, శ్రీకాకుళంలో 22, గుంటూరులో 21, నంద్యాలలో 21, పోలవరంలో 21, తిరుపతిలో 21, ఎన్టీఆర్ జిల్లాలో 15, బాపట్లలో 7 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

**నెలకు రూ 10,000 వేతనం:**

ఒక్కో ఆశా కార్యకర్తకు నెలకు రూ.10 వేల చొప్పున వేతనం లభిస్తుంది. ఇందులో రూ.8,320 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ద్వారా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్రతి యేడాది ఆశా కార్యకర్తలకు వేతనాల రూపంలో రూ.513 కోట్ల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.426.84 కోట్ల వరకు భరిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

# జెజెఎం-అమరజీవి జలధారలు

>> నరేంద్ర మోడీ 'జల్ జీవన్ మిషన్' సంకల్పాన్ని ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధారల్ను'గా ముందుకు తీసుకువెళ్తున్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నారు. అందులో మొదటి విడతగా రూ.7,910 కోట్లతో ఐదు జిల్లాల పరిధిలో చేపట్టిన ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ.2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద నిర్మాణం చేపట్టిన ఒక ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, అందులో మూడు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఏడు నీటి సంపులు, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర 167 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలని పవన్ కల్యాణ్ సూచించారు.

# తక్కువ ధరకే బియ్యం

>> వచ్చినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కెఎన్ఎం, బిపిటి వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సిసిఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎపి భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఎకె జైన్, ఎపి భవన్ అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌ని మంత్రి కలిశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. అనంతరం, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని నాదెండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం.

8-9pg3fTCL:8-9pg3fTCL.qxd 9/7/2026 11:20 PM Page 1






# సంక్షేమాన్ని మాటల్లోనే కాదు,. గణాంకాల్లో కూడా చూపిస్తున్నాం

- ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం
- తెలుగుదేశం లీడర్ షిప్ కాంక్లేవ్‌లో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని, ప్రతి కుటుంబానికి అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కేవలం రెండేళ్లలో 90శాతం అమలు చేశామని, మాటల్లో కాకుండా గణాంకాల్లో కూడా చూపిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రైతు, మహిళ, విద్యార్థి, బిసి, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ అండగా నిలుస్తున్నామన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన తెలుగుదేశం లీడర్ షిప్ కాంక్లేవ్ సందర్భంగా మంత్రి సవిత ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం భారీగా నిధులు ఖర్చు చేసి, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంగా నిలిచామని తెలిపారు. 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనిలో భాగంగా రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. పేదలందరికీ విద్య హక్కు కల్పించడంలో భాగంగా తల్లికి వందనం పథకంలో భాగంగా ఏటా 67.27 లక్షల మంది విద్యార్థులకు ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఇందుకోసం రెండేళ్లలో రూ.20,090 కోట్లు ఖర్చు చేశామని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలోనే తల్లికి వందనం కింద 32,969 మంది విద్యార్థులకు రూ.49.45 కోట్లు అందించామని, ప్రతి విద్యార్థి చదువుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికీ ఏటా రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. రెండేళ్లలో 46 లక్షల మంది రైతులకు రూ.14,664 కోట్లు పెట్టుబడి సాయంగా అందించామన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ లక్ష్యమన్నారు. 31.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1,100 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టామని, ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ఇందుకోసం రూ.3,218 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మహిళల వంటింటి భారం తగ్గించేందుకు దీపం2 పథకంలో 4.57 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. గ్యాస్ సబ్సిడీ కోసం రూ.3,800 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పెనుకొండలో దీపం2 పథకం కింద 5.74 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని, ఇందుకోసం రూ.49.25 కోట్ల సబ్సిడీని అందజేశామని మంత్రి సవిత తెలిపారు.

**బిసిల రాజకీయ సాధికారతే లక్ష్యం..**

బిసిలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించామని, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బిసిలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామన్నారు బిసిల రాజకీయ సాధికారతే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల్లోనూ 34 శాతం రిజర్వేషన్ల కోసం ముందుకు సాగుతున్నామన్నారు. గత ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. దాని వల్ల 16,800 రాజకీయ పదవులను బిసిలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బిసిలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి కృషి చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**బిసిల ఆత్మగౌరవానికి పెద్దపీట.**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 బిసి కులాల ఆత్మగౌరవానికి, రక్షణకు పెద్దపీట వేస్తూ, బిసి ప్రొటెక్షన్ యాక్ట్2026 తీసుకురావడానికి చర్యలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. బిసిల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, 50యేళ్లు పైబడిన 1,30,796 మంది మత్స్యకారులకు రూ.505 కోట్ల మేర పింఛన్లు అందించామని తెలిపారు. వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. చేనేత కార్మికులకు కూడా అండగా నిలిచామని, 50 ఏళ్లు పైబడిన 85,940 మంది చేనేత కార్మికులకు రూ.844 కోట్ల పింఛన్లు అందించామని తెలిపారు. 62,541 నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. నేతన్నల సేవలో పథకం కింద మగ్గం కలిగిన ప్రతి నేతన్నకూ రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.

**మాటల్లో కాదు గణంకాల్లో చూపిస్తున్నాం**

దివ్యాంగుల సంక్షేమంలోనూ కూటమి ప్రభుత్వం ముందుందని మంత్రి సవిత తెలిపారు. దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఆత్మగౌరవం కోసం 1,750 మందికి మూడు చక్రాల వాహనాలు అందించామని, ఇందుకోసం రూ.18.47 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పేదల సంక్షేమానికే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. రైతు, మహిళ, విద్యార్థి, బీసీ, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమాన్ని కేవలం మాటల్లో కాకుండా గణాంకాల్లో చూపిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

## ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.11 కోట్ల విరాళం



**తిరుమల, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న వివిధ పథకాలు, ట్రస్ట్‌లకు దాతలైన భక్తులు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. తాజాగా సోమవారం హైదరాబాద్‌కు చెందిన కుంచాల మధురాం రెడ్డి టిటిడి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.11 కోట్ల భారీ విరాళాన్ని అందించారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బి.ఆర్ నాయుడును కలిసి దాత ఈ విరాళాన్ని అందజేశారు. గోసంరక్షణ, గోసేవకు పెద్దపీట వేస్తున్న టిటిడికి అండగా నిలిచి, భారీ విరాళం అందించినట్లు దాత మధురాం రెడ్డి తెలిపారు.

## ఎపి జల్‌జీవన్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్‌కు అధికారిక గుర్తింపు

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎపి జల్‌జీవన్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్‌కు అధికారిక గుర్తింపు దక్కింది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి చేర్చుతూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. నిధుల సమీకరణ, పనుల వేగవంతంపై కార్పొరేషన్‌కు స్వయంప్రతిపత్తి హోదా దక్కింది. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి మంచినీరు అందించాలని ప్రభుత్వ భావిస్తుంది.

## డిఎస్సీపై ఆరోపణలు నిరాధారం

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ వైస్ ఛైర్మన్ అండ్ ఎండి భరణి ఖండన

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి మెగా డిఎస్సీ 2025 నియామకాలపై వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. స్పోర్ట్స్ కోటా సహా ఇతర నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేసింది. అమరావతిలోని విద్యాభవన్‌లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ ఛైర్మన్ అండ్ ఎండి భరణి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పోర్ట్స్ కోటా ఎంపికలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరిగాయని శాప్ ఎండి భరణి తెలిపారు. తుది జాబితాకు ముందు 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించామని, ఆ సమయంలో జూడో సర్టిఫికెట్లపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని వివరించారు. ప్రస్తుతం హైకోర్టులో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా డిఎస్సీ నియామకాలు పూర్తయిన ఏడాది తర్వాత దాఖలైందని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో రాత పరీక్ష మార్కులతో సంబంధం లేకుండా క్రీడాకారుల ప్రతిభకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, ఇది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధారణ ప్రక్రియ అని స్పష్టం చేశారు. కొందరు క్రీడాకారులపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు ఖండించారు. బాక్సర్ పెద్ద అప్పల రాజు విషయంలో ఆన్‌లైన్‌లో పొరపాటున సోదరుడి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసినా, తర్వాత సరిదిద్దుకున్నారని, ఆయన పత్రాలన్నీ నిజమైనవేనని నిర్ధారించుకున్నామని తెలిపారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టిడిపి ఎమ్మెల్యే కోన రవికుమార్ సంతకం చేయడంపై మాట్లాడుతూ జాతీయ సమాఖ్య అధికారికంగా అనుమతి ఇచ్చినందునే ఆయన సంతకం చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధం కాదని స్పష్టం చేశారు.

# ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ మధ్య అమరావతిలో అభివృద్ధి కారిడార్లు, టౌన్ షిప్పులు

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధానికి పటిష్టమైన రవాణా వ్యవస్థకు ఏర్పాటు చేసే దిశలో అత్యంత వేగవంతంగా చర్యలు చేపట్టింది. నగరం చుట్టూ ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్లు, రైల్వే లైన్ ఏర్పాటుతోపాటు వాటి మధ్యలో ఉండే ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి కారిడార్‌గా మార్చనున్నారు. ఈ మేరకు 2018 ఫిబ్రవరి 12న జరిగిన సిఆర్డిఎ 14వ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుతం అమలు చేస్తున్నారు. రాజధాని అభివృద్ధి చెందాలంటే చుట్టుపక్కల ఆర్థికపరమైన ప్రాజెక్టులు రావాల్సి ఉందని ప్రభుత్వం చెబుతోంది. దీనికి అనుగుణంగానే కార్యాచరణ ప్రారంభించిన ప్రభుత్వం ఈ ప్రాంతంలో 20 వరకు టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయనుందని సమాచారం. ఈ మేరకు ఇప్పటికే తాడికొండ మండలం మోతడకలో భూ సమీకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఆయా గ్రామాల్లో రెండు మూడు దశల పూలింగులో తీసుకునే ప్రక్రియ జరుగుతోంది. కొత్తగా తాడికొండ, కంతేరు, పెదకాకాని మండలం పరిధిలోని కొప్పురావూరు గ్రామాల్లోనూ రైల్వేలైనుకు అవసరమైన భూములు తీసుకునే ప్రక్రియ సాగుతోంది. రెండు రోడ్ల మధ్యలో 20 వరకూ టౌన్ షిప్ప నిర్మించడం ద్వారా, ఆ ప్రాంతంలో భూముల విలువ పెరగడం ద్వారా పన్నుల రూపంలో ఆదాయం వస్తుందని అప్పట్లో ప్రభుత్వం ఆలోచన చేసింది. మొత్తం 96.16 కిలోమీటర్ల దూరం నిర్మించే ఈ రోడ్డు అమరావతి రాజధానికి కీలకం కానుందనీ 2018లోనే అప్పటి సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇన్నర్ రింగురోడ్డు నిర్మించడం ద్వారా రాజధాని పరిధిలో ఉండే 26 రోడ్లను దానికి కలపనున్నారు. తూర్పు పడమర వైపునకు నిర్మించే ఈ సిరీస్ రోడ్లలో 1, 2, 3, 4, 5, 6, 9, 10, 11, 12, 13, 14, 15, 16 రోడ్లను ఐఆర్ఆర్కు అనుసంధానం చేయాలని మాస్టర్లనులో పేర్కొన్నారు. అలాగే ఉత్తరం నుండి దక్షణం వైపునకు 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17 రోడ్లను అనుసంధానం చేయాలని మాస్టర్ ప్లానులో పేర్కొన్నారు. ఔటర్ రింగురోడ్డు మొత్తాన్ని జాతీయ రహదారుల విభాగం నిర్మించనుండటంతో, ఐఆర్ఆర్ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సి ఉంటుంది. దీనికి అవసరమైన నిధులను అప్పట్లో ప్రపంచబ్యాంకు, జైకా నుండి తీసుకోవాలని నిర్ణయించారు. వీటి నిర్మాణంతోపాటు రాజధాని చుట్టూ ఉన్న మంగళగిరి రూరల్, తాడికొండ, అమరావతి, పెదకూరపాడు మండలంలో కొంతభాగం, ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లను భవిష్యత్ పట్టణీకరణ ప్రాంతంగా గుర్తించారు. పెదవడ్లపూడి-దుగ్గిరాల, కాజ- గుంటూరు, గుడివాడ- పామర్రు- బందరు- గన్నవరం అభివృద్ధి కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. తుళ్లూరు- సత్తెనపల్లి, పరిటాల-షేర్ మహ్మద్పేట ప్రాంతాల్లోనూ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ అంశాలన్ని అమరావతి రీజియన్ మాస్టర్ ప్లాన్ లో పొందుపరచనున్నారు. ఇప్పటికే అభిప్రాయ సేకరణ చేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. త్వరలోనే రీజయన్ మాస్టర్ ప్లాన్ కు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం,.


THE TIRUPATI DISTRICT GAZETTE
PART- I EXTRA ORDINARY
PUBLISHED BY AUTHORITY

GAZETTE No: 49360/2026 TIRUPATI DISTRICT DATED: 28.08.2026

Rc. G3/e-49360/2026 Dated: 28-08-2026

ఫారం నెం.VI(ఎ)

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునః స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావలి 2014 లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూల్ దాఖలా ఎ. 0.40 ట్లు భూములకు తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, శిరసనంబేడు గ్రామము నందు ప్రస్తుత పారిశ్రామిక వాడకు వెళ్ళే మార్గం కొరకు భూమి కావలయునని జోనల్ మేనేజర్, ఎపి.ఐ.ఐ.సి, తిరుపతి వారు భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టంవలన భూసేకరణ, పునరావాసం, పునః స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబందించిన యావన్మందికి ఇందుమూలముగా నోటిసు ఇవ్వడమైనది.

భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబములు ఏమియు లేవు.

శ్రీయుత జిల్లా కలెక్టర్, తిరుపతి వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్ 12(3జి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి, సూళ్ళూరుపేట వారికీ, వారి సిబ్బందికి మరియు పనివారాలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టం లోని సెక్షన్ 10(ఎ) మరియు రూలు (4)ననుసరించి ఈ భూ సేకరణ ప్రక్రియ లో సెక్షన్ 4 మేరకు సామజిక ప్రభావం అంచనా అధ్యయనం మినహాయించడమైనదని జిల్లా కలెక్టరు తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఆదేశించడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి, సూళ్ళూరుపేట వారి ముందస్తు అనుమతిలేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/కొనుగోలు(క్రయ విక్రయములు) లేదా ఏవిధమైన లవాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్నయెడల సంబందించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురింపబడిన తేది నుండి 60(అరువది) దినములలోగా శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి, సూళ్ళూరుపేట వారి యెదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును

షెడ్యూల్

జిల్లా : తిరుపతి మండలం: పెళ్లకూరు గ్రామం: శిరసనంబేడు

| వ.నెం. | సర్వే నెం. | పురావిస్తీర్ణం (ఎకరాలలో) | సేకరణక్రింద ప్రాంతం (ఎకరాలలో) | ప్రయోజనంగల వ్యక్తి, చిరునామా | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు, కట్టడములు ఏవైన ఉన్న యెడల వాటి వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 149-1B | 0.19 | 0.19 | డి.ఆర్.ఎస్. డెవెలపర్స్ ఎ.దేవానందం నాయుడు తండ్రి అబ్బూరు నారప్ప నాయుడు | 148 | 149-3B | 149-1C | 150, 149-1A | |
| 2 | 149-3B | 0.22 | 0.22 | వేలూరు మురళీకృష్ణా రెడ్డి తండ్రి జనార్ధన రెడ్డి | 149-1B | 150 | 149-3C | 150, 149-3A | |
| 3 | 150-2 | 0.06 | 0.06 | డి.ఆర్.ఎస్. డెవెలపర్స్ ఎ.దేవానందం నాయుడు తండ్రి అబ్బూరు నారప్ప నాయుడు | 150-1 | 150-1 | 149 | 150-1 | |
| 4 | 150-3 | 0.01 | 0.01 | డి.ఆర్.ఎస్. డెవెలపర్స్ ఎ.దేవానందం నాయుడు తండ్రి అబ్బూరు నారప్ప నాయుడు | 150-1, 149 | 162 | 149 | 150-1 | |
| | మొత్తం | 0.48 | 0.48 | | | | | | |

డా॥ వెంకటేశ్వర్ సలిజమాల I.A.S
కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్,
తిరుపతి జిల్లా

వార్త

అణుయుద్ధంలో విజయం సాధించాలంటే ఒక్కటే మార్గం, అసలు యుద్ధమే ఆరంభం కాకుండా చూడాలి.

న- బ్రాడ్లీ ఓమర్ నెల్సన్

# మరణ మృదంగం!


వామ్మో! 'చెవులు బద్ధలైపోతున్నాయి. ఇక ఆపుతారా'! అనే మాటలు తరచు వినే రోజులొచ్చేసాయి. శబ్ద వ్యాప్తిలో ఇదో కొత్త తతంగం. పక్కవాడు ఏమనుకుంటాడో అనే మర్యాదకూడా ఉండదు. ఎవడెలా పోతే నాకేంటి? అనే ధోరణి వచ్చేసింది. అదే ధోరణి ఇప్పుడు ఓ నిండుప్రాణాన్ని మింగేసింది. పట్టణాల్లో ఏ పండుగో, మతపరమైన వేడుకలో జరిగినప్పుడు డిజె సౌండ్‌లు విపరీతంగానే వినిపిస్తుంటాయి. నిజానికి ఇలాంటి కాలుష్యాన్ని అరికట్టే పరిధి పోలీసులకే ఉన్నందున పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మళ్లీఇప్పుడు వినాయక చవితి సందర్భంగా పందిళ్లు, సందళ్లు, తప్పవు. కొంత మంది వీటిని ఆహ్లాదంతో ఆహ్వానించినా, మరికొంత మంది శబ్దకాలుష్యాన్ని భరించలేక చెవులు మూసుకుంటారు. ఈ శబ్దకాలుష్యానికి పరిమితులుంటాయి. వీటిని పబ్లిక్ న్యూసెన్స్‌గా భావించే పరిస్థితి రానీయకూడదు. ఎంతో మంది అనారోగ్యానికి గురవకుండా ఆపడానికి ఇలాంటి విపరీత శబ్దసంకేతాలు మనిషి ఆరోగ్యానికి చేటు తెస్తుంటాయని వైద్య నిపుణులు చెబుతుంటారు. ఒక్కొక్కప్పుడు గుండెపోటుకు దారి తీస్తుంది. తాజాగా అలాంటి సంఘటన జరిగింది. నిజానికి ఆ శబ్దాలు విన్నంతసేపూ ఎవరికీ అవి మరణ మృదంగపు శబ్దాలు కాకూడదని ఆశిద్దాం. కానీ ఎక్కడైనా ప్రాణం పోయిన ఉదంతాలు తారసపడినప్పుడు మాత్రమే ఆ శబ్దాల భయంకర వికృత స్వభావం అర్థమౌతుంది. జనాన్ని ఒక్కోసారి ఆనందడోలికల్లోముంచెత్తే శబ్ద భావతరంగాల వికృత రూపం సామాజిక స్పృహకు అందని విషయం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డిజె ధ్వని ఒకరిని గుండెపోటుకు బలి చేసింది. శనివారం రాత్రి సిటీలోని రాంనగర్ వద్ద నిర్వహించిన గణేష్ ఆగమన్ కార్యక్రమంలో 18ఏళ్ల యువకుడు ఉన్నట్టుండి కుప్పకూలాడు. జనం ఉత్సాహభరితంగా ఊగిపోతూ పక్కన హఠాత్తుగా పడిపోయిన ఆ యువకుడ్ని పట్టించుకోలేకపోయారు అటు తన్మయత్వంలో గంతులేస్తూ పక్కన జరిగే విషయాలను పట్టించుకోలేని సామాజిక చైతన్యం మనది. కమ్మని గొంతుతో శృతియుక్తంగా పాడే పాటలు ఎన్నైనా ఎంత సేపయినా వినవచ్చునేమో! కానీ కర్ణకఠోరం గా ఉండే డ్రమ్ముల బీభత్సాన్ని వాటి నుంచి జనించే ధ్వనిని తట్టుకోవడం పెద్ద తరానికి అంత వీలైన పరిస్థితి కాదు. ఆధునిక సంగీత వాయిద్యాలు, పాశ్చాత్య పోకడలు జతకూడి 'శబ్దహింస'కు పాల్పడుతున్నాయంటే అతిశయోక్తి కానేరదు. డ్రమ్ముల మోతే కాదు మైకుల హోరు టపాసుల జోరు, యువకులు చిందులు వేస్తూ గోల చేయడం ఇవన్నీ శబ్దతీవ్రతను పెంచేవే. ఆయా మండపాల చుట్టుపక్కల ఉండే నివాస భవనాల్లో జీవిస్తున్న వారు ఈగగ్గోలు వినలేక చెవులు మూసు కున్నా తలపులు వేసుకున్నా రాత్రిళ్లు నిద్రపట్టే పరిస్థితి లేదు. డిజెసౌండ్ సిస్టమ్స్ మోత మరీ ఇబ్బంది కలిగిస్తోందనుకుంటే ఆ వెనుక వాయిద్యాల గోల మరింత చీకాకు కలిగిస్తోంది. ఇలాంటి ఆటపాటలకు, వినిపిస్తున్న శబ్దాలకు కూడా పరిమితులున్నాయి. వాటిని పాటించకపోవడం వలనే కొంత అసౌకర్యం కలుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో నిబంధనల మేరకు పాఠశాలలు, పారిశ్రామికవాడలు, జనావాస ప్రాంతాలు, ఆసుపత్రులు ప్రార్థనాస్థలాల వద్ద 'ధ్వని' ఏ మేరకు ఉండవచ్చో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలున్నా పాటించేటట్లు చూడాల్సింది స్థానిక పోలీసులే. వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా 'డిజె' కార్యక్రమ నిర్వాహకులు ఆడింది ఆట, పాడింది పాటే. ఎన్ని నిబంధనలున్నా ప్రస్తుత సిటీల్లో రెట్టింపు ధ్వని కాలుష్యం జనాన్ని బెంబేలెత్తిస్తోంది. 'డిజె'ల వాయిద్యాల నుంచి 100డిసిబెల్స్ వరకు ధ్వని వెలువడచ్చు కానీ 150 నుంచి 200 డెసిబెల్స్ వరకు ధ్వని తరంగాలు జనం మీద ప్రభావం చూపిస్తున్నాయి. బోనాలు, గణేష్, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ఈ బాపతు కార్యక్రమాలు జరుగుతుండటం పరిపాటి. కానీ వాటిని నిర్దేశిత రూపంలో పరిమితంగా పాటించడంలోనే అసలు ఇబ్బంది తలెత్తుతోంది. ఇలాంటి పరిస్థితులు ఒక్క హైదరాబాద్ సిటీకే కాదు దేశమంతటా ఉన్నాయి. పల్లెటూర్లకి వ్యాపించాయి. అయితే గ్రామాల్లో అయితే పెద్దలు, పెత్తందార్ల నియంత్రణ ఉంటుంది. కనుక కాస్త ఫర్వాలేదు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నివాసప్రాంతాల్లోపగటి పూట 55 డెసిబుల్స్, రాత్రిపూట 45 డెసిబుల్స్ మించ కూడదు. వైద్యశాస్త్ర ప్రకారం 85 డెసిబుల్స్ దాటితే వినికిడిలోపం వస్తుంది. 100 డెసిబుల్స్ దాటితే గుండె వేగం పెరుగుతుంది. రక్తపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు కూడా అవకాశముంది. పసిపిల్లలు, వృద్ధులు, హృద్రోగస్తులకు ప్రాణాంతకమే. ఆ మధ్య ఉత్తరప్రదేశ్‌లో 140 కోళ్ల డిజె శబ్దానికి గుండెపోటుతో చనిపోయాయని పోస్ట్ మార్టం నివేదికలో తేలింది. మూగజీవాలకు కూడా కీడు తెచ్చే శబ్దాన్ని మనుష్యులు తట్టుకోగలరనుకుంటే అది హాస్యాస్పదమే అవుతుంది. రాత్రి పది గంటల తర్వాత భక్తి పారవశ్యంతో చేసే భజనలకూ నియంత్రణ ఉంది. మామూలు లౌడ్‌స్పీకర్లు వాడకూడదు. పక్కనే చంటాడు గుక్కపెట్టి ఏడుస్తున్నా చీకాకుపడే మనం అంతంత ధ్వని కాలుష్యాన్ని ఎలా తట్టుకోగలంఅనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలకు అనుమతి అంశం పోలీసులకు అప్పగించారు. 100 డెసిబెల్స్ కన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న డిజె సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం తప్పనిసరి. 'డిజె' శబ్దాలు వినోదపు హద్దులుదాటి అంతిమయాత్రకు ఆహ్వానం పలుకుతోందని గుర్తించినప్పుడు వాటి నియంత్రణ, నిషేధంపై పూర్తి అధికారం పోలీసులకు ఇవ్వడం సర్వ మానవ శ్రేయస్సు కే. సంప్రదాయ వాయిద్యాలతో చేసుకునే వేడుకల్ని ప్రోత్సహించడం సర్వసమ్మతం కాగలదు.

మంచి ధానుష్కుడు వదిలిన బాణం ఒకర్ని చంపుతుంది. కాని అరాచక రూపంలో ఉన్న మేధావి ఆలోచన దేశాన్నంతటిని నాశనం చేస్తుంది.



చాణక్యుడు

శాస్త్రంలో అపార పరిజ్ఞానంగల మేధావి కఠిన పదాలను అతి తక్కువగా ప్రయోగిస్తాడు. అల్పజ్ఞాని మాత్రం అలాంటి పదాలపై మక్కువ చూపుతాడు.



హెర్మన్ మెల్‌విల్

# సర్! ఇదెక్కడి న్యాయం?

ప్రజలల్లో నలుగుతున్న అసలు సమస్యలు 'సర్' మాదిరి పరిష్కరించటానికి పూనుకుంటే ఎంత బాగుండేది? చట్టసభలల్లోని ప్రజా ప్రతినిధులు నిజాయితీగా తమ విధులు నిర్వహిస్తున్నారా? ఏమో తెలియని పరిస్థితి. ఇదివరకు శాసన సభలో, పార్లమెంటు సమావేశాలూ కనీసం 'అబ్బా ఇన్ని రోజులా' అన్నట్లు జరిగేవి! ఇప్పుడు సమావేశాలు చిటికెలోనే అయిపోతున్నాయా అనుకొనే పరిస్థితి వుందని బుద్ధిజీవులు అంటున్నారు! ప్రస్తుతం సర్ నోటీసుల పర్వం సాగుతున్నది! 60లక్షల మందికి నోటీసులు అందటంతో హైద్రాబాద్ లాంటి నగరంలో కొన్నిచోట్ల నుంచి 'ఎనామలి లిస్ట్' బయట పెట్టాలనే ఆందోళన పెరుగుతున్నది! లిస్టులు బయటపెట్టే ఆందోళన కొంతమేర తగ్గవచ్చు! దానితో లిస్టులు తీసుకొనేవారు (బియల్ఓలు ఇస్తారు) ఏయే కారణాల చేత నోటీసులు ఇస్తున్నారు అని తెలుసుకొనే అవకాశం వుంది! ఆ మధ్య ఒక పెద్ద మనిషి 'జోక్'గా 'ఈ నోటీసులు విడాకుల నోటీసులు ఇచ్చినట్లు వుంది' అని అన్న జోక్ వెనక బాధ గూడుకట్టుకొని వుంది.



రావులపాటి సీతారాంరావు

ఈ దేశంలో పుట్టి, బ్రిటిష్ వారి పాలన నుంచి విముక్తి కావాలని పరితపించిన ఈ దేశ ప్రజలు స్వాతంత్ర్యం తెచ్చుకున్న తర్వాత, 'ఓటు మా హక్కు' అని భావించి, ఎన్నికలు జరిగిన మొదటి సంవత్సరాలలో పండుగ వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకొని నిజమైన ప్రజాస్వామ్యానికి పురుడు పోసారు! ఆ ఫలాలు అనుభవిస్తున్న తరుణంలో పాలకులు తాము ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు చట్టాలు తమను సంప్రదించో, సంప్రదించకుండానో చేసినా పట్టించుకోలేదు! ఓటును రామబాణంగా, అయిదేళ్ళకొకసారి వినియోగించుకుంటున్నారు! పుట్టిన తర్వాత చట్టాలు పెట్టిన గడువు తర్వాతనే ఓటర్లు అయ్యారు! ఆ ఎన్నికల మొదటి రోజుల్లోనే ప్రజాస్వామ్య పరిధిలో ప్రభుత్వాలు నడుపుతున్న పాలకులూ అధికారులే, నిజమైన ఓటర్లుగా తమను గుర్తించారు! ఇన్నేళ్ళ తర్వాత 'సర్' అంటూ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)మా ఓటును మేమే కాపాడుకోవాల్సిన పరిస్థితిని ఏర్పరిచారు! దొంగ ఓట్లు వున్నవాళ్ళను, లొసుగులతో ఓటు హక్కు పొందిన వారిని, ఒకటికి మించి ఓట్లు వున్నవారిని, దేశంలో అనేక చోట్ల ఓట్లు వున్నవారిని, ప్రక్క దేశాల్లోంచి వచ్చి మోసం చేసి ఈ దేశ ఓటర్లుగా నమోదు కాబడ్డ వారిని ఏరేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది, ఎలక్షన్ అధికారులది! దానికోసం మేము నిజమైన ఓటర్లం ఎన్నో ఎన్నికలలో ఓట్లు వేసి గర్వంగా ఈ దేశ ఓటర్ను అని తలెత్తుకొని తిరుగుతున్న మేము ఇప్పుడు మీరు అందజేసిన ఫారాలను నింపి మేము నిజమైన ఓటర్లమని మీ ముందు నిరూపించుకోవాల్నా? ఇదెక్కడి న్యాయం? డాబుసరిగా పాలనా వ్యవస్థలను ఎన్నో పెట్టుకొని సర్, సర్ మా ఓటు నిర్ధారించండి సార్! అని మీ చుట్టూ తిరగాల్నా? మేము కట్టిన పన్నులతో మమ్మల్నే 'ఓటు దారు'గా నిరూపించుకోమని నిబంధనలు పెట్టారా? మీ 2002 సం॥తో మాకేం సంబంధం! ఆ తర్వాత జరిగిన అయిదు ఆరు జనరల్ ఎన్నికలలో అసలు సిసలైన ఓటర్లుగా వచ్చి మా ఓటు మేము వేసుకున్నాం కదా! నిందితులను, నేరస్థులను ఏదైనా నేరంలో పట్టుకొని మీరిచ్చిన ఈ సూచనతో పోలీసు వారు ఏ నిబంధననో ఉటంకిస్తూ (ఇప్పటికీ చేస్తునే వున్నారు) మమ్మల్ని క్యూలల్లో పోలీసు స్టేషన్ల ముందు నిలబెట్టి ఏదో నేరం నెపంతో ఫారాలు ఇచ్చి వివరాలు నమోదు చేసుకొనే వెసులుబాటు చిద్విలాసంగా వాడుకోవచ్చు గదా! ఈ ప్రభుత్వాలూ ఈ అధికారులూ ఎందుకు? వారు సేకరించాల్సిన వివరాలు మేము యివ్వాల్నా? ఇదేమి పాలన? మరి మీరెందుకు? కేవలం మామీద లేనిపోని చట్టాలను ఉటంకిస్తూ మామీద అధికారం చెలాయించటానికా? 'సర్' చక్కగా కుదిరింది! మేము మీ చుట్టూ 'సర్, సర్' అంటూ తిరగాలనే కదా మేము జీతాలు ఇస్తూ మా మీద పెత్తనం కోసం మిమ్మల్ని అధికారులుగా, పాలకులుగా చేసింది! చట్టాలు మా సౌకర్యం కోసం చేసారు! చేసేవాళ్ళు వాళ్ళ సౌకర్యాలు చూసుకోవటం లోనే నిమగ్నులయ్యే పరిస్థితిని మేమే కల్పించాం! మాకు భలేగా బుద్ధి చెబుతున్నారు! ఓటు లేకపోతే మాకు పూట గడవకుండా ఏమీ వుండదు! ఓటు



మాకెందుకు అని అసలైన ఓటర్లకు చిరాకు తెప్పించే ప్రయత్నంలో వున్న మేము ఏమీ అనలేం! మీరు చట్టబద్ధంగానే పనిచేస్తున్నామని ఒక సెక్షన్ చూపిస్తారు! కోర్టులు గూడా ఆ చట్టాలు వున్నాయి కదా! దాని ప్రకారం నడవండి అని 'న్యాయం'గా తీర్పు చెప్తారు! అంతేగా! అయితే చట్టాల వెనుక 'స్పిరిట్' ను చూసి మాట్లాడే కొందరు మాజీ ఎలక్షన్ కమీషనర్లు వున్నారు. వారిలో అశోక్ లావాసా అనే మాజీ ఎలక్షన్ కమీషనర్ ఏదో సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో విషయాలు ఈ సందర్భంగా విశ్లేషించారు! ఆయన చిన్న వాక్యంలో పెద్దమాట చెప్పారు. 'సర్' చట్ట సమ్మతంగానే చేస్తుండొచ్చు కానీ ఇది మాత్రం న్యాయం కాదు! ఆ ఒక్క మాట చాలు దేశంలోని నిజమైన ఓటర్ల బాధ ఘోష బహిర్గత పర్చేందుకు! అంతేకాదు ఇప్పుడు జరుగుతున్న ఈ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' బలమున్నవాడిదే హక్కుగా ఉదహరించవచ్చు అని గూడా నిక్కచ్చిగా చెప్పారు! స్టాట్యుటరీ ఇన్‌స్టిట్యూషన్లు, రాజ్యాంగ సంస్థలు, ప్రభుత్వాలు సడెన్గాగా 'బలమున్న వాడిదే రాజ్యం' అన్న ధోరణి ప్రదర్శించటం వల్ల సామాన్యులు కలవరపడే పరిస్థితి ఏర్పడింది!. చట్టాలు అమలు పర్చాల్సిన సంస్థలు, ప్రస్తుత పరిస్థితులలో వారు అమలు చేస్తున్నదే చట్టం అని చెబుతుంటే సామాన్యుడు ఏం చేయగలడు? దానికి ఉదాహరణ ఈ 'సర్' అమలు చేసే విధానమే! స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ధర్మబద్ధంగా అమలు విధానాన్ని రూపొందించుకోకుండా వారిష్టమొచ్చిన ప్రొసీజర్ను అవలంబిస్తూ లక్షల కొద్ది ఈ దేశ జనాలను ఇబ్బందుల పాలు చేస్తున్నారు ఆ ప్రొసీజర్ను జ్యుడిషియరీ ఒప్పుకోవటంతో నిజమైన, ధర్మబద్ధంగా ఓటు హక్కును ఏనాడో పొందినవారు ఆ అధర్మ ప్రొసీజర్ను పాటించలేక సతమతమవుతున్నారు. పైగా కొందరు రాజ్యాంగం పేరుతో రాజకీయులనే సపోర్టు చేస్తున్నప్పుడు ఎవరు ఏం చేయగలరు? చట్టాన్ని ప్రజలకనుకూలంగా అన్వయిస్తూ చెప్పేదే న్యాయంగా భావించే మేధావులూ, పాలకులూ న్యాయాధీశులు కనుమరుగవుతున్నారా? కేవలం చట్టంలోని అక్షరం అమలు చేయటం కాదు చట్టం వెనుకవున్న 'స్పిరిట్'ను అర్థం చేసుకొని అమలు చేసేదే న్యాయం! సామాన్యులు దానినే ధర్మంగా భావిస్తారు! 13 కోట్ల పేర్లు ఓటర్ల లిస్టులోంచి తొలిగించటం గమనించిన వారు ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించటం మానరు! వారిని ఎందుకు ఇలా తీసేస్తున్నారో ఎవరూ చెప్పేప్రయత్నం చేయటం లేదుకదా! ప్రస్తుతం 33శాతం ప్రజలు ఓటువేసే పరిస్థితి లేదు! 'సర్' పేరుతో అనవసరపు ఆదుర్దాను ఎలక్ట్రోరల్ రోల్స్ సరిచేసే పేరుతో ఎన్నో ఏళ్ళ నుంచి ఈ నికార్సయిన ఓటర్లుగా వున్నవారికి కూడా బి.పి. తెప్పించే పరిస్థితి ఎందుకు దాపురించింది? ఓట్ల రివిజన్ కొత్తేమీ గాదు! స్వతంత్రం తర్వాత ఒకటి రెండుఎన్నికల తర్వాత రివిజన్లు ప్రభుత్వాలు, ఎలక్షన్ కమీషన్లు జరిపేవి! రాజకీయాలు అప్పట్లో నేరుగా వుండేవి, రాజకీయ నాయకుల ధోరణి సామరస్యంగా వుండేది! ఇప్పుడు మార్పులు సంభవించటం మంచికో చెడుకో సహజమే కదా! ప్రజలల్లో నలుగుతున్న అసలు సమస్యలు 'సర్' మాదిరి పరిష్కరించటానికి పూనుకుంటే ఎంత బాగుండేది? చట్టసభలల్లోని ప్రజా ప్రతినిధులు నిజాయితీగా తమ విధులు నిర్వహిస్తున్నారా? ఏమో తెలియని పరిస్థితి. ఇదివరకు శాసన సభలో, పార్లమెంటు సమావేశాలూ కనీసం 'అబ్బా ఇన్ని రోజులా' అన్నట్లు జరిగేవి! ఇప్పుడు సమావేశాలు చిటికెలోనే అయిపోతున్నాయా అనుకొనే పరిస్థితి వుందని బుద్ధి జీవులు అంటున్నారు! ప్రస్తుతం సర్ నోటీసుల పర్వం సాగుతున్నది! 60లక్షల మందికి నోటీసులు అందటంతో హైద్రాబాద్ లాంటి నగరంలో కొన్నిచోట్ల నుంచి 'ఎనామలి లిస్ట్' బయట పెట్టాలనే ఆందోళన పెరుగుతున్నది! లిస్టులు బయటపెట్టే ఆందోళన కొంతమేర తగ్గవచ్చు! దానితో లిస్టులు తీసుకొనేవారు (బియల్ఓలుఇస్తారు) ఏయే కారణాల చేత నోటీసులు ఇస్తున్నారు అని తెలుసుకొనే అవకాశం వుంది! ఆ మధ్య ఒక పెద్ద మనిషి 'జోక్'గా 'ఈ నోటీసులు విడాకుల నోటీసులు ఇచ్చి నట్లు వుంది' అని అన్న జోక్ వెనక బాధ గూడుకట్టుకొని వుంది. ●

# ప్రతి పౌరుడు బాధ్యతతో మెలిగితే అంతా అభివృద్ధివైపే

వై. సంజీవ కుమార్


సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాలు మాత్రమే కృషి చేస్తే సరిపోదు. దేశంలోని ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఒక కుటుంబం బాగుపడటానికి కుటుంబ సభ్యులందరి సహకారం అవసరమైనట్లే, ఒక సమాజం, ఒక రాష్ట్రం, ఒక దేశం అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరం. ప్రస్తుతం మనిషి జీవితంలో స్వార్థం పెరుగుతోంది. 'నేను బాగుండాలి, నా కుటుంబం మాత్రమే బాగుండాలి, నాకు మాత్రమే ప్రయోజనం కలగాలి' అనే ఆలోచనలతో కొంతమంది తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారు. చిన్న స్థాయిలో జరిగే ఈ తప్పులు ఒక్కొక్కటిగా పెద్ద సామాజిక సమస్యలుగా మారుతున్నాయి. అవినీతి, అక్రమాలు, నిర్లక్ష ్యం, బాధ్యతారాహిత్యం, దురలవాట్లు, ప్రజా ఆస్తులపట్ల నిర్లక్ష ్యం వంటి వాటి ప్రభావం చివరకు సమాజం మొత్తం పైన, దేశంపైన పడుతుంది. బాధ్యత అనే భావన చిన్న తనం నుంచే పిల్లల్లో పెంపొందాలి. తల్లిదండ్రులుపిల్లలకు కేవలం చదువు, ఉద్యోగం, ఆస్తి సంపాదన గురించి మా త్రమే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, నిజాయితీ, ఇతరుల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతవంటి అంశా లను నేర్పాలి. తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగానిలవాలి. పెద్దలు ఎలా ప్రవర్తిస్తారో పిల్లలు కూడా అదే విధానాన్ని అనుసరించే అవకాశం ఎక్కువ. అందుకే కుటుంబంలోనే బాధ్యతాయుతమైన జీవన విధానానికి పునాది వేయాలి. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. విద్యార్థులకు పాఠ్యాంశాలనుబోధించడం మాత్రమే ఉపాధ్యాయుల బాధ్యత కాదు. వారిలో మంచి ఆలోచనా విధానం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవతా విలువలను పెంపొందించడం కూడాఅవసరం. వైద్య వృత్తి మానవ జీవితంతో ముడిపడి ఉంటుంది. రోగికి సరైన వైద్యం అందించడం, అవసరమైన సమాచారాన్ని తెలియజేయడం, రోగి పరిస్థితిని అర్థం చేసుకోవడం, మానవతా దృక్పథంతో వ్యవహరించడం వైద్యులప్రధానబాధ్యత. వైద్య సేవలను కేవలం వ్యాపారంగాకాకుండా సేవా దృక్పథంతో అందించినప్పుడు వైద్య రంగంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేప్రతి పౌరుడి సమస్యను అధికారులు బాధ్యతగా స్వీకరించాలి. ప్రజల వినతులను అనవసరంగా ఆలస్యంచేయకుండా, నిబంధనల ప్రకారం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలి. ఇచ్చిన ఫిర్యాదులో లోపాలుంటే వారికి వెంటనే తెలియజేయాలి. ఒక చిన్నఅధికారి తీసుకునేసరైన నిర్ణయం ఒక కుటుంబానికి ఎంతో మేలుచేయవచ్చు. ఒకరి బాధ్యతాయుతమైన ప్రవర్తన చుట్టూ ఉన్న పది మందిని ప్రభావితం చేయవచ్చు. బాధ్యతే అభివృద్ధికి పునాది దేశాభివృద్ధి అనేది కేవలం పెద్ద పెద్ద భవనాలు, రహదారులు, పరిశ్రమలు నిర్మించడమే కాదు, ప్రజల ఆలోచనా విధానం మారడం యువతలో క్రమశిక్షణ పెరగడం, సమాజంలో

# అక్షరంతోనే అందమైన ప్రపంచం ఆవిష్కృతం



సుంకవల్లి సత్తిరాజు

చదువును మూడవ నేత్రంగా మన పెద్దలు అభివర్ణించేవారు. చదువుకోవడానికి నాడు అడుగడుగునా ఎన్నెన్నో అవాంతరాలు ఎదురయ్యేవి. చిన్న చిన్న వృత్తులు చేసుకుంటూ బ్రతుకును భారంగా వెళ్ళదీసే నాటి రోజులు పోయాయి. నోట్లో అక్షరం ముక్కలేక పోయినా ఏదో ఒకవిధంగా బ్రతికే రోజులు గతించాయి. అక్షరమే సమస్తంగా మారిన వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో అక్షరం అందరికీ అత్యవసరంగా మారింది. ఈ ఆధునిక ప్రపంచ గమనంలో అక్షరం లేకపోతే మనుగడ సాగించే రోజులుపోయాయి. అక్షరమే ప్రపంచాన్ని నడిపించే నిజమైన ఇంధనం. అక్షరం విలువ తెలుసుకుని, అక్షరాలు దిద్ది, పుస్తకాలను చదివి, కలం చేత బట్టి, సమాజాన్ని అవగతం చేసుకుని, వివిధ రంగాలను అభివృద్ధి చేస్తూ, బ్రతుకు దెరువుకు, సమాజ వికాసానికి ఉపయోగపడుతున్న విద్యావంతులను, యువతను ఈ సందర్భంగా ప్రశంసించాలి. అక్షర జ్ఞానం లేని రోజులను తలచుకోవడం కంటే గతాన్ని వదలి, వర్తమానంలోజీవిస్తూ, సౌకర్యవంతమైన, అర్థవంతమైన, వివేకవంతమైన ప్రపంచ నిర్మాణానికి విద్యావంతులు కృషి చేయాలి. అక్షర జ్ఞానం పెరిగి, మేథస్సు వికసించి, సాంకేతిక విప్లవం కొంగొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో ప్రపంచమే ఒక చిన్న గ్రామంగా మారిపోయింది. సుదూర తీరాలు మన చెంతకు చేరుతున్న అనుభూతి కలుగుతున్నది. ఎన్నో కష్టాలను అవలీలగా అధిగమిస్తున్నాం. అటవిక సంస్కృతి నుండి ఆధునిక సంస్కృతి వరకు పరివర్తన చెందిన మానవ గమనంలో 'అక్షరం' కీలక పాత్ర వహించింది. అజ్ఞానాన్ని తరిమింది. ఆధునిక ప్రపంచాన్ని ఆవిష్కరించింది. అక్షరమనే శక్తివంతమైన ఆయుధాన్ని వినియోగించి, ఇంకా అభివృద్ధికి దూరంలో ఉన్న వెనుకబడ్డ దేశాలను, ప్రాంతాలను ముందుకు నడిపించాలి. అక్షరంలోనే అనంత విశ్వం ఇమిడి ఉంది. ప్రపంచం పలురంగాల్లో వేగంగా దూసుకుపోతున్న వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ అక్షర జ్ఞానం ఆవశ్యకం. ఉపాధిని చూపించే విద్య అవసరం. అక్షరంతోనే అవగాహన సాధ్యపడుతుంది. అందుకే అక్షరాస్యత నేడు అధిక ప్రాధాన్యత సంతరించుకున్న అంశంగా మారింది. ప్రపంచ పరిణామాలను అవగాహన చేసుకోవడానికి అనుగుణంగా ప్రతీ ఒక్కరూ లింగ, వయోబేధం లేకుండా అక్షర బాట పట్టాలి. 'అక్షరాస్యత' అంటే కేవలం అక్షరాలను దిద్దుకుని, చదవడం, వ్రాయడం మాత్రమే కాదు, సమాజాన్ని అవగతం చేసుకోవాలి. రాజకీయ, సాంస్కృతిక, ఆర్థికపరమైన అంశాల్లో కనీస పరిజ్ఞానాన్ని సంపాదించి, మోసాలకు గురికాకుండా తమను తాము కాపాడుకోవాలి. ప్రతీ చిన్న విషయానికీ ఇతరులపై ఆధారపడకుండా 'అక్షరాస్యత' ఉపయోగపడాలి. యునెస్కో ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ గణాంకాల ప్రకారం ప్రపంచంలో నేటికీ 739 మిలియన్ల మంది వయోజనులకు చదవడం, రాయడం రాదు. ప్రపంచ జనాభాలో 15 సంవత్సరాలు దాటిన వారిలో నిరక్షరాస్యత సుమారు 13శాతంగా ఉంది. నిరక్షరాస్యుల్లో మహిళలశాతం అధికంగా ఉన్నట్టు అంచనా. యునెస్కో గ్లోబల్ మానిటరింగ్ అంచనాల ప్రకారం దిగువ సెకండరీ పాఠశాల విద్యార్థుల్లో డ్రాప్ అవుట్ శాతం అధికంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 64 మిలియన్ల మంది బాలలు వివిధకారణాల




రీత్యా చదువుకు అర్థాంతరంగా స్వస్తి వాక్యం పలుకుతున్నారు. అభివృద్ధి చెందిన దేశంగా పేర్కొంటున్న అమెరికాలో ఈనాటికీ 50 మిలియన్ల మందికి పైగా నిరక్షరాస్యులైన వయోజనులున్నారు. చాడ్, దక్షి ణ సూడాన్ దేశాలు అక్షరా స్యత విషయంలో అత్యంత వెనుకబడి ఉన్నాయి. అక్షరాస్య తలో పలు దేశాలు ఇంకా వెనుకబడి ఉండడానికి ఆయా దేశాల్లోని పేదరికం, అవగాహనారాహిత్యం, ఛాందస వాదం వంటివి కారణాలుగా పేర్కొనవచ్చు. ప్రపంచంలో 15 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల పురుషుల్లో నిరక్షరాస్యత 10శాతంగా ఉంటే, మహిళల్లో 17 శాతం నిరక్షరాస్యత ఉంది. సౌత్ సహారన్ ఆఫ్రికాలో అక్షరాస్యత తక్కువ. ఉజ్బెకిస్థాన్, ఉత్తరకొరియా, నార్వే, తువాలు, రష్యా వంటి కొన్ని దేశాలు దాదాపుగా సంపూర్ణ అక్షరాస్యత గల దేశాలుగా రూపాంతరం చెందాయి. భారత్‌లో కూడా 7సంవత్సరాలు వయసుదాటిన వారిలో అక్షరాస్యతా శాతం 80.9 గా నమోదు కాబడింది. సమీప భవిష్యత్తులో భారత్‌లో అక్షరాస్యత మరింతపెరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. భారత దేశంలో 5నుండి 14సంవత్సరాల వయస్సు గలప్రతీ ఒక్కరూ చదువుకోవాలనే నిర్బంధవిద్యాచట్టం అమల్లోఉంది. అయినప్పటికీ పేదరికం వలన, చదువు పట్ల కనీస అవగాహన లేకపోవడం వలన ఇంకా బాలకార్మిక వ్యవస్థ పూర్తి స్థాయిలో అంతం కాలేదు. రాబోయే రోజుల్లో అక్షరాస్యత విషయంలో ఇప్పుడున్న పరిస్థితులు మారి, మెరుగుపడడానికి, కృషిచేయాలని ఐక్యరాజ్య సమితి భావిస్తున్నది. విద్యారంగంలోని పరిస్థితులపై చర్చించడానికి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో 1965లో జరిగిన యునెస్కో భాగస్వామ్య దేశాల విద్యామంత్రుల సదస్సు అక్షరాస్యతకున్న ప్రాధాన్యతకు గుర్తింపుగా ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యతా దినోత్సవం జరపాలని సూచించింది. ఐక్యరాజ్య సమితిలో ఒక భాగమైన 'యునెస్కో'. ఇందుకు స్పందించి, 1966 సం॥లో జరిగిన సభ్యదేశాల సమావేశంలో ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 8వ తేదీన 'అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం'గా జరపాలని తీర్మానించింది. అప్పటినుంచి ప్రతీ ఏటా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకోవడం పరిపాటి. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు కోవిడ్ సమయంలో రెండు సం॥ల పాటు ప్రపంచవ్యాప్తంగా విద్యారంగం సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ దుష్ప్రభావం నుండి ప్రపంచం బయట పడినా, వాటి దుష్ఫలితాలను ఇంకా చవిచూస్తూనే ఉన్నాం. కోవిడ్ వలన ఇ లెర్నింగ్, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం పై దృష్టి సారించడానికి ఒక మహత్తర సదవకాశం లభించింది. అయితే పేదరికం కారణంగా చాలా దేశాల్లో డిజిటల్ విద్యా వ్యవస్థ అసాధ్యంగా మారింది. సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఉపాధ్యాయులకు కూడా దీనికి సంబంధించిన శిక్షణ అవసరం. ప్రస్తుతం ప్రపంచంలోని ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడమే విద్యారంగంలో సాంకేతిక పరిజ్ఞానం జోడించడానికి పెను అవరోధం. 'డిజిటల్ ప్రపంచంలో అక్షరాస్యత' సుసాధ్యం కావడానికి కృషి జరగాలి. అక్షరాయుధాలే అభివృద్ధికి మూలాధారాలు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కదం తొక్కుతున్న నేపథ్యంతో ఇంకా పలు దేశాలు నిరక్షరాస్యతలో మగ్గిపోవడం దురదృష్టకరం. 'అక్షరం' లక్ష ్యసిద్ధికి సోపానం. విద్యతో సాధించలేనిదంటూ ఈ ప్రపం చంలో ఏదీలేదు. ఆటవిక ప్రవృత్తి నుండి ఆధునిక నాగరి కతవైపు నడిపించింది కేవలం మానవుని జిజ్ఞాస. గతంలో యునెస్కో 'లిటరసీ ఫర్ ఆల్, వాయిస్ ఫర్ ఆల్' అనే అంశం ఆధారంగా కొన్నిలక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేసిం ది. అయినప్పటికీ క్రియారూపంలో ఇవన్నీ సాధ్యపడలేదు. భావవ్యక్తీకరణ, స్వాతంత్ర్యం, సాంకేతిక విద్యను ప్రోత్స హించడానికి, ప్రజలను చైతన్యపరచడానికి ఐ.రా.స ప్రయ త్నాలు కొనసాగిస్తూనే ఉన్నది. ముఖ్యంగా అక్షరాస్యతా శాతం పెంచడం విషయంలో ప్రపంచమంతా ఒకే త్రాటిపైకి రావాలి. అక్షరాలను దిద్దాలి. అజ్ఞానాన్ని పారదోలాలి. అక్ష రాస్యత

# ప్రజావాక్కు

## మొక్కలకు ప్రాధాన్యతను ఇద్దాం!

ప్రస్తుతం నేటి ఆధునిక యుగంలో ప్రతీరోజూ కాలుష్యంతో పోరాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తూ, మొక్కల అవసరం తెలిసి కూడా వాటిని విచక్షణారహితంగా కొట్టేస్తున్నారు. రోడ్లువేస్తున్నారని, కాలువలు కడుతున్నారని, ఇతరత్రా అభివృద్ధి పనుల పేరిట వృక్షాలను నరికివేసున్నారు. వాటిస్థానంలో మరో చోటనైనా కొత్త మొక్కలు నాటడం లేదు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితి రావడానికి కూడా ఇదే కారణం అని నిపుణులు చెబుతున్నారు. మనకు, భవిష్యత్తు తరాలకు మొక్కల అవసరం ఉందన్న సంగతి గ్రహించాలి. పచ్చదనం లేకపోతే మనుగడ లేదన్న విషయాన్ని అందరం గుర్తించి మొక్కలు నాటడానికి ప్రాధాన్యం ఇద్దాం.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పెరిగిపోతున్న అత్యాచారాలు

ఆడవారు కనిపిస్తే చాలు, కనీసమానవత్వం కూడా లేకుండా కొందరు అత్యాచారాలకు పాల్పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు అనే తేడా కూడా చూడకుండా ఇలాంటి దారుణాలకు పాల్పడటం చాలా బాధాకరం. ఈ మధ్య అర్ధరాత్రి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న మానసిక వికలాంగురాలిపై అత్యాచారం చేయబోయిన వ్యక్తిని కుక్కలు అడ్డుకుని ఆమెను కాపాడాయి. కనీసం మూగజీవాలకు ఉన్న సంస్కారంకూడా ఇలాంటి పనులకు పాల్పడేవారికి లేకపోవడం సిగ్గుచేటు. ఆడవారిని తల్లిలా, సోదరిలా భావించే మనస్తత్వం ప్రతి ఒక్కరిలో పెరగాలి. చిన్నప్పటి నుంచే ఆడవారిని గౌరవించే సంస్కారం పెరగాలి. ఆడవారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. సమాజంలో ఇలాంటి ఘటనలు తగ్గాలంటే ప్రతి ఒక్కరూ తమ ఆలోచనల్లో, ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు!

2026-27 ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ వృద్ధిరేట్ 7.8శాతం అనిప్రభుత్వం చెప్పుతున్నవేల భారత ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేసిన సుభాష్ చంద్ర గారూ అది అంత వట్టిదే అని చెప్పడం ఆర్థికవ్యవస్థలో, లెక్కల్లోఉన్న డొల్లతనం బయటపడినట్టు అయింది. గతంలో పోయిన ఏడాది మొదట 86 లక్షల కోట్లు అని ఇదే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు ఆ 86 కాస్త 80కి తగ్గిపోయింది.

-భారత అవినాష్, జనగామ

## బానిస ఉద్యోగాల సృష్టి మానుకోవాలి

రాష్ట్ర సచివాలయాలలో క్రియాశీలక పదవులలోనున్న ఐ.ఏ.ఎస్. అధికారులు దిగువస్థాయిలో అత్యంత హీనాతిహీనమైన, అవమానకరమైన ఉద్యోగాలు చేస్తున్నకాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బాగోగులు అస్సలు పట్టించుకోరు. వారికి రావలసిన జీత భత్యాలు సకాలంలో విడుదల చేయరు, వారికి హక్కులేమీ లేకుండా నిబంధనలు తయారు చేస్తుంటారు. వారుకూడా అందరితో సమానంగా సమయపాలనలోగాని మరియేయితరమైన విషయాలలోగాని బితుకుబితుకుమంటూ పనులు చేస్తుంటారు. కాని తోటిరెగ్యులర్ ఉద్యోగులకుగాని, పై అధికారులకుగాని కనీస కనికరంకూడా ఉండదుకదా! బానిసలుగా చూస్తుంటారు. అంతేకాకుండా ఈఉద్యోగాలు కల్పించి తక్కువ వేతనంతో ఎక్కువ పనులు చేసుకోవచ్చుననే సలహాలు రాజకీయ నాయకులకు ఇచ్చేవారు కూడా ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లవడం బాధాకరం. ఈపోస్టులకు నిరుద్యోగులలో పోటీ పెట్టి దిగువస్థాయి అధికారులు పై అధికారుల పేరు చెప్పి లంచాలు దండుకోవడం కూడా చేస్తున్నారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## నిత్యానందను ఇప్పుడైనా అరెస్ట్ చేయండి

మన ప్రభుత్వాలకు నేరస్తులను పట్టుకోవటంచేతకాదు. చాలా మంది ఆర్థిక నేరస్తులు ప్రజాధనం లూటీ చేసి ఇతరదేశాలకు మకాం ఎత్తేస్తున్నారు. ఆదేశం చట్టాలకు లోబడి ఈనేరస్తులను మనదేశానికి తీసుకరావటం మనవాళ్ళు చేయలేకపోతున్నారు. అందువలన ఆర్థిక నేరస్తులు, అత్యాచారం, హత్యలు చేసినవాళ్లు ఇతరదేశాలకు పారిపోతున్నారు. అలాంటి వారిలో నిత్యానందస్వామి ఒకడు. గతంలో కొన్నికేసుల్లో అరెస్ట్ కాబడ్డాడు. అయితే ఒక మైనర్ బాలికను రేప్‌చేసిన కేసులో అరెస్ట్ కాబడకుండా, దేశంనుండి పారిపోయి ఒక చిన్న ద్వీపం కొనుక్కొని, సపరేట్ దేశంగా సృష్టించుకొని, అక్కడే కొంతకాలం నుండి ఉంటున్నాడు. వీడిని మనవాళ్ళకు అరెస్ట్ చెయ్యటం చేత కాలేదు. మరి ఇపుడైనా ఆ నేరస్తుడిని అరెస్ట్ చేస్తారా !

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఆసుపత్రి సిబ్బంది స్పందించాలి

వివిధ రకాల అనారోగ్య సమస్యల దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులను ఆసుపత్రి సిబ్బందిసకాలంలో స్పందించి వెంటనే వైద్యం అందేలాచూడాలి. కొన్ని ఆసుపత్రులలో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష ్యపు సమాధానాల వలన రోగులు చనిపోయే అవకాశాలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల వైపునడిచేరోగులకు అందించే వైద్యంలో నిర్లక్ష ్యం చేయవద్దు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

8-9Pg5:8-9Pg5.qxd 9/7/2026 11:24 PM Page 1



# గ్యాస్ బుకింగ్‌కు గడువు ఇక 25 రోజులే



## దేశవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో ఒకే విధానం

### తాజా మార్పులను ప్రకటించిన కేంద్రమంత్రి సురేష్ గోపి

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 7:** దేశవ్యాప్తంగా దేశీయ ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్‌కు 25 రోజుల సమాన వ్యవధిని వెంటనే అమలు చేయాలని చమురు మార్కెటింగ్ కంపెనీలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం వెల్లడించారు. దీంతో ఇప్పటివరకు రీఫిల్ బుకింగ్‌కు ఎక్కువ రోజులు వేచి చూడాల్సి వచ్చిన గ్రామీణ ప్రాంతాల ఎల్పీజీ వినియోగదారులకు కూడా 25 రోజుల తర్వాతే తదుపరి సిలిండర్‌ను బుక్ చేసుకునే అవకాశం లభించనుంది. పట్టణ ప్రాంత వినియోగదారులతో సమానంగా గ్రామీణ వినియోగదారులకు కూడా బుకింగ్ గడువు అందుబాటులోకి రానుంది. ఎల్పీజీ సరఫరాపై ఒత్తిడి నెలకొన్న సమయంలో కేంద్రం పట్టణ, గ్రామీణ ప్రాంతాల వినియోగ దారులకు వేర్వేరు బుకింగ్ వ్యవధులను అమలు చేసింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత రీఫిల్ బుక్ చేసుకునే అవకాశం ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఉండేది. ప్రస్తుతం దేశీయ ఎల్పీజీ సరఫరా పరిస్థితి గణనీయంగా మెరుగుపడటంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రీఫిల్ బుకింగ్‌ల సంఖ్య కూడా తగ్గిందని సురేశ్ గోపీ తెలిపారు. దీంతో ఈ వ్యత్యాసాన్ని తొలగిస్తూ అన్ని ప్రాంతాల వినియోగదారులకు 25 రోజుల బుకింగ్ వ్యవధిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మధ్యప్రాచ్యంలో కొనసాగిన ఘర్షణల కారణంగా సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడి దేశంలో ఎల్పీజీ లభ్యతపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సరఫరాను నిర్వహించేందుకు రీఫిల్ బుకింగ్ పరిమితులు విధించి, పట్టణ-గ్రామీణ ప్రాంతాలకు వేర్వేరు గడువులను కేంద్రం అమలు చేసింది. ప్రస్తుతం ఎల్పీజీ సరఫరా గణనీయంగా మెరుగుపడటంతోపాటు రీఫిల్ బుకింగ్‌ల బ్యాక్‌లాగ్ కూడా తగ్గిందని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని గతంలో విధించిన పరిమితులను సడలించినట్లు తెలిపారు. వెంటనే అమలు చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. రీఫిల్ బుకింగ్‌కు 25 రోజుల వ్యవధిని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖ చమురు మార్కెటింగ్ కంపెనీలకు సూచించింది.

ఈ మార్పును ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ వోఎంసిలకు పంపిన లేఖ ప్రతిని కూడా సురేశ్ గోపీ తన ఫేస్‌బుక్ పోస్టులో పంచుకున్నారు. తాజా నిర్ణయంతో దేశీయ ఎల్పీజీ వినియోగదారులందరికీ, వారు పట్టణంలో ఉన్నా గ్రామీణ ప్రాంతంలో ఉన్నా, 25 రోజులకోసారి రీఫిల్ బుక్ చేసుకునే అవకాశం కలగనుంది.



## భారత్ తరహాలోనే అమెరికాలో కూడా 'సర్'!

**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** భారత్‌లోని సర్ తరహాలోనే అమెరికాలో ఓటర్ జాబితాలను నిశితంగా పరిశీలించడాన్ని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారం భించారు. ఇందుకోసం సుమారు రూ.125 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితాలను పరిశీలించి జాతీయ ఓటర్ డాటా బేస్‌ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియలో అమెరికాలో నివసిస్తున్న 26 లక్షల మంది భారత సంతతి ఓటర్లలో 10 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముప్పు ఉందని అంచనా వేస్తున్నారు. నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. ఈప్రక్రియ నిర్వహణను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ)కి ట్రంప్ అప్పగించారు. ఈ ప్రక్రియలో 50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, అప్‌డేట్ చేస్తారు. ఓటర్ల సమాచారాన్ని వివిధ ప్రభుత్వ రికార్డులతో సరి చూస్తారు. ఓటర్ల జాబితాలను కంప్యూటర్లు ఇమ్మిగ్రేషన్, ఇతర రికార్డులతో సరి చూస్తాయి. ఒక పేరు లేదా సమాచారం రికార్డులతో సరిపోలకపోతే, ఆ ఓటర్ వివరాలను పునఃతనిఖీ చేస్తారు. అలాంటి వాళ్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రమాదముంది. న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, టెక్సాస్ లాంటి రాష్ట్రాల్లో భారత సంతతి ఓటర్లు, వారి రాజకీయ ప్రభావం చెప్పుకోదగ్గ ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఓటర్ల వెరిఫికేషన్, నమోదు ప్రక్రియ నిబంధనలు ప్రతి రాష్ట్రానికీ వేర్వేరుగా ఉన్నాయి. అయితే తాజా ప్రక్రియలో రికార్డులను పరిశీలిస్తుం డటంతో భారత సంతతి ఓటర్లు కూడా స్క్రూటినీ చేయబడతారు. భారతసంతతి ఓటర్ల ఓటింగ్ సరళిని కూడా తాజా ప్రక్రియలో పర్యవేక్షించవచ్చని తెలుస్తున్నది. అయితే ఎంత మంది పేర్లను వాస్తవంగా తొలగిస్తారనేది ప్రక్రియ పూర్తయిన తర్వాతే తెలుస్తుంది. మరోవైపు ఓటర్ గుర్తింపు కార్డును దేశవ్యాప్తంగా అమలు చేయాలని ట్రంప్ సర్కార్ భావిస్తున్నది. అమెరికన్ ఓటర్ అర్హత చట్టం ప్రతిపాదిత బిల్లు ద్వారా ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటింగ్ నిబంధనలను కఠినం చేయాలని యోచిస్తున్నది.

## డాక్టర్లపై దాడి తీవ్రమైన అంశం

### ఆ నాయకుల్ని అరెస్ట్ చేయండి

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ:** డాక్టర్లపై రాజకీయ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్న ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహారాష్ట్రలో వైద్యులపై దాడులకు పాల్పడే రాజకీయ నేతలను వెంటనే అదుపులోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాంటి వ్యక్తులను స్వేచ్ఛగా తిరగనివ్వొద్దని స్పష్టం చేసింది. వైద్య నిపుణులపై పదేపదే జరుగుతున్న దాడులను ఖండిస్తూ, "ఇలాంటి వారు వీధుల్లో తిరిగేందుకు అర్హులు కార్లు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి" అని హెచ్చరిస్తూ, సమాజంలోని ఇతరులను నిరుత్సాహపరిచేందుకు గట్టి సందేశంపంపాలని పేర్కొంది. జులైలో థానే ఆసుపత్రి వైద్యులపై దాడి చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న శివసేన కార్పొరేటర్ రమేష్ మహాత్రేకు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఆయన నుంచి స్పందన కోరుతూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై మహాత్రేకు నోటీసు జారీచేసి, మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ధర్మాసనం కోరింది. తదుపరి విచారణను సెప్టెంబరు 28కి వాయిదా వేసింది.

## నవంబరు 30కల్లా నివేదికివ్వండి

### ఆరావళి కమిటీకి సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** ఆరావళి కొండలు మరియు శ్రేణుల నిర్వచనం, పరిరక్షణపై తన పరిశీలనను పూర్తి చేయడానికి వచ్చే యేడాది ఫిబ్రవరి వరకు సమయం కోరిన ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌పిసి)పై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నవంబరు 30 లోగా తన తుది నివేదికను సమర్పించాలని ఆ కమిటీని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఆగస్టు 31తో ముగిసిన ఈ కమిటీకి ఇకపై ఎలాంటి పొడిగింపు ఇవ్వబోమని స్పష్టంచేసింది. విచారణ సందర్భంగా, ఫిబ్రవరి 28, 2027 వరకు సమయం కావాలని కమిటీ కోరడం అంటే, తన పదవీ విరమణ తర్వాత తేదీని కోరడమేనని సిజెఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు."ఈ కమిటీ ప్రాథమికంగా నా పదవీ విరమణ వరకు వాయిదా కోరింది" అని సిజె సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. పొడిగించిన గడువులోగా కమిటీ ఈ ప్రక్రియను పూర్తి చేయలేకపోతే, ప్యానెల్‌ను పునర్వ్యవస్థీకరించడాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. నవంబరు 30లోగా తనపనిని పూర్తి చేయాలని, అవసరమైతే గడువును చేరుకోవడానికి 'పగలు రాత్రి పని చేయాలన్ని ధర్మాసనం కమిటీని ఆదేశించింది.

## 'కేంద్రం వైఖరి ఏమిటి?'

### వైవాహిక అత్యాచారానికి సంబంధించిన పిటిషన్లపై సుప్రీం కోర్టు ప్రశ్న

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలనే అంశానికి సంబంధించిన పిటిషన్ల సమూహంపై సుప్రీంకోర్టు సెప్టెంబరు 9న విచారణ చేపట్టనుంది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని కోరింది. సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ ఈరోజు కోర్టులో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, "నవంబరులో విచారణ కోసం ఒక నిర్దిష్ట తేదీని కోరుతున్నాను" అని ధర్మాసనానికి తెలిపారు. ఇప్పటివరకు పిటిషన్లకు సంబంధించిన లిఖితపూర్వక వాదనలు పరస్పరం మార్చుకోలేదని కూడా కోర్టుకు తెలియజేశారు. వివిధ పిటిషన్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు కరుణా నంది మరియు సిద్ధార్థ్ దవే చేసిన వాదనలనుకూడా కోర్టు విన్నది. "ఈ అంశం బుధవారం జాబితా చేయబడింది.. కేంద్రం స్పందన ఏమిటో చూద్దాం..బుధవారం మీ అందరితో చర్చించిన తర్వాత విచారణ తేదీని ఖరారు చేస్తాం" అని జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

## డిఎంకె హయాంలో పెచ్చుమీరిన అవినీతి!

### ఇఎంఐలుగా లంచాలు వసూలుచేసిన డిఎంకె

### శాసనసభలో సిఎం విజయ్ ఫైర్

**చెన్నై, సెప్టెంబరు 7:** తమిళనాడు సిఎం విజయ్, అసెంబ్లీలో డీఎంకేపై విరుచుకుపడ్డారు. డీఎంకే అవినీతి చేసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ప్రతిపక్ష డీఎంకేతో పాటు మాజీ సీఎం స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లను టార్గెట్ చేస్తూ ఫైర్ అయ్యారు. డీఎంకే ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ల నుంచి పార్టీ ఫండ్ పేరుతో కాంట్రాక్ట్ మొత్తంలో 7.5శాతం నుంచి 10 శాతం వరకు లంచంగావసూలు చేశారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పత్రాలను ఉటంకిస్తూ ఆరోపించారు. కాంట్రాక్టర్ల నుంచి ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా, రుణాలకు ఈఎంఐలు చెల్లించినట్టుగా విడతల వారీగా వసూలు చేశారని విజయ్ ఆరోపించారు. ముఖ్యంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖ పరిధిలోని ప్రభుత్వ పనుల కాంట్రాక్టర్ల నుంచి పార్టీ ఫండ్ పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. తాను చేస్తున్నవి వ్యక్తిగత ఆరోపణలు కాదని స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లు అనుమానిత ప్రత్యక్ష లబ్ధిదారులుగా ఈడీ పేర్కొన్న విషయాన్ని విజయ్ సభలో ఆరోపించారు. టాస్మాక్ వ్యవహారంలో ఈడీ ప్రస్తావించిన కరూర్‌గ్యాంగ్ అంశాన్ని కూడా విజయ్ లేవనెత్తారు. మాజీ ఎక్సైజ్ మంత్రి వి. సెంథిల్ బాలాజీ, ఆయన అనుచరులు కరూర్, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లోని బార్ యజమానులనుంచి డబ్బులు వసూలు చేశారంటూ ఈడీ పత్రాలను ఉటంకిస్తూ విజయ్ ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలు ఒక వ్యవస్థీకృత విధానంలో జరిగిందని, ఇదొక శాస్త్రీయ విధానంలో జరిగిన అవినీతి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఇజ్రాయెల్‌పై దాడులకు ఇరాన్ సిద్ధం!

### హమాస్, హౌతీ, హెజ్బొల్లాలపై ఇజ్రాయెలీల్లో పెరుగుతున్న ఆందోళన



**టెల్ అవీవ్,సెప్టెంబరు 7:** ఇజ్రాయెల్‌లో అక్టోబరు ఏడోతేదీ జరిపిన మారణహోమం, నరమేధం వంటి సంఘట మరోసారి పునరావృతం కానుండటంతో ఇజ్రాయెల్ ఆందోళన పడుతోంది. ఈసారి మరింత పెద్దరూపంలోవస్తే ఎలా ఉంటుందన్న భయం నెలకొంది. హమాస్ ఒక్క వైపు నుంచి దాడి చేసిన ఆ రోజు ప్రపంచాన్ని కుదిపేసింది. ఇప్పుడు ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న అనేక సాయుధ గ్రూపులు ఒకేసారి కదిలే వ్యూహం అమలవుతోంది. ఇజ్రాయెల్ చుట్టూ ఉన్న నాలుగు దిశలు ఒకేసారి యుద్ధభూములుగా మారే ముప్పు ఎదురవుతోంది. ఉత్తరాన లెబనాన్‌లో హిజ్బుల్లా ఉంది. దక్షిణాన గాజాలో హమాస్ ఉంది. సముద్రం అవతల యెమెన్‌లో హౌతీలుఉన్నారు. మరోవైపు ఇరాక్‌లో ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న సాయుధ గ్రూపులు ఉన్నాయి. ఇవన్నీ ఒక్కొక్కటిగా కదిలితే అత్యంతప్రమాదమేనని ఇజ్రాయెల్‌కు భావిస్తోంది. అక్టోబర్ 7న ఏం జరిగిందో ప్రపంచం చూసింది. ఒకే దిశనుంచి వచ్చిన ఆకస్మికదాడి ఎంతటి విధ్వంసాన్ని సృష్టించగలదో ఆ రోజు నిరూపించింది. ఇప్పుడు ఆ అనుభవాన్ని ఇరాన్ తన మిత్ర సాయుధగ్రూపులతోకలిసి మరింత విస్తరించే ప్రయత్నం చేస్తోందన్న అనుమానాలు ఉన్నాయి. హిజ్బుల్లా కమాండర్లతో ఇరాన్ కుద్స్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతున్నట్టు హౌతీలు, ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపులతో కూడా సమన్వయం జరుగుతున్నట్టు నివేదికలు వెలువడుతున్నాయి. ఒక వైపు గాజా.. మరో వైపు లెబనాన్.. దూరంగా యెమెన్.. ఇరాక్ వైపు నుంచి మరో ముప్పు ఇలా ప్రతి దిశలో ఒక యుద్ధపు నీడ నిలబడితే ఇజ్రాయెల్ మధ్యలో చిక్కుకునే పరిస్థితి ఏర్పడొచ్చు. అదే సమయంలో అమెరికా, ఇరాన్ మధ్యకూడా మళ్లీ మంటలు రేగుతున్నాయి. హార్ముజ్ జలసంధిలో నౌకలపై దాడులు జరుగుతున్నాయి. ఇరాన్ చమురురవాణాపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రపంచానికి కీలకమైన సముద్ర మార్గంకూడా యుద్ధపు నీడలోకి వెళ్లిపోయింది. ఇరాన్ తన క్షిపణులు, డ్రోన్లసామర్థ్యాన్ని తిరిగి పెంచుకుంటున్నట్టు సమాచారం. ఇజ్రాయెల్ మాత్రం తన చుట్టూ ఉన్న ప్రతి కదలికను గమనిస్తోంది. ఎందుకంటే ఒక రాత్రి ఆకాశంలో ఒక క్షిపణి కనిపించడం ఒక విషయం అదే సమయంలో ఉత్తర సరిహద్దు నుంచి కాల్పులు మొదలై దక్షిణం నుంచి రాకెట్లు వస్తే పరిస్థితి భీకరంగా మారడం మరో విషయం. అదే సమయంలో సముద్రం వైపు నుంచి డ్రోన్లు దూసుకొచ్చి, మరో వైపు నుంచి సాయుధ గ్రూపులు రంగంలోకి దిగితే ఇజ్రాయెల్ కాపాడుకోడం కష్టమేనని తెలుస్తోంది. అక్టోబర్ 7 ప్రపంచాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఇప్పుడు అదే జ్ఞాపకం మరోసారి ఇజ్రాయెల్ గుండెల్లో భయంగా మారుతోంది. ఎందుకంటే ఈసారి భయం ఒక అక్టోబర్ 7 మళ్లీ వస్తుందన్నదాని కంటే పెద్దది ఒకే రోజు నాలుగు వైపుల నుంచి ఒకేసారి విరుచుకుపడితే ఏమవుతుందన్నదే ఇజ్రాయెల్ వాసుల గుండెల్లో భయాందోళనలు పీడిస్తున్నాయి.

## గుజరాత్ అనామక పార్టీలకు రూ.1700 కోట్ల విరాళాలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** అవి పేరుకే నమోదైన రాజకీయ పార్టీలు. ప్రజలకు పెద్దగా తెలిసినవి కావు. అయినప్పటికీ పేరున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలను మించి విరాళాలు రాబడుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్‌కు చెందిన ఆరు చిన్న పార్టీలకు విరాళాల రూపంలో రూ.1,700 కోట్లు అందిననట్టు ఓ మీడియా సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. ఇవేవీ చురుకైన రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడం లేదని తేలింది. దీంతో ఈ విరాళాల అసలు లబ్ధిదారులు ఎవరన్నది తెలియాల్సి ఉంది. ఆమ్ జన్మత్ పార్టీకి రూ.620 కోట్లు, సత్యవాది రక్షక్ పార్టీకి రూ.330.55 కోట్లు, స్వతంత్రత అభివ్యక్తి పార్టీకి రూ.219.69 కోట్లు, న్యూ ఇండియా యునైటెడ్ పార్టీకి రూ.200.69 కోట్లు, భారతీయ నేషనల్ జనతాదళ్‌కు రూ.191.61కోట్లు, గరీబ్ కల్యాణ్ పార్టీకి రూ.138 కోట్లు చొప్పున విరాళాలుఅందాయి. 2024 ఎన్నికల్లో ఇవన్నీ కలసి పేరుకు 15 లోక్‌సభ స్థానాల్లోనే అభ్యర్థులను నిలబెట్టాయి. రూ.620 కోట్ల విరాళాలు అందుకున్న ఆమ్ జన్మత్ పార్టీ, రూ.330 కోట్లు స్వీకరించిన సత్యవాది రక్షక్ పార్టీ అయితే ఒక్కో అభ్యర్థినే పోటీకి దింపడం మరీ విచిత్రంగా ఉంది. మరీ ముఖ్యంగా ప్రస్తుతం బీజేపీ బీహార్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉన్న అనామిక పాశ్వాన్ ఆధ్వర్యంలోనే ఆమ్ జన్మత్ పార్టీని 2020లో పట్నాలో స్థాపించారు. ఆమ్ జన్మత్‌పార్టీని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు మార్చినప్పుడే అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్టు ఆమె స్పష్టం చేశారు. 2022-23లోనూ ఈ పార్టీకి రూ.216 కోట్ల విరాళాలు వచ్చాయి.


ఇక, 2023-24లో కాంగ్రెస్‌కు రూ.281. 48 కోట్ల విరాళాలు అందినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సిపిఎంకు రూ.7.64 కోట్లు, ఆప్‌కు రూ.10.15 కోట్ల విరాళాలు రాగా.. ప్రాంతీయ పార్టీలైన బిఆర్‌ఎస్‌కు రూ.85 కోట్లు, డీఎంకేకు రూ.15.24 కోట్ల చొప్పునే రావడంగమనార్హం. గుజరాత్‌కు చెందిన ఈ ఆరు పార్టీల్లో నాలుగింటికి చిరునామా అహ్మదాబాద్.ఇందులో సత్యవాది రక్షక్ పార్టీ తనకు వచ్చిన రూ.330కోట్లలో రూ.316 కోట్లను సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేసినట్టు వెల్లడించింది. రూ.8.48 కోట్లను లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వినియోగించినట్టు ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆడిట్ నివేదికలో వెల్లడించింది. ఎన్నికల్లో పెద్దగా ఉనికేలేని, అనామక పార్టీలకు ఇంత భారీ మొత్తంలో విరాళాలు ఎందుకు వస్తున్నాయి అవి ఎవరికి చేరుతున్నాయి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## మైక్రో ఇన్‌ఫ్లూయెన్సర్లకు వలవేస్తున్న రాజకీయ పార్టీలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** రాజకీయ పార్టీలకు సంస్థ, క్యాడరే ప్రధాన బలం. ఇప్పుడు వారితోపాటు కంటెంట్ క్రియేటర్లు, మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లతో కూడిన డిజిటల్ ఆర్మీ ఉద్భవిస్తున్నది. వారివద్ద ఎటువంటి పార్టీ పదవి లేదా జెండా లేదు. కానీ వారికి వేలాది, లక్షలాది స్క్రీన్‌లను చేరుకోగల సామర్థ్యం ఉన్నది. ఒక రీల్, మీమ్ లేదా షార్ట్ వీడియో కొన్ని గంటల్లోనే లక్షలాది మంది యువతకు చేరువవుతున్నది.

ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జరుగ బోయే అసెంబ్లీ ఎన్నికల ముందు, పార్టీలు 10,000 నుంచి 50,000మంది ఫాలోవర్లుఉన్న స్థానికఇన్‌ఫ్లూయెన్సర్ల నెట్‌వర్క్ లను రూపొందించడానికి పనిచేస్తున్నాయి. డిజిటల్ క్యాంపెయిన్ లతో ఉన్న వ్యక్తుల వివరాల ప్రకారం చిన్న, మధ్య తరహా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఏ ఒక్క రాజకీయ పార్టీతోనూ శాశ్వతంగా సంబంధం కలిగి ఉండరు. వేర్వేరు సమయాల్లో వారు బిజెపి, కాంగ్రెస్, ఆప్ లేదా ఇతర పార్టీల కోసం పనిచేయవచ్చు. రాజకీయ రీల్ కోసం క్రియేటర్లకు రూ. 15వేల నుంచి రూ. 50వేల వరకు, పోస్ట్ కోసం రూ. 15వేల నుంచి రూ. 20వేల వరకు చెల్లిస్తున్నారనే వాదనలు ఉన్నాయి.

## ఢిల్లీ సత్యనికేతన్ భవన యజమాని అరెస్టు



### మున్సిపల్ కార్పొరేషన్‌లో ఐదుగురి సస్పెన్షన్

### కఠిన చర్యలకు ఆదేశించిన సిఎం రేఖా గుప్తా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** సత్యా నికేతన్ బిల్డింగ్ ఓనర్ హరిరామ్ గుప్తాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని భివాండిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఢిల్లీలో ఆదివారం పిజి హాస్టల్ కూలిన ఘటనలో పోలీసులు హరిరామ్ గుప్తాను విచారిస్తున్నారు. అయిదు అంతస్తుల బిల్డింగ్‌లో బాయ్స్ పిజి హాస్టల్ నడిపిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలో ఈ బిల్డింగ్ ఉన్నది. అయితే రిపేర్ వర్క్ జరుగుతున్న సమయంలో బిల్డింగ్ కూలింది. ఆ ఘటనలో ఏడుగురు మృతిచెందారు. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బిల్డింగ్ కండీషన్‌తో పాటు రిపేర్ వర్క్ జరిగిన తీరును కూడా విచారిస్తున్నారు. దక్షిణ ఢిల్లీలోని సత్యానికేతన్‌లో పిజి హాస్టల్ బిల్డింగ్ కూలిన ఘటనలో ఢిల్లీ మున్సిపల్ శాఖ అయిదుగురు అధికారులపై సస్పెన్షన్ విధించింది. దక్షిణ జోన్ డిప్యూటీ కమీషనర్ రాకేశ్ కుమార్‌తో పాటు నలుగురు ఇంజినీర్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. పిజి హాస్టల్ కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకున్నది. 12 మంది విద్యార్థులు గాయపడ్డారు. సూపరెంటెండింగ్ ఇంజినీర్ రన్‌వీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(బిల్డింగ్) లలిత్ కుమార్ గోయల్, అసిస్టెంట్ ఇంజినీర్(బిల్డింగ్) సునీల్ చౌహాన్, జూనియర్ ఇంజినీర్(బిల్డింగ్ ఆశిశ్ కుమార్ వేటు పడినవారిలో ఉన్నారు. ఢిల్లీ మున్సిపాల్టీకి చెందిన విజిలెన్స్ శాఖ సస్పెన్షన్ ఆదేశాలు ఇచ్చింది. విజిలెన్స్ ఆఫీసర్ నంద కిషోర్ ఆ దేశాలు ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలోని విద్యార్థులు నివసించే ఈ భవనం ఆదివారం మధ్యాహ్నం కుప్పకూలింది. ఘటన అనంతరం బన్సాల్‌తో పాటు మరికొందరిపై సౌత్ క్యాంపస్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసారు.

## ప్రైవేటీకరణ ప్రచారం అపోహలు మాత్రమే

### ఇస్రో ఛైర్మన్ స్పష్టీకరణ

**బెంగళూరు, సెప్టెంబరు 7:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రైవేటీకరణ కాదని సంస్థ చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ స్పష్టం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో, ఇస్రో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఇస్రో చీఫ్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. తాము ఇస్రో ఉద్యోగుల్లో ఆందోళనల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతరిక్ష రంగ సంస్కరణలు ఆరేళ్ల క్రితమే ప్రారంభమయ్యాయని, ప్రైవేట్ రంగానికి మార్గనిర్దేశం చేయడం, భారత అంతరిక్ష వ్యవస్థను మరింత విస్తరించడం సంస్కరణల లక్ష్యమని ఆయన వివరించారు. స్పేస్ ఇండస్ట్రీలో ప్రైవేట్ పరిశ్రమ కొత్తది కాదని, రాకెట్ల తయారీలో ఇప్పటికే వందలాది భారతీయ కంపెనీలతో కలిసి ఇస్రో పనిచేస్తుందని తెలిపారు.

## రష్యా పోలీసుల అదుపులో యుపి ఇంజనీర్



**మాస్కో, సెప్టెంబరు 7:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంజనీర్ చందన్‌గుప్తాను రష్యాలో అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన భార్య ఆరోపించారు. వర్క్ వీసాపై రష్యాకు వెళ్లిన తన భర్తను అక్కడి సైన్యంలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తన భర్తను, తనను సురక్షితంగా స్వదేశానికి తిరిగివచ్చేలా చూడాలని ప్రధాని మోడీ, యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆమె ఓ విడియో పోస్ట్ చేశారు.కాన్పూర్‌కు చెందిన చందన్ గుప్తా కొన్నేళ్ల క్రితం కంపెనీతరఫున ఉద్యోగరీత్యా వర్క్ వీసాపై రష్యాకు వెళ్లారు. అక్కడే భార్య స్నేహ, 10యేళ్ల కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. ఇటీవల తనభర్త చందన్ గుప్తాను మాస్కోపోలీసులు అదుపులోకి తీసుకున్నారని స్నేహ పేర్కొంది. తనకు రష్యన్ భాష రాకపోవడంతో ఆయనను ఎందుకు అరెస్టు చేశారో తెలుసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా సైన్యంలో సిబ్బంది కొరత ఉండడంతో.. విదేశీయులను తమ సాయుధ దళాల్లోకి చేర్చుకునేందుకు కొంతకాలంగా అక్కడి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే తన భర్తను అదుపులోకి తీసుకున్నారని.. సైన్యంలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. తన కుటుంబం సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చేలా చూడాలని ఆమె ప్రధాని మోడీని కోరారు. ఈ విడియో సోషల్ మీడియాలోలో వైరల్‌గా మారడంతో మాస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ఈ విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. అలాగే చందన్ గుప్తా భార్య స్నేహ గుప్తాతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది.

## సంక్షిప్త వార్తలు

### మళ్లీ బద్దలైన అగ్నిపర్వతం



**జకార్తా, సెప్టెంబరు 7:** ఇండొనేసియాలోని సుందా జలసంధిలో ఉన్న అనక్ క్రాకటా అగ్నిపర్వతం మరోసారి బద్దలయ్యింది. దాని నుంచి భారీ ఎత్తున బూడిద వెలువడుతుండటంతో ఆ సమీప ప్రాంతంలో విమానాల రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది. శుక్రవారం నుంచి క్రియాశీలకంగా ఉన్న ఈ అగ్నిపర్వతం మొదట ఆదివారం తెల్లవారుజామున బద్దలైంది. అర్ధరాత్రి సమయంలో కూడా మరో రెండుసార్లు అందులో పేలుళ్లు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. దట్టమైన పొంగ, బూడిద కమ్మేయడంతో దేశవ్యాప్తంగా 8 విమానాశ్రయాలను మూసివేశారు. దీంతో 1.7 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడింది.

### రన్‌వే నుంచి దూసుకెళ్లిన కార్గో విమానం



**మియామి, సెప్టెంబరు 7:** అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో అమెజాన్ కార్గో విమానం కూలింది. రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఆ విమానం పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అయిదుగురు మృతి చెందారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రన్‌వేపై దిగిన తర్వాత ఆ విమానం సమీపంలో పార్క్ చేసిన కార్లవైపు దూసుకెళ్లిన విడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ప్రమాద ఘటన పట్ల దర్యాప్తు చేపట్టినట్లు అమెజాన్ సంస్థ పేర్కొన్నది.


### టివికె నేత కన్నన్ దారుణ హత్య

**చెన్నై, సెప్టెంబరు 7:** తమిళనాడులో అధికార టివికె పార్టీకి చెందిన నేత హత్య కలకలం సృష్టిస్తోంది వాంతురైలో టివికె నేత కన్నన్ దారుణ హత్యకు గురయ్యారు. 45 యేళ్ల కన్నన్‌ను దుండగులు వెంటాడి కొడవళ్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలతో మృతి చెందారు. గతంలో అన్నా డిఎంకె 174వ వార్డు కార్యదర్శిగా పనిచేసిన కన్నన్ ఇటీవలే టివికెలో చేరారు. కన్నన్ టివికెలో చేరడమే హత్యకు కారణమని ఇప్పటివరకు పోలీసులు నిర్ధారించలేదు.

### మసీదు కూల్చివేత ప్రాంతంలో కాంగ్రెస్ నేత అరెస్ట్

**లక్నో, సెప్టెంబరు 7:** ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్‌ను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సహరాన్‌పూర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మసీదు కూల్చివేతతో ప్రభావితమైన మసీదు కమిటీ సభ్యులు, స్థానికులను పరామర్శించేందుకు సహరాన్‌పూర్ వెళ్తుండగా ఆయనను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నట్లు కాంగ్రెస్‌నేతలు తెలిపారు.రాయ్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలనుకూడా పోలీసులు అడ్డుకుని లక్నోలోని పోలీస్ లైన్స్‌కు తరలించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

### డ్రగ్స్‌కేసులో ఈజిప్టు టివి యాంకర్‌కు మరణశిక్ష



**బీరూట్, సెప్టెంబరు 7:** డ్రగ్స్ కేసులో ఈజిప్ట్ టివి ప్రెజెంటర్ సారా ఖలీఫాకు మరణశిక్ష పడింది. ఆమెతో పాటు మరో 11 మంది నిందితులకు కూడా మరణశిక్ష విధిస్తూ ఈజిప్టు కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేసులో మరో తొమ్మిది మందికి జీవిత ఖైదు విధించగా ఏడుగురిని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. భారీ స్థాయిలో మాదకద్రవ్యాల తయారీ, అక్రమ రవాణా చేస్తున్నట్లు రుజువు కావడంతో ఈ మేరకు తీర్పు వెలువరించింది.

8-9Pg6exHMNWJQE:8-9Pg6exHMNWJQE.qxd 9/7/2026 11:50 PM Page 1





## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**- డివైడర్‌ను ఢీకొన్న కారు**

**- నలుగురు దుర్మరణం**

**పలమనేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** బెంగళూరు – చెన్నై ఎక్స్ ప్రెస్ హైవేలోని కర్నాటక రాష్ట్రం బంగారుపేట వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. బెంగళూరులోని విద్యారణ్యపురకు చెందిన కుటుంబం తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానంతరం తిరిగి వెళుతుండగా ఎక్స్‌ప్రెస్ హైవేలో కుక్క అడ్డం వచ్చింది. దీంతో డ్రైవర్ కుక్కను తప్పించబోయి పక్కకు తిప్పగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శారదమ్మ (70), దీక్షిత (25), దేవేంద్రకుమార్ (41), జిష్ణు (13) అక్కడికక్కడే మృతిచెందారు. ఇంకా కారులో ప్రయాణిస్తున్న వికాస్, నీతు, ఆద్విక, కవిత గాయపడ్డారు. మృతులను శవ పరీక్షకు, గాయపడ్డవారిని చికిత్సకు కోలారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలారు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అమరావతిలో అదనపు ఐటీఎటి బెంచ్ ఏర్పాటు చేయాలి

- కేంద్ర ప్రభుత్వానికి జనసేన ఎంపి లింగమనేని రమేశ్ వినతి
- అమరావతి ఐటిఎటి బెంచ్ పరిధిలో గుంటూరు, కృష్ణా జిల్లాలను చేర్చాలి

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని పన్ను చెల్లింపుదారులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపార సంస్థలు, ఇతర వర్గాలకు ప్రయోజనం కలిగేలా అమరావతిలో అదనపు ఆదాయపు పన్ను అప్పీలెట్ ట్రిబ్యునల్ (ఐటిఎటి) బెంచ్‌ను ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఐటిఎటి విశాఖపట్నం బెంచ్‌కు ఉమ్మడి తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధి ఉన్నది. మరోవైపు అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు హైదరాబాద్ బెంచ్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్ర విభజనకు ముందు ఉన్న భౌగోళిక పరిధి ఆధారంగా కొనసాగుతున్న ఈ వ్యవస్థను ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో సమీక్షించి, హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉందని లింగమనేని రమేశ్ తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టు ఏర్పడిన నేపథ్యంలో, రాష్ట్రంలోని పన్ను సంబంధిత అప్పీళ్లను రాష్ట్ర పరిధిలోనే పరిష్కరించుకునే విధంగా ఐటిఎటి పరిధిని కూడా పునర్వ్యవస్థీకరించడం సముచితమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు కేంద్రంగా, సులభంగా చేరుకోగల ప్రాంతంగా ఉందని, అమరావతిలో ఐటిఎటి బెంచ్ ఏర్పాటు చేస్తే మధ్య, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పన్ను చెల్లింపుదారులు, అప్పీలుదారులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, అధికారులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని ఎంపి తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం లేదా హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం వల్ల ఎదురవుతున్న ప్రయాణ సమయం, వ్యయం, ఇతర ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రతిపాదిత అమరావతి ఐటిఎటి బెంచ్ పరిధిలో గుంటూరు, కృష్ణా జిల్లాలను చేర్చాలని ఆయన ప్రత్యేకంగా కోరారు. ఈ రెండు జిల్లాలు అమరావతికి భౌగోళికంగా, ఆర్థికంగా సన్నిహితంగా ఉన్నందున, వాటిని బెంచ్ పరిధిలోకి తీసుకురావడం ద్వారా మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు, వృత్తి నిపుణులకు తక్షణ ప్రయోజనం కలుగుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం హైదరాబాద్ బెంచ్ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను ప్రతిపాదిత అమరావతి బెంచ్ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర మంత్రిని కోరారు. దీంతో ఈ జిల్లాలకు చెందిన అప్పీలుదారులు ఆదాయపు పన్ను అప్పీళ్ల కోసం పొరుగు రాష్ట్రంలోని హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలోనే ఐటిఎటిను ఆశ్రయించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. అమరావతి– విజయవాడ– గుంటూరు ప్రాంతంలో పెరుగుతున్న ఆర్థిక, వాణిజ్య ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని, ఈ ప్రాంతంలో పెరుగుతున్న వ్యాపార కార్యకలాపాలు, పన్ను చెల్లింపుదారులు, సంస్థలు, వృత్తి నిపుణుల నేపథ్యంలో ప్రత్యేక ఐటిఎటి బెంచ్ ఏర్పాటు రాష్ట్రంలో పన్ను వివాదాల పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఐటిఎటి బెంచ్‌ను అమరావతిలో ఏర్పాటు చేసి, దాని కార్యకలాపాలను ప్రారంభించేందుకు అవసరమైన సహకారం, మౌలిక వసతులతో సహా పూర్తి సహకారం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన కేంద్ర మంత్రికి తెలియజేశారు.

అమరావతిలో ఐటిఎటి బెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు దాని పరిధిని హేతుబద్ధీకరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పన్ను అప్పీళ్లకు న్యాయపరమైన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు, పన్ను చెల్లింపుదారులు, వృత్తి నిపుణులకు ప్రయాణ భారం తగ్గుతుంది. అలాగే రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సంస్థాగత వ్యవస్థలో మరింత సమన్వయం సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ పేర్కొన్నారు.

# పరిశుభ్ర ఇంధన దిశగా ఎపి కీలక అడుగు

**- హాంపి హాస్టల్‌లో మోడల్ ఎలక్ట్రిక్ వంట వ్యవస్థ ఏర్పాటు - ఎపిఎస్ఇసిఎం- జెఎన్‌టియుఎ మధ్య ఒప్పందం - యేటా రూ.1.23 కోట్లకు పైగా ఆర్థిక ఆదా - సుమారు 250 టన్నుల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపు లక్ష్యం - ఎపి జెన్‌కో ఎండి, ఎపిఎస్ఇసిఎం సిఇఒ ఎస్.నాగలక్ష్మి**



హాంపి హాస్టల్‌లో మోడల్ ఎలక్ట్రిక్ వంట వ్యవస్థ ఏర్పాటుకు ఏపీ ఎస్ఈసిఎం అనంతపురం జేఎన్టీయు మధ్య అవగాహన ఒప్పంద దృశ్యం

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశ పరిశుభ్ర ఇంధన పరివర్తనలో ఎలక్ట్రిక్ వంట విధానం అత్యంత కీలకమైన ముందడుగని ఎపి జెన్కో మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్. నాగాలక్ష్మి అన్నారు. పర్యావరణహితమైన, సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఎలక్ట్రిక్ వంట సాంకేతికతను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో రాష్ట్రంలోనే తొలిసారిగా భారీ స్థాయిలో ఎలక్ట్రిక్ కుకింగ్ డెమాన్స్ట్రేషన్ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి సోమవారం ఎపి ఎస్ఇసిఎం, అనంతపురం జెఎన్‌టియు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో భాగంగా జెఎన్‌టియు అనంతపురం ప్రాంగణంలోని హాంపి హాస్టల్‌లో ఎలక్ట్రిక్ కుకింగ్ డెమాన్స్ట్రేషన్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్ర ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ మార్గదర్శకాల మేరకు ఆమోదం పొందిన ఈ ప్రాజెక్ట్ ద్వారా, వాణిజ్య స్థాయి ఎలక్ట్రిక్ వంట పరికరాల కొనుగోలు, ఏర్పాటు, పరీక్షలు, కమిషనింగ్ పనుల కోసం 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఎపిఎస్ఇసిఎం రూ. 81.80 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.

ఈ సందర్భంగా నాగాలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో వంట గ్యాస్ అవసరాల్లో దాదాపు 60శాతం దిగుమతుల ద్వారానే సమకూరుతోందన్నారు. దీంతో అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులు, సరఫరా అంతరాయాల ప్రభావం దేశంపై పడుతోందని, ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వంట విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా జాతీయ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు, శిలాజ ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించి, పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు సంస్థాగత వంటశాలల్లో భద్రతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ఇంధన సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో జెఎన్‌టియు అనంతపురం కనబరుస్తున్న విశిష్ట కృషిని గుర్తించి ఈ పైలట్ ప్రాజెక్ట్‌కు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం గతంలో రాష్ట్ర ప్రభుత్వ గోల్డ్ అవార్డు ఫర్ ఎనర్జీ కన్జర్వేషన్ అందుకోవడంతో పాటు, 2026 ఫిబ్రవరిలో ఐదు రోజుల పాటు ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ వర్క్‌షాప్ ను నిర్వహించిందన్నారు. జెఎన్‌టియుఎ హాంపి హాస్టల్‌లోని కేంద్రీకృత వంటశాలలో ప్రతిరోజూ దాదాపు 2,000 మంది విద్యార్థులకు భోజనం సిద్ధం చేస్తుంటారని, ప్రస్తుతం ఎల్‌పీజీ ఆధారిత వంట విధానాన్ని అమలు చేస్తున్న ఈ వంటశాలలో, దాని స్థానంలో ఆధునిక ఎలక్ట్రిక్ వంట వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. భారీ స్థాయిలో వంటలు నిర్వహించే ప్రభుత్వ, విద్యాసంస్థల్లో ఈ సాంకేతికత సాంకేతికంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా ఎంత సమర్థవంతంగా పనిచేస్తుందో ఈ ప్రాజెక్ట్ ద్వారా నిరూపితమవుతుందన్నారు.

ప్రాజెక్ట్ అంచనాల ప్రకారం ఈ మార్పు ద్వారా రోజుకు సుమారు రూ.33,805 ఇంధన వ్యయం ఆదా కానుంది. దీంతో ఏటా రూ.1.23 కోట్లకు పైగా ఆదా సాధ్యమవుతుంది. ప్రాజెక్ట్‌పై చేసిన పెట్టుబడి సుమారు 310 రోజుల్లో (దాదాపు 10 నెలల్లో) తిరిగి వచ్చే అవకాశం ఉందని అంచనా. అంతేకాకుండా, ఏటా సుమారు 250 టన్నుల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు తగ్గి, రాష్ట్ర హరిత ఇంధన, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఈ ప్రాజెక్ట్ దోహదపడనుంది. ఈ ప్రాజెక్టును ఐదు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారని,

తొలి రెండు నెలల్లో జెఎన్‌టియుఎ హాంపి హాస్టల్ వంటశాలలో అవసరమైన సివిల్, ఎలక్ట్రికల్ మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయనుండగా, తదుపరి మూడు నెలల్లో ఎపిఎస్‌సిఇఎం ఆధ్వర్యంలో ఎపి ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లు నిర్వహించి ఎలక్ట్రిక్ వంట పరికరాల సరఫరా, ఏర్పాటు, కమిషనింగ్ పనులను పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

## సాధిక్‌కు మూడు రోజుల పోలీస్ కస్టడీ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్7, ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ ఎ ఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు, జగదీశ్‌రెడ్డి హత్య కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు షేక్ సాధిక్‌ను మూడు రోజుల పోలీస్ కస్టడీకి స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ అనుమతించారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు సాధిక్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు.

వారం రోజుల కస్టడీకి అనుమతించాలని సర్పవరం పోలీసులు కోరగా, మెజిస్ట్రేట్ మూడు రోజులకు అనుమతి ఇచ్చారు. జూలై 2న జగదీశ్‌రెడ్డి హత్య జరగగా, ఆగస్టు 24న సాధిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాధిక్‌కు కెమికల్స్ విక్రయించిన ఖాదీర్, రెహమాన్‌లను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారించారు. కస్టడీలో సాధిక్ నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

# పిఎం - కుసుమ్ కింద 1,162.8 మెగావాట్లతో సౌరీకరణలో కీలక మైలురాయి

**- రాష్ట్రవ్యాప్తంగా 228 ఫీడర్ స్థాయి సౌర విద్యుత్ ప్లాంట్లు - సెప్టెంబర్ - అక్టోబరులో 109.7 మెగావాట్ల లక్ష్యం**

**- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్**



**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పిఎం –కుసుమ్ కాంపోనెంట్‌సి కింద 228 ప్లాంట్ల ద్వారా 1,162.8 మెగావాట్ల ఫీడర్ లెవెల్ సోలారైజేషన్ సామర్థ్యాన్ని చేపట్టడంతో ఆంధ్రప్రదేశ్ తన పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో కీలక మైలురాయిని చేరుకుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్రంలో పిఎం కుసుమ్ పథకంలో భాగంగా ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్పిడిసిఎల్ (కెఆర్ఇసిఎస్) అమలు చేస్తున్న ప్రాజెక్టుల పురోగతిని డిస్కంల సిఎండిలు లోతేటి శివశంకర, పృథ్వీతేజ్ ఇమ్మడి, పుల్లారెడ్డితో పాటు సంబధిత డైరెక్టర్లు, నెడ్ క్యాప్ ఎండి కమలాకర బాబులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయానంద్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు, అక్టోబరు 2026 వ్యవధిలో 109.7 మెగావాట్ల ప్రాజెక్టులను ప్రారంభించడమే లక్ష్యంగా ఇంధన శాఖ ఇప్పుడు పనులను వేగవంతం చేయడంపై దృష్టి సారించిందని, నిర్ణీత కాలపరిమితిలోగా ప్రాజెక్టులన్నింటినీ ప్రారంభించేలా డిస్కంలు, డెవలపర్లు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని 228 ఫీడర్ స్థాయి సౌర ప్లాంట్లకు భూసేకరణ పూర్తయిందని, సివిల్ పనులు, పరికరాల సేకరణ, ఫైనాన్షియల్ క్లోజర్, చట్టబద్ధమైన పత్రాల ప్రక్రియలను ప్రాజెక్టుల వారీగా నిశితంగా పర్యవేక్షిస్తూ, ఈ పురోగతిని క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలుకు ఎలాంటి విఘాతం కలగకుండా అడ్డంకులను ప్రారంభంలోనే గుర్తించి పరిష్కరించడానికి డిస్కంలు, డెవలపర్లు, నెడ్‌క్యాప్ ఆర్థిక సంస్థలు ఇతర సంస్థల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎపిసిపిడిసిఎల్ లో 191.5 మెగావాట్ల ఉమ్మడి సామర్థ్యంతో 49 ఎఫ్ఎల్ఎస్ ప్లాంట్లు అమలులో ఉన్నాయని, మొత్తం 49 ప్రాజెక్టులకు భూసేకరణ పూర్తయిందన్నారు. ఈ విభాగంలో రాష్ట్రం ఇప్పటికే ఒక రికార్డ్ నమోదు చేసిందని, పల్నాడు సర్కిల్‌లోని 33 కేవీ ఎన్.ఎన్. తాండ్ర సబ్‌స్టేషన్‌లో 3 మెగావాట్ల ఎఫ్ఎల్ఎస్ ప్లాంట్‌ను గత నెల ఆగస్టు 27 న ప్రారంభించారన్నారు సెప్టెంబర్, అక్టోబరు నెలల్లో మరో 62 మెగావాట్ల సామర్థ్యాన్ని ఛార్జింగ్ చేయడానికి ప్రణాళిక రూపొందించారని, ఎపిసిపిడిసిఎల్ అధికారులు ప్రతి ప్రాజెక్ట్‌ను నిశితంగా పరిశీలించి, అనుమతించిన షెడ్యూల్‌కు కట్టుబడి ఉండేలా చూడాలని కె. విజయానంద్ ఆదేశించారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలో 220.3 మెగావాట్ల సామర్థంతో 33 ఎఫ్ఎల్ఎస్ ప్లాంట్లు అమలులో ఉన్నాయని, అన్ని ప్రాజెక్టులకు భూసేకరణ పూర్తయిందని, 29 ప్లాంట్లకు పర్చేజ్ ఆర్డర్లు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ డిస్కం సెప్టెంబరులో 11.99 మెగావాట్లు, అక్టోబరులో 13.5 మెగావాట్లు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. మిగిలిన సామర్థ్యాన్ని ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ లో ప్రారంభించనున్నామని, డెవలపర్లతో సమన్వయాన్ని పెంచి, పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులు, ఫైనాన్షియల్ క్లోజర్, బేకేటాయింపు పత్రాల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎపిఇపిడిసిఎల్‌ను ఆదేశించారు. ప్రాజెక్టు స్థలాల్లో తగినంత మంది సిబ్బంది, యంత్రాలు, సామగ్రి అందుబాటులో ఉండాలని కూడా చెప్పారు.ఎపిఎస్పిడిసిఎల్, కెఆర్ఇసిఎస్ (కుప్పం రెన్యువబుల్ ఎనర్జీ కో ఆపరేటివ్ సొసైటీ) కింద 751 మెగావాట్లు

రాష్ట్ర ఎఫ్ఎల్ఎస్ సామర్థంలో ఎపిఎస్పిడిసిఎల్, కెఆర్ఇసిఎస్ కార్యక్రమాలు అతిపెద్ద వాటాను కలిగి ఉన్నాయని, ఇక్కడ 751 మెగావాట్ల సామర్థంతో 146 ప్లాంట్లు అమలులో ఉన్నాయని ఆయన వివరించారు.146 ప్లాంట్లకు భూసేకరణ పూర్తయిందని, అలాగే అన్ని ప్రాజెక్టులకు పర్చేజ్ ఆర్డర్లు కూడా వచ్చాయని, వివిధ ప్రాంతాల్లో సివిల్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

అడమర్గాం, మల్లెపల్లి, దసమానుపల్లి, కుప్పం టౌన్‌లలోని ప్లాంట్లతో సహా సుమారు 19.9 మెగావాట్లు సెప్టెంబరులో ఛార్జింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ప్రారంభోత్సవ ప్రణాళిక ప్రకారం సెప్టెంబరులో 27 మెగావాట్లు, అక్టోబరులో 82.7 మెగావాట్లు అందుబాటులోకి రానున్నాయని, దీంతో ఈ రెండు నెలల కాలంలో మొత్తం ప్రణాళికాబద్ధమైన ప్రారంభ సామర్థం 109.7 మెగావాట్లకు చేరుకుంటుందని ఆయన వివరించారు. వెంటనే ప్రారంభించాల్సిన ప్లాంట్ల పనులను ఆలస్యం లేకుండా పూర్తి చేయడానికి ప్రాజెక్టుల వారీగా దృష్టి సారించాలని . విజయానంద్ ఎపిఎస్పిడిసిఎల్, కెఆర్ఇసిఎస్ అధికారులను ఆదేశించారు.

## మిస్సింగ్ కేసులో బాలికను హైకోర్టులో హాజరు పరిచిన పోలీసులు

**విజయవాడ, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూ రులో మిస్సింగ్ కేసులో బాలికను హైకోర్టులో పోలీసులు హాజరు పరిచారు. బాలికను సురక్షితంగా హరియాణాలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీ సులు తెలిపారు. బాలికను ట్రాప్ చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

వైద్య పరీక్షల తర్వాత బాలికను తల్లిదండ్రులకు అప్పగించాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు పూర్తి వివరాలు 2 వారాల్లోగా సమర్పించాలని డిజిపికి హైకోర్టు ఆదేశించింది.

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం :ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

**తిరుపతి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 71 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండికి విన్నవించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్ లో హెచ్చుతగ్గులు, గృహాల పై నుంచి వెళ్లే విద్యుత్తు లైన్ల మార్పు తదితర సమస్యలను వినియోగదారులు సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో నిరక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్య క్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 1800 425 155333కు కాల్ చేయడం , వాట్సాప్ నంబరు91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చుని తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఎన్.శోభా వాలెంటీనా, ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, పి.సుధాకర్, ఎం.శ్రీకాంత్, జనరల్ మేనే

# తిరుమల సమాచారం

## శ్రీవారి సేవలో యుపి సిఎం ఆదిత్యనాథ్

**- అంతా శుభాలు కలగాలని ప్రార్థన**



**తిరుమల,సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం రాత్రి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దర్శించుకున్నారు. ఆధ్యాత్మికత, భక్తిభావం కలిగిన ఆయన రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆలయం వద్దకురాగానే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్,నారాయణ,టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. సకలం శుభాలు కలగాలని ఆకాంక్షించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ ప్రధాన అర్చకుడు వేణు గోపాలదీక్షితులు,అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలోపల ఆద్యంతం భక్తిభావంతోనే ఉన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం మలయప్పస్వామి వాహనసేవలో పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో భద్రతకు పటిష్ట చర్యలు

**- తిరుమలలో పనిచేస్తున్న కార్మికుల యాంటీసిడెంట్ వెరిఫికేషన్‌కు పోలీస్ శాఖ చర్యలు**



**తిరుమల, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** త్వరలో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తిరుమలలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ శాఖ,టిటిడి విజిలెన్స్ సమన్వయంతో విస్తృత భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలలోని షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లు, మఠాలు, గెస్ట్‌హౌస్‌లు, వివిధ వాణిజ్య సంస్థలు, ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను సమగ్రంగా పరిశీలించే ప్రక్రియ చేపడుతున్నారు. ఈ పరిశీలనలో భాగంగా ఇప్పటికే ఆయా సంస్థల్లో పనిచేస్తున్న పాత వర్కర్ల వివరాలు, డేటాను పరిశీలించారు. ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన వర్కర్ల వివరాలను సంబంధిత సంస్థలు నమోదు చేశారా లేదా తనిఖీ చేస్తున్నారు. ప్రతి కార్మికుడికి సంబంధించిన వ్యక్తిగత, గుర్తింపు వివరాలతో పాటు పోలీస్ రికార్డుల ఆధారంగా యాంటీసిడెంట్‌లను పరిశీలిస్తున్నారు. గతంలో ఏదైనా నేర చరిత్ర ఉన్నదా అనే అంశాన్ని పోలీస్ రికార్డుల ఆధారంగా ధ్రువీకరిస్తున్నారు. ఆయా సంస్థల యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న ప్రతి వర్కర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి, పోలీస్ శాఖకు అవసరమైన సమాచారాన్ని అందించాలి. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు రానున్న నేపథ్యంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ యాంటీసిడెంట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీస్ శాఖ తెలిపింది.

## భక్తులకు సురక్షిత ప్రయాణమే లక్ష్యం

**- తిరుపతిలో ఆర్టీసి బస్సుల తనిఖీలు**



**తిరుమల, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న వారంరోజుల్లో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతి–తిరుమల, తిరుమల–తిరుపతి మధ్య భక్తులను సురక్షితంగా చేర్చాలని తిరుపతి జిల్లా డిపిటిఒ కె.శ్రీనివాసరావు సూచించారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో ప్రతి బస్సు కండీషన్‌గా ఉండాలని, డ్రైవర్ ఎంతో చాకచక్యంగా జాగరూకతతో బస్సులను నడపాలని సూచనలు చేశారు. ఇందుకోసం ఘాట్‌లో తిరిగే ప్రతి బస్సు కండీషన్‌ను ప్రతిరోజూ తనిఖీ చేయడానికి అలిపిరి వద్ద తనిఖీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. శ్రీవారి బ్రహ్మోత్సవ సన్నాహకాలంలో భాగంగా నిర్వహించే వాహనాల మరమ్మత్తుల నిర్వహణకు శాశ్వత వాహన తనిఖీ కేంద్రం అలిపిరి బాలాజీ బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ తనిఖీల్లో బస్సుల యొక్క కీలకమైన వ్యవస్థలు బ్రేకింగ్, స్టీరింగ్, సస్పెన్షన్, ఎలక్ట్రికల్ లైటింగ్, ఇంజన్ కూలింగ్ టైర్లు సంబంధించిన అంశాలు ఎటువంటి చిన్న లోపం లేకుండా పూర్తిస్థాయి తనిఖీ నిర్వహించి తిరుమల ఘాట్ రోడ్ నందు తిప్పుటకు అనుమతించబడుతుందన్నారు. మొదటిరోజు తిరుపతి జిల్లా డిపిటిఒ శ్రీనివాసరావు, డిప్యూటీ సిఎంఇ టి.బాలాజీ, సూళ్లూరుపేట డిపో మేనేజర్ డి కళ, అసిస్టెంట్ ఇంజనీర్లు వెంకటగిరి, అలిపిరి, చిత్తూరు డిపోలు ఎం.ప్రభాకర్, ఎం.ఆనంద్, జగదీష్, ఎ ప్రభాకర్, వివిధ డిపోల మెకానిక్, ఎలక్ట్రిషన్ సహాయ మెకానిక్ సిబ్బంది పాల్గొన్నారు. నిర్దేశిత డిపోల బస్సుల తనిఖీ నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షి ంచి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

- దర్శన సౌకర్యం, లడ్డు కార్డు ఇవ్వాలి



**తిరుపతి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి బోర్డు సూచనల మేరకు ఎఫ్ఎంఎస్, హెల్త్, అన్నదానం, కళ్యాణకట్ట, సెక్యూరిటీ, వాటర్ వర్క్స్, అగరబత్తి ఇతర కాంట్రాక్ట్ కార్మికులకు దర్శనం సౌకర్యం, లడ్డు కార్డు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంతో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం టిటిడి పరిపాల భవనం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రమణ్యం, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి. బాల సుబ్రహ్మణ్యం, నగర అధ్యక్ష కార్యదర్శులు పార్థసారధి రెడ్డి, పి బుజ్జి, స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కే. వేణుగోపాల్, టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ సిద్దు, వి. ప్రభాకర్ మాట్లాడారు. శ్రీవారి దర్శనార్థం రోజు వచ్చే వేలాది మంది భక్తులకు మలమూత్రాలను శుభ్రం చేయడం, భక్తులుకు ఇచ్చిన వసతి గదులను, బాత్రూములను, మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న ఎఫ్ఎంఎస్, హెల్త్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల మానవతా దృక్పథాన్ని చూపాలని అన్నారు. ఎఫ్ఎంఎస్, హెల్త్ కార్మికులు పట్ల చిన్న చూపు చూడడం, వివక్షత పాటించడం సరైనటువంటిది కాదని, ఇదేనా టిటిడి ఇచ్చే గౌరవం అని, ఇది ధర్మమేనా అని ప్రశ్నించారు. కొంతమంది అధికారులు కార్మికులను మనుషులుగా కూడా గుర్తించలేని స్థితిలో ఉండటం బాధాకరమని, చాలా హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కారీరిష్టివర్జన్య వరుణయాగమైనా కురవని వానలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లావాసుల్లో ఆందోళన



**తిరుమల, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో కురవాల్సిన వర్షాలు కురవకపోవడంతో పుష్కలంగా వానలు కురవాలని ఐదురోజులపాటు కలియుగవైకుంఠం తిరుమలలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కారీరిష్టివర్జన్య వరుణయాగం పరిసమాప్తి అయ్యి వారంరోజులు కావస్తున్నా చినుకు లేకపోవడంతో రాయలసీమ వాసులు మథనపడుతున్నారు. ఈ ప్రత్యేక హోమాలు, యాగాదులను 32మంది రుత్వికులతో ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో జరిపించారు. సాధారణంగా ఈ హోమాలు ముగిసేలోపు వర్షాలు సమృద్ధిగా కురిసేవి. అయితే ఈ ఏడాది ఈ హోమాలను నిర్వహించి వారంరోజులు కావస్తున్నా ఇప్పటికీ చినుకు అనేది లేకపోవడంతో రానున్న రోజుల్లో తాగునీటికి అవస్థలు తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాలకోసమే భారతీయ సనాతన సంస్కృతిలో యజ్ఞయాగాదులకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. వేదకాలం నుండి ప్రకృతి సమతుల్యత, ప్రజల సంక్షేమం, రాజ్యాభివృద్ధి, ఆరోగ్యం, ఐశ్వర్యం వంటి అనేక శుభకార్యాల కోసం వివిధ యజ్ఞాలను నిర్వహించినట్లు వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు వివరిస్తాయి. ముఖ్యంగా వర్షాభావం తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని చేసే కారీరిష్టి వర్జన్య వరుణ యాగం కలియుగంలో నేటికీ విస్తృతంగా చర్చ జరుగుతూనే ఉంటుంది. కారీరేష్టి పర్జన్య శాంతి హోమం, వరుణ జపం అనేవి వర్షాలు సమృద్ధిగా కురవడానికి నిర్వహించే విశిష్టమైన వైదిక యజ్ఞాలు. వర్షాలు లేకుండా కరవు పరిస్థితులు ఏర్పడినప్పుడు వర్ష దేవుడైన వరుణుడిని, పర్జన్యుడిని ప్రసన్నం చేసుకోవడం.

# పలు చోరీ కేసులను చేధించిన యాదమరి పోలీసులు

## - రూ.4.56 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం, 5 మంది నిందితులు అరెస్టు



రూ.4.56 చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని 5 మంది నిందితులను అరెస్టు చేసిన యాదమరి పోలీసులు

చిత్తూరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా యాదమరి పోలీస్ స్టేషన్ పరిధితో పాటు చిత్తూరు నగరం, పరిసర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన పలు దొంగతనం కేసులను యాదమరి పోలీసులు చేధించారు. ఈ కేసులకు సంబంధించి ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలను యాదమరి పోలీసులు అరెస్టు చేసి వారి నుండి ద్విచక్రవాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర చోరీ సొత్తులను స్వాధీనం చేసుకున్నారు. యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం యాదమరి–ప్రశాంత్‌నగర్ రహదారిలోని పుల్లయ్యగారిపల్లి గ్రామ సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవే బ్రిడ్జి కింద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు పోలీసుల కంటపడ్డారు. వారు ఒక వాహనంపై ఎల్ఇడి టివి, స్పీకర్లు వుండటంను గమనించిన పోలీసులు వారిని ఆపడానికి ప్రయత్నించగా వారు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించారు. వీరిని వెంబడించి పట్టుకున్న పోలీసులు ఆపై వారిని విచారించగా సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితం గడపాలని భావించి ఒక ముఠాగా ఏర్పడి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు అంగీకరించారు. చోరీలకు వెళ్ళడానికి ముందు మహిళా నిందితులు రోడ్డు ప్రక్కన వుండి పరిసరాలను గమనించేవారని, ఎవరైనా అనుమానస్పదంగా ప్రశ్నిస్తే తాము ఇతర ప్రాంతం నుండి వచ్చామని, తమతో వున్న చిన్నారికి పాలు ఇస్తున్నామని చెప్పే విధంగా ప్రణాళికలు రూపొందించేవారని విచారణలో వెల్లడించారు. ఆగస్టు 28వ తేదీ రాత్రి 11 గంటలకు చిత్తూరు నగరంలో జైలుకు సమీపంలోని దుర్గానగర్ కాలనీలో ఓ ఇంటి ఎదుట తాళం వేసి వుంచిన బజాజ్ పల్సర్ వాహనంను నిందితులు చోరీ చేసినట్లు అంగీకరించారు. అలాగే ఆగస్టు 24వ తేదీ అర్ధరాత్రి యాదమరిలోని ఓ క్లినిక్‌ను తాళాలను ఇనుప రాడ్‌తో పగులగొట్టి ఒక ట్యాబ్‌తో పాటు రూ.1,500 దొంగలించుకెళ్ళారు. అలాగే చిత్తూరు–తిరుపతి రహదారిలో పి.కొత్తకోట బస్‌స్టాప్ వద్ద తాళం వేసి వున్న టీస్టాల్‌ను గుర్తించి ఇనుప రాడ్ సహాయంతో తాళాలు పగులగొట్టి రూ.70 వేల విలువైన వస్తువులను దొంగలించారు. అలాగే మురకంబట్టు సర్కిల్ సమీపంలో చికెన్ షాపు వద్ద నిలిపి వున్న రూ.1.80 లక్షల విలువైన బైక్‌ను నిందితులు దొంగలించినట్లు అంగీకరించారు. అలాగే వరిగిపల్లి వద్ద తాళం వేసి వుంచిన రూ.80 వేల విలువైన హోండా అక్టీవాను దొంగలించుకెళ్ళారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడు అరక్కోణంకు చెందిన ఎం.విగ్నేష్(30), చిత్తూరు దుర్గానగర్ కాలనీకి చెందిన పి.లక్ష్మణ్(19), తమిళనాడు వేలూరుకు చెందిన విగ్నేష్(26), చిత్తూరు దుర్గానగర్ కాలనీకి చెందిన బి.మగేశ్వరి(35), తమిళనాడు చెన్నైకు చెందిన కె.జయశ్రీ(23)లను యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.





# ఎఐ వచ్చినా.. గ్రంథాలయానికి ఆదరణ తగ్గదు!

## వన్ నేషన్-వన్ సబ్‌స్క్రిప్షన్‌తో పరిశోధనకు కొత్త ఊతం

## ఎస్వీయూలో గ్రంథాలయ జాతీయ సదస్సులో నిపుణుల ఉద్ఘాటన

తిరుపతి విద్య సెప్టెంబర్ 7 ప్రభాతవార్త కృత్రిమ మేధ (ఏఐ) శరవేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో గ్రంథాలయాలు కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని తమ సేవలను మరింత విస్తృతం చేయాలని జాతీయ సదస్సులో పాల్గొన్న పలువురు గ్రంథాలయ రంగ ప్రముఖులు పిలుపునిచ్చారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తకం, గ్రంథాలయం, గ్రంథాలయాధికారి ప్రాధాన్యత సమాజంలో కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో బ్రిడ్జింగ్ ది డిజిటల్ డివైడ్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ పబ్లిక్ అండ్ అకడమిక్ లైబ్రరీస్ అంశంపై నిర్వహిస్తున్న గ్రంథాలయ జాతీయ సదస్సులో తొలిరోజు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు పాల్గొని భవిష్యత్ గ్రంథాలయ సేవలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇన్ఫ్లిబ్‌నెట్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య దేవిక మడల్లి మాట్లాడుతూ, దేశంలో పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులకు అందుబాటులో ఉన్న భారీ స్థాయి డిజిటల్ సమాచార వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా వేలాది అంతర్జాతీయ జర్నల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ, వాటి వినియోగం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రతి గ్రంథాలయంలో ఇన్ఫ్లిబ్‌నెట్ కార్నర్ ఏర్పాటు చేసి వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఆర్‌టీసీ విశ్రాంత ఆచార్యులు డా. ఏ.ఆర్.డి. ప్రసాద్ మాట్లాడుతూ, సమాచారాన్ని కొంతమందికే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడమే గ్రంథాలయాల అసలు లక్ష్యమని పేర్కొన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఆర్.కె. భట్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రంథాలయ సిబ్బంది తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోకపోతే వెనుకబడిపోతాం అని హెచ్చరించారు. ఆచార్య ఎం. మధుసూదన్ మాట్లాడుతూ, ఏఐ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకోవాలని, అయితే ఏఐ ఎప్పటికీ గ్రంథాలయానికి ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. పుస్తకాలు, విశ్వసనీయమైన సమాచారం, వాటిని వినియోగదారులకు చేరవేసే గ్రంథాలయాధికారుల అవసరం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. డీఆర్‌డీఓ సమాచార గ్రంథాలయ శాస్త్రవేత్త డా. బి. సెంధిల్ పరిశోధనలో నాణ్యత, శాస్త్రీయత, పారదర్శకత, నైతిక విలువల ప్రాధాన్యతను వివరించారు. పరిశోధకులు సాంకేతిక సాధనాలను ఉపయోగించే సమయంలో నైతిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భారతీదాసన్ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు డా. శ్రీనివాస రాఘవన్ మాట్లాడుతూ, పరిశోధన కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా దాని ఫలితాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే సమాజానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారి డా. కె.జి. సుధీర్ గ్రంథాలయ నిర్వహణలో ఏఐ వినియోగంపై వివరించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా గ్రంథాలయ సేవలను వేగవంతం చేయడంతో పాటు



ఆర్టీజీఎస్‌పై సమీక్షలో చంద్రబాబు

# ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహించిన సిఎం

విజయవాడ,సెప్టెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి: ప్రతి రంగంపై దృష్టి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. పరిష్కరించాల్సిన అంశాలపై ముందు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్దిష్ట వ్యవధిని నిర్ణయించుకుని మరల ఆ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహించారు. సెర్ప్, దేవాదాయ, ఏపీఎస్ ఆర్టీసీ, ఆర్ అండ్ బీ, రవాణా అగ్నిమాపక శాఖల పనితీరు, సేవల్లో పురోగతి వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత దగ్గర చేసేలా విధానాలు ఉండాలని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన అంశాలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఈ దిశలో తీసుకున్న చర్యలు, సాధించిన విజయాలకు ప్రజలకు కీలకంగా మహిళలకు తెలియాలన్నారు. గ్రామీణ రహదారి వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దుతున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలో సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ–బస్సుల వినియోగం, ప్రయాణికులకు అవగాహన కలించాలన్నారు. సమీక్షలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అడుగంటిన భూగర్భ జలాలతో ఎండిపోతున్న బోర్లు

## - బోర్లు ఎండిపోవడంతో చీనీకి నీరు అందించలేక ఇక్కట్లలో అనంత రైతాంగం - గార్లదిన్నె మండలంలో టాంకర్ల ద్వారా కూడా నీరు అందించలేని పరిస్థితి - పుట్లూరు మండలంలో జెసిబి ద్వారా చీనీ చెట్లు తొలగింపు - ప్రతి ఏటా అనంతలో విస్తారంగా పెరిగిన చీనీ సాగు

అనంతపురం, సెప్టెంబర్ 7, (ప్రభాతవార్త బ్యూరో) భారతదేశంలో అత్యంత వెనుకబడిన కరువు ప్రాంతం రాజస్థాన్లోని జై షెల్మర్ మొదటి స్థానంలో ఉంటే రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం జిల్లా రెండవ ప్రాంతంగా అధికారిక లెక్కల్లో గుర్తింపు వచ్చింది. వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా లో కరువు నివారణ చర్యలను చేపట్టేందుకు గత రెండు మూడు దశాబ్దాల కాలంలో కరువు నివారణ పథకం కింద వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఆ పథకాల ఫలితం ఒక మేర అయితే మరోవైపు కాలక్రమేనా రైతుల ఉద్యమాల వల్ల పాలకులు తీసుకున్న చర్యల వల్ల తుంగభద్ర జలాశయంతో పాటు శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ నీవా ఎత్తిపోతల పథకం ద్వారా కెనాల్సు కు, చెరువులకు కొన్నేళ్లుగా ప్రతి ఏటా నీరు రావడంతో రైతుల జీవితాల్లో కొంతమేర వెలుగులు వచ్చాయి. ప్రతి యటా వచ్చే వర్షాలతో చెరువుల్లోకి నీరు రావడం, కొన్ని చెరువులకు, రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా, హెచ్ ఎల్ సి కెనాల్స్ నుంచి నీరు ఇస్తూ రావడంతో భూగర్భజాల మట్టం పెరుగుతూ వచ్చింది అదే సమయంలో తాగునీటి సమస్య తగ్గిపోతూ వచ్చింది.. అయితే ఎలి నినో ప్రభావం వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి.. ఇందులో భాగంగా దేశ విదేశాలకు ఎగుమతి చేసే ఉమ్మడి అనంతపురం జిల్లా చీనీ రైతులు ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల కష్టపడి పెంచిన చీనీ చెట్లను బతికించుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. భూగర్భ జలమట్టం తగ్గిపోయి బోర్లు ఎండిపోవడం, కొత్తగా బోర్లు వెయ్యి అడుగులు, 1200 అడుగులు లోతు వేయించిన నీళ్లు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడక పంటలు సరిగా లేవని పత్తి, వేరుశనగ పంటలను కొన్నిచోట్ల భూమి నుంచి రైతులు తొలగిస్తున్నారు. సోమవారం మరో ఆందోళనకర సంఘటన చోటు చేసుకుంది. పుట్లూరు మండలం లోని భాస్కర్ రెడ్డి అనే రైతు తమ పొలంలోని బోర్లు ఎండిపోవడంతో నీళ్లు అందించలేక చీని చెట్లను జెసిబి ద్వారా తొలగించడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఏడాది వర్షాలు రాకపోవడం ఒక ఎత్తు అయితే పుట్లూరు బ్రాంచ్ కెనాల్ కు నీళ్లు రాకపోవడం వల్ల పుట్లూరు మండలంలోని పలు గ్రామాల్లో చీనీ రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది.. ఈ ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నప్పటికీ గార్లదిన్నె మండలంలో పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంది. సింగనమల నియోజకవర్గ గార్లదిన్నె మండలం పండ్ల తోటలకు ప్రసిద్ధి. గార్లదిన్నె మండలంలో దాదాపు 9800 ఎకరాలలో రైతులు చీనీ తోటలను సాగు చేశారు.. ముఖ్యంగా ఆ మండలంలోని ముకుందాపురం, కోటంక, మర్తాడు గ్రామాల్లో రికార్డు స్థాయిలో చీనీ సాగు చేశారు.. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల జూలై నెలలో సమస్యలు మొదలై ఆగస్టు నెలలో తీవ్ర రూపం దాల్చాయి. తోటలో ఉన్న బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్న ఇబ్బందులు ఎదురవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ గ్రామంలో చూసిన కన్నీటి గాథలే. ఎన్నో ఏళ్ల పెంచిన చీనీ చెట్లు కళ్ళ ముందరే వాడిపోతుంటే వాటికి నీటి తడులి ఇవ్వలేక రైతులు ఆవేదనతో కుమిలిపోతున్నారు. ఇటీవల జరిగిన సాగునీటి మండలి సలహా సమావేశంలో సింగనమల ఎమ్మెల్యే బండారి శ్రావణి కూడా తమ నియోజకవర్గంలో చీని తోటలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసే విషయాన్ని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించడం గమనించదగ్గ విషయం.. గార్లదిన్నె మండలం మర్తాడలో 16 00, కొటంక లో 1000 ఎకరాలలో చీనీ తోటలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో 1400,1500 అడుగుల లోతు బోర్లు వేసిన నీళ్ల పడడం లేదు. అదే మండలంలోని పాపినేపల్లిలో మంచినీటి కోసం 1400 అడుగులు బోర్ వేసిన నీరు పడలేదని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విధంగా ఏ గ్రామంలో చూసినా చీనీ రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఒక సర్వే ప్రకారం అనంతపురం జిల్లాలో 1,53,776 హెక్టార్లలో పండ్ల తోటలు ఉంటే చీనీ తోటలు53,331 హెక్టార్ల లలో విస్తరించి ఉన్నాయి. అనంతపురం జిల్లాలో ఒక చీనీ తోటల ద్వారానే ఏడాదికి సగటున 13,33,275 టన్నుల చీనీ కాయలు ఉత్పత్తి అవుతాయి. అనంతపురం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో, జిల్లా సరిహద్దుల్లోని కడప జిల్లా పులివెందులలో చీనీ పండ్లకు సంబంధించి క్రయవిక్రయాలకు పెద్ద మార్కెట్లు ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లో అనంతపురం మార్కెట్ కు సీమ జిల్లాల నుంచి చీనీ పండ్లను రైతులు చేస్తుంటారు.. ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు అనంతపురంలో తిష్ట వేసి చీనీ పండ్ల ను కొనుగోలు చేసి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. రెండు మూడు దశాబ్దాలుగా చీనీ సాగు విపరీతంగా పెరిగింది. అయితే ఒక ఏడాది నుంచి వివిధ కారణాలవల్ల చీనీ పండ్లకు సరైన ధరలు రాక రైతులు నిరాశ తో ఉన్నారు. పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితుల్లో వల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో చీనీ రైతుల పరిస్థితి ఎక్కడ ఆందోళనకరంగా ఉంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాం..

# ఎపి స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో సత్తా చాటిన చిత్తూరు పోలీసులు

## - 11 స్వర్ణ, 6 రజత, 13 కాంస్య పతకాలు సాధన



మొదటి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీల్లో పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుండి 4వ తేదీ వరకు జరిగిన మొదటి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్–2026 పోటీల్లో అనంతపురం రేంజ్ తరపున పాల్గొన్న చిత్తూరు జిల్లా పోలీసులు అధికారులు, సిబ్బంది 30 పతకాలు సాధించి సత్తా చాటారు. ఎపి స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్–2026లో పాల్గొని పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం జిల్లా సాయుధదళ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ మనోహార్ ఖోఖో విభాగంలో కాంస్య పతకం, బాడీ బిల్డింగ్ విభాగంలో ఆర్ఐ చంద్రశేఖర్ కాంస్య పతకం, కుస్తీ, బాడ్మింటన్ పోటీల్లో కార్వేటినగరం ఎస్ఐ తేజస్విని రెండు రజత పతకాలు సాధించారు. అలాగే పోలీస్ కానిస్టేబుళ్లు ప్రవీణ్ బాడీ బిల్డింగ్ విభాగంలో బంగారు పతకం, ఎస్ అక్బర్ భాషా కబడ్డీ, ఫుట్‌బాల్ విభాగాల్లో కాంస్య పతకాలు, ధనంజయులు, ఎన్.రాజ్‌కుమార్, రామకృష్ణలు కబడ్డీ విభాగంలో కాంస్య పతకాలు, కబడ్డీ విభాగంలో కానిస్టేబుల్ రసకుట్టి బంగారు పతకం, కాంస్య పతకం, షేక్ ఫైరోజ్ బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం, కబడ్డీ విభాగంలో కాంస్య పతకం సాధించారు. అలాగే సి.వెంకటరెడ్డి కబడ్డి విభాగంలో కాంస్య, రెజ్లింగ్ విభాగంలో సుధాకర్ రెండు బగారు పతకాలు, ఎస్ సెంధిల్ కుమార్ కబడ్డీలో కాంస్య పతకం, ఖోఖో విభాగంలో వి.వేణుగోపాల్‌రెడ్డి కాంస్య పతకంలు సాధించారు. అలాగే ఏఆర్ మహిళా పిసి ఎం.లావణ్య వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం, రిలే విభాగంలో కాంస్య, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు. అలాగే ఏఆర్ మహిళా పిసి యు.అరుణ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో వెండి పతకం, పవర్ లిఫ్టింగ్ విభాగంలో వెండి పతకం సాధించారు. మహిళా పిసి కె.ధనలక్ష్మిమ జావెలిన్ త్రో విభాగంలో బంగారు, షాట్‌పుట్ విభాగంలో బంగారు, పవర్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు, బాక్సింగ్ విభాగంలో వెండి పతకాలు సాధించారు. పోలీసు క్రీడల్లో జిల్లా నుండి పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది మొత్తం 17 మంది కలిసి 30 పతకాలు సాధించారు. వాటిలో 11 స్వర్ణ, 06 వెండి, 13 కాంస్య పతకాలు వున్నాయి. ఈ కార్యక్రమంలో నాన్ కేడర్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్ షాను, ఏఆర్ అడిషనల్ ఎస్పీ దేవదాస్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రూఫ్ టాప్ సోలార్ పనులు వేగవంతం

## - పిఎంకుసుమ్ పథకం కింద ఊపందుకున్న ఫీడర్ సోలరైజేషన్ పనులు



తిరుపతి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్పిడిసిఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. సంస్థ పరిధిలో ఇప్పటివరకు 1.31 లక్షల ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేశామని తెలిపారు. వాటిలో 1.01 లక్షల సర్వీసులను గ్రిడ్‌కు అనుసంధానం చేయడం జరిగిందని వివరించారు. ఎసిఎస్‌పిడిసిఎల్ పరిధిలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితోపాటు సంబంధిత ఏజెన్సీల సమన్వయంతో సోలార్ ఏర్పాటు పనులను మరింత వేగవంతం చేయాలని సంస్థ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి సంస్థ అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిఎంకుసుమ్ పథకంలో భాగంగా ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా రైతులకు పగటిపూట నాణ్యమైన 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఈ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో రైతులకు సకాలంలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంస్థ అధికారులు, సిబ్బందిని సిఎండి ఆదేశించారు. సర్వీసులను మంజూరు చేసేందుకు అవసరమైన ప్రక్రియలో జాప్యాన్ని నివారించాలని అధికారులకు సూచించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఆందోళన : ఎపియుడబ్ల్యూ జె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు




సమావేశంలో మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

అనంతపురం, సెప్టెంబర్ 7, (ప్రభాతవార్త బ్యూరో) జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ వి సుబ్బారావు తెలిపారు. అనంతపురంలోని ప్రెస్ క్లబ్ లో ఇవాళ జరిగిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 2న కోరికల దినోత్సవం పాటిస్తామని అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే దశల వారి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఐజేయూ ప్లీనరీ లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళామని.... సీఎం వెంటనే స్పందించి సీఎంవో కు పంపారు అని గుర్తుచేశారు. సీఎంఓ గతంలో రద్దైన యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు అని సుబ్బారావు చెప్పారు. ప్రభుత్వం కట్టే డబ్బు విషయం క్యాబినెట్ చర్చ కు వెళ్లాల్సి ఉందని... ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం అయితే ఐ అండ్ పీఆర్ కు కేటాయించే బడ్జెట్ లో కడతామని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారని చెప్పారు. హౌసింగ్ స్కీమ్ ప్రతిపాదనలో ఉందని చెప్పారు. అందరికీ ఇళ్ళు ఇస్తామని చెప్పారని... రూ.100 కోట్లు వెల్ఫేర్ ఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తోందన్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, బీహార్, కేరళ ఇతర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ఇచ్చిన విధంగా రిటైర్డ్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలన్నారు. 58 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికి పింఛన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని డిమాండ్ చేశారు.

# మూడు దశాబ్దాల కల సాకారం.. పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం..

## - ప్రాజెక్టు కోసం పూల సుబ్బయ్య తుది శ్వాస వరకు పోరాటం.. - కరువు నేలపై కృష్ణమ్మ పరుగులు.. - వెలుగొండ ప్రాజెక్టు వద్ద పూల సుబ్బయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి - సిపిఐ జాతీయ నేత డాక్టర్ కె నారాయణ





మార్కాపురం. ప్రభాతవార్త ప్రతినిధి వెలుగొండ ప్రాజెక్టు కోసం మహనీయులు పూల సుబ్బయ్య తుది శ్వాస వరకు పోరాటం చేశారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే నారాయణ స్పష్టం చేశారు. కరువు కాటకాలతో నతమతమవుతున్న మార్కాపురం జిల్లా ప్రజానీకానికి వరప్రసాదమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. దోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామం వద్ద ఫీడర్ కెనాల్ ను సందర్శించిన అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ అనేక దశాబ్దాల పోరాటాల ఫలితంగానే శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసుకొని కృష్ణా జలాలను వెలిగొండ ప్రాజెక్టులోకి విడుదల కావడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ పూల సుబ్బయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 1984 దశకంలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మార్కాపురం వచ్చిన సందర్భంగా సీపీఐ నాయకత్వంలోని ప్రతినిధి బృందం సభ్యులు పూల సుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి, రావులపల్లి చెంచయ్య తదితర నాయకులు వెలిగొండ ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి, ఈ ప్రాంతంలోని వర్షాభావ పరిస్థితులు, కరువు కాటకాల గురించి ఆయనకు వివరించడం జరిగిందన్నారు. అందుకు స్పందించిన ఎన్టీరామారావు పూలసుబ్బయ్య పేరుతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి సర్వే చేసేందుకు జీవోను కూడా అధికారికంగా విడుదల చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అదే పేరుతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం కావడం శుభపరిణామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సాధనలో ఎవరు అవునన్నా కాదన్నా ఈ క్రెడిట్ అంతా భారత కమ్యూనిస్టు పార్టీకే చెందుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎన్టీరామారావు దగ్గర నుంచి చంద్రబాబు నాయుడు, డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్రెడ్డిలు ఎవరిపాత్ర వారు పోషించి ఈ గొప్ప కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వెలిగొండ ప్రాజెక్టు కు ఒక సొరంగం ద్వారా నీరు నరిపోదని రెండవ సొరంగం నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఉద్యమం ఫలితంగానే అది సాధ్యమైందని అన్నారు. మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి కావడం సంతోషమేనని, అలాగే రెండవ దశ నిర్మాణ పనులు కూడా వేగవంతంతో పూర్తి చేయాలని అప్పుడే ఈ ప్రాంతానికి పరిపూర్ణంగా న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 32 మండలాలు సస్యశ్యామలం కావడంతో పాటు 20 లక్షల మందికి డ్రింకింగ్ వాటర్ అందుతుందని, దీంతో ఫ్లోరైడ్ సమస్య కూడా పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ప్రాంతంలో వేసిన పంటలు పండక, వంటకోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు అనేక కష్ట నష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రాంతానికి వస్తున్న కృష్ణా జలాల ద్వారా వెనుకబడిన మార్కాపురం జిల్లా భవిష్యత్తులో ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆయన అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఒక కెనాల్ కు గుజ్జుల యల్లమందా రెడ్డి పేరు నామకరణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మొదట శ్రీకారం చుట్టిన ఘనత ఎన్టీరామావుకే దక్కుతుందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు సాధనలో సీపీఐ పోరాటాలు, త్యాగాలు మరువలేనివని అన్నారు.

ఒకప్పుడు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వలసలు ఉండేవని, వెలిగొండ ప్రాజెక్టు కు నీరు రావడం ద్వారా మార్కాపురం జిల్లాలో భవిష్యత్తులో వ్యవసాయరంగ ఉత్పత్తులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉండాలని అన్నారు.



# వైసిపి ధర్నాలోకి టిడిపి ఎమ్మెల్యే

## - రాజకీయ ప్రత్యర్థులైనా, ప్రజా సమస్యలే ముఖ్యం - కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

## - రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన 'అమిలినేన్ని' హుందా రాజకీయం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త: రాజకీయాలలో ప్రతిపక్ష అధికార పార్టీ నాయకుల మధ్య రాజకీయ కక్ష సాధింపు చర్యలు, పరస్పర దూషణలు, ఆరోపణలు, నువ్వంటే నువ్వని వాదోపవాదాలకు కేంద్రంగా ఉంటాయి. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కూడా వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య, అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మధ్య రాజకీయ విమర్శలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోకుండా కళ్యాణదుర్గం అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా కార్యక్రమాలను అమలు చేసుకుంటూ ఎమ్మెల్యే సురేంద్రబాబు దూసుకెళుతున్నారు. ప్రత్యర్థి వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య పలు కోణాలలో ఎమ్మెల్యే సురేంద్రబాబు పై అవినీతి ఆరోపణలు చేసినా అదరక, బెదరక ఎమ్మెల్యే సురేంద్రబాబు తనదైన శైలిలో సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో అమలు చేస్తూ ప్రజాభిమానము చూరగొనేందుకు తపన పడుతున్నారు. వైసిపి నేత తలారి రంగయ్య స్టాంపు కుంభకోణం అంటూ ఎమ్మెల్యే అమిలినేనిపై ఘాటు విమర్శలతో పాటు హైకోర్టులో పిల్ వేశారు. బెల్టు షాపుల్లో అక్రమ సంపాదన అంటూ తలారి రంగయ్య గత మూడు నాలుగు మాసాలుగా నల్ల చొక్కా ఉద్యమం సాగిస్తున్నారు. ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎ సాధించడంలో నేనంటే నేను అంటూ ఉద్యమాలు చేశారు. ఈ నేపథ్యంలో తనపై ప్రతిపక్ష నేత ఎన్ని ఆరోపణలు చేసినా ప్రభుత్వ పథకాల అమలుతో పాటు నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి సాధించేందుకు ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎస్ఆర్‌సి కంపెనీ ప్రతినిధుల సహకారంతో సొంత నిధులు వెచ్చించి సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నారు. ఇటీవల గ్రామీణ విద్యార్థులు స్కూల్ బ్యాగులు మూసుకుంటూ కిలోమీటర్ల పొడవునా నడిచి వెళ్తున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే ఎస్సార్ కన్స్ట్రక్షన్స్ కంపెనీ సహకారంతో ఐదున్నర కోట్ల జయంతో విద్యార్థులకు 7500 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులను గౌరవించాలని నియోజకవర్గంలోని 2,650 మంది ఉపాధ్యాయ దంపతులకు పట్టు వస్త్రాలను పంపిణీ చేశారు.

08-09pg10exHMNWJQE:08-09pg10exHMNWJQE.qxd 9/7/2026 11:28 PM Page 1



## ఎఎఫ్‌సి ఆసియా కప్..
# భారత్ విజయం
### 3-0తో బంగ్లాదేశ్ చిత్తు



**తాష్కెంట్:** ఎఎఫ్‌సి అండర్ 20 ఆసియా కప్‌కు అర్హత సాధించే దిశగా భారత్ జట్టు దూసుకుపోతోంది. గ్రూప్ బిలో జరిగిన తమ చివరి క్వాలిఫైయర్ మ్యాచ్‌లో భారత్ బంగ్లాదేశ్‌ను ఓడించి, ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్ చైనా 2027లో స్థానం సంపాదించే తమ ఆశలను మరింత పెంచుకుంది. తాష్కెంట్‌లోని దోస్లిక్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు తరఫున డానీ మీటీ లైశ్రామ్, విశాల్ యాదవ్, మహ్మద్ అర్బాష్ గోల్స్ సాధించారు. ఈ ఘన విజయంతో, 20 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్‌లో ప్రవేశించే రేసులో బ్లూ కోల్ట్స్ జట్టు సజీవంగా నిలిచింది. గ్రూప్ బిలో ఆడిన మూడు మ్యాచ్‌ల నుంచి ఆరు పాయింట్లతో భారత్ ఇప్పుడు రెండో స్థానంలో ఉంది. రెండు మ్యాచ్‌ల నుంచి మూడు పాయింట్లతో ఉన్నప్పటికీ, గ్రూప్ టాపర్ అయిన ఉజ్బెకిస్తాన్‌తో తలపడనున్న సిరియా చేతిలో భారత్ స్థానం కోల్పోయే ప్రమాదం ఉంది. ఒకవేళ సిరియా తమ మ్యాచ్‌లో ఓడిపోయినా లేదా డ్రా చేసుకున్నా, భారత్ రెండో స్థానంతో సరిపెట్టుకుని, ఎనిమిది గ్రూపులలోని ఏడు ఉత్తమ రన్నరప్ స్థానాల్లో ఒకటిగా నిలుస్తుంది. 25వ నిమిషంలో డానీ భారత్ తరఫున తొలి గోల్ చేయగా, ఆ తర్వాత 60వ నిమిషంలో విశాల్ తన అద్భుతమైన గోల్‌తో బ్లూ కోల్ట్స్‌కు రెండు గోల్స్ ఆధిక్యాన్ని అందించాడు. బెంచ్ నుండి వచ్చిన మహ్మద్ అర్బాష్ 79వ నిమిషంలో శక్తివంతమైన షాట్‌తో భారత్‌ను 30 ఆధిక్యంలోకి తీసుకువెళ్లగా, చివరకు వారు ఈ మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు.

## యుఎస్ ఓపెన్: డబుల్స్ జోడీ
# శ్రీరామ్-కింగ్ ఓటమి




**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ 2026 రెండో రౌండ్‌లోనే శ్రీరామ్ బాలాజీ నిష్క్రమణతో భారత్ తన ప్రచారాన్ని ముగించింది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీరామ్ బాలాజీ, అతని అమెరికన్ భాగస్వామి ఇవాన్ కింగ్ ఓటమి పాలయ్యారు. 53వ ర్యాంకులో ఉన్న బాలాజీ మరియు కింగ్, 12వ సీడ్ ఆటగాళ్లైన మొనాకోకు చెందిన హ్యూగో నైస్-ఎడ్వర్డ్ రోజర్‌వాసెలిన్ చేతిలో వరుస సెట్లలో 4-6, 5-7 తేడాతో ఓడిపోయారు. తొలి సెట్‌లోని ఎనిమిదో గేమ్‌లో భారత అమెరికన్ జంట సర్వ్‌ను కోల్పోవడంతో, వారు తిరిగి పుంజుకోలేక 4-6 తేడాతో ఆ సెట్‌ను కోల్పోయారు. రెండవ గేమ్‌లో, 12వ గేమ్ వరకు ఇరు జంటలు తమ సర్వ్‌ను నిలబెట్టుకున్నాయి. ఆ తర్వాత బాలాజీ-కింగ్‌ల సర్వ్ బ్రేక్ అవ్వడంతో ప్రత్యర్థులు 6-5 ఆధిక్యం సాధించారు. తర్వాతి గేమ్‌లో నైస్ మరియు రోజర్‌వాసెలిన్ మ్యాచ్‌ను ముగించడంతో, ఈ పోటీ గంటా 28 నిమిషాల్లో ముగిసింది. పోటీ ప్రారంభంలో, బాలాజీ-కింగ్ ద్వయం ఆరు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని, తొలి రౌండ్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన సాండర్ అరెండ్స్-డేవిడ్ పెల్‌లను రెండు గంటల 56 నిమిషాల్లో ఓడించారు. మరోవైపు, పురుషుల డబుల్స్‌లో బరిలోకి దిగిన మరో ఇద్దరు భారతీయులు, యూకీ భాంబ్రి-అనిరుధ్ చంద్రశేఖర్, తమ తొలి రౌండ్ మ్యాచ్‌లలో ఓడిపోయి పోటీ నుంచి నిష్క్రమించారు.

## దులీప్ ట్రోఫీ ఫైనల్..
# సౌత్‌పై ఈస్ట్ జోన్ ఆధిపత్యం
### కిషన్ 270 పరుగులతో వీరవిహారం

**చెన్నై:** సౌత్ జోన్‌తో ప్రారంభమైన దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ పటిష్టమైన స్థితిలో నిలిచింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో సోమవారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్, తొలి ఇన్నింగ్స్‌లో 163 ఓవర్లలో 708 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌటైంది. ఈస్ట్ జోన్ సాధించిన ఈ భారీ స్కోరులో కెప్టెన్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్ ప్రధాన హైలైట్‌గా నిలిచింది. కెప్టెన్ బాధ్యతలతో క్రీజులోకి వచ్చిన కిషన్ ప్రత్యర్థి బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ డబుల్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. అతను కేవలం 334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో ఏకంగా 270 పరుగులు చేసి అసాధారణ ఇన్నింగ్స్ ఆడాడు. బౌండరీల వర్షం కురిపిస్తూ సౌత్ జోన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. కిషన్ ఇతర బ్యాటర్లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి ఈస్ట్ జోన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.



ముఖ్యంగా కుమార్ కుషాగ్రతో కలిసి ఐదో వికెట్‌కు ఏకంగా 230 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు కొండంత కొండంత అండగా నిలిచాడు. అలాగే అనుకూల్ రాయ్తో కలిసి ఆరో వికెట్‌కు 140 పరుగులను జోడించి జట్టు స్కోరును 600 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. చివరకు త్రిపురాణ విజయ్ బౌలింగ్‌లో స్మరన్ రవిచంద్రకు క్యాచ్ ఇచ్చి కిషన్ వెనుదిరిగాడు. ఈస్ట్ జోన్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (270) తో పాటు కుమార్ కుషాగ్ర (101) సెంచరీ సాధించగా, ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72), వైభవ్ సూర్యవంశీ (44), అలాగే షికార్ మోహన్ (85), అనుకూల్ రాయ్ (45) పర్వాలేదనిపించారు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురాణ విజయ్ 4 వికెట్లు తీసుకోగా, శ్రేయస్ గోపాల్, చామ మిలింద్ చెరో 2 వికెట్లు, మహమ్మద్ సిరాజ్, షేక్ రషీద్ చెరో వికెట్ పడగొట్టారు. ఇషాన్ కిషన్ విధ్వంసకర ద్విశతకంతో ఈస్ట్ జోన్ మ్యాచ్లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది.



# మహిళల ఆసియా కప్: సెమీఫైనల్‌కు భారత్
### హ్యాట్రిక్ విజయాలతో నాకౌట్‌కు సిద్ధం

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ 2026లో భారత్ హ్యాట్రిక్ విజయాలతో సెమీఫైనల్ చేరింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టోర్నీలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. థాయ్‌లాండ్, హాంకాంగ్, పాకిస్థాన్‌పై అదిరిపోయే విజయాలు సాధించిన టీమిండియా నాకౌట్‌కు సిద్ధమైంది. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ వరుస విజయాలు సాధించి 6 పాయింట్లతో టేబుల్ అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. గత నెల 30న థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనే భారత్ 94 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది. ఆ తర్వాత హాంగ్‌కాంగ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో 137 పరుగుల తేడాతో గెలిచింది. ఇక ఈ నెల 5న జరిగిన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో పోరులో 8.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. ఇలా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు ప్రదర్శిస్తున్న ఈ సమష్టి కృషి వల్ల ప్లస్ 5.471 నెట్ రన్ రేట్‌తో భారత్ అధికారికంగా నాకౌట్ దశకు చేరుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్స్ కలిపి భారత మహిళల జట్టు ఇప్పటివరకు 19 నాకౌట్ మ్యాచ్‌లు ఆడింది. అందులో 8 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, 10 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. ఒక మ్యాచ్ ఫలితం తేలకుండా రద్దయింది. ఓవరాల్ నాకౌట్లలో భారత జట్టు గెలుపు శాతం 42.10గా నమోదైంది. సాధారణ టీ20 నాకౌట్ రికార్డులు కాస్త ఆందోళన కలిగించినప్పటికీ, ఆసియా కప్ టోర్నమెంట్లలో మాత్రం భారత మహిళల జట్టుకు తిరుగులేని రికార్డు ఉంది. ఆసియా కప్‌లో ఇప్పటివరకు ఆడిన 7 నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత్ 5 విజయాలు సాధించి, కేవలం 2 మ్యాచ్‌ల్లో మాత్రమే ఓడిపోయింది. 2012, 2016 ఫైనల్లలో పాకిస్థాన్‌ను ఓడించి కప్ కొట్టిన భారత్, 2022లో శ్రీలంక, థాయ్‌లాండ్‌లను నాకౌట్లలో చిత్తు చేసింది. 2024 ఆసియా కప్ సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 10 వికెట్లతో నెగ్గినప్పటికీ, ఫైనల్‌లో శ్రీలంక చేతిలో ఓటమి పాలైంది. పొట్టి ఫార్మాట్ నాకౌట్ ఒత్తిడిలో భారత జట్టు విజయం సాధించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# వరల్డ్ ఆర్చరీ.. ఫైనల్‌లో శీతల్, భావన ఓటమి



**జపాన్:** వరల్డ్ ఆర్చరీలో శీతల్ దేవి ఫైనల్‌కు అర్హత సాధించింది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ శీతల్ దేవి సోమవారం అహ్మదాబాద్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026లో వరుసగా మూడవ వ్యక్తిగత ఫైనల్‌కు చేరుకుంది. 19 ఏళ్ల ఈ యువతి మహిళల కాంపౌండ్ సెమీఫైనల్‌లో తన సీనియర్ సహచరి సరితను 145-143 తేడాతో ఓడించి, కజకిస్తాన్‌కు చెందిన ఐజాదా సెడాన్‌తో టైటిల్ పోరుకు సిద్ధమైంది. అంతకుముందు,
శీతల్ రాకేష్ కుమార్‌తో కలిసి పారా మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ ఈవెంట్ ర్యాంకింగ్ రౌండ్‌లో 1400/1440 స్కోరు సాధించి కొత్త ప్రపంచ రికార్డును కూడా నెలకొల్పింది. పురుషుల కాంపౌండ్ ఇండివిడ్యువల్ ఈవెంట్‌లో, ఇండోనేషియాకు చెందిన కెన్ స్వాగుమిలాంగ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో 144-146 తేడాతో ఓడిపోయిన తోమన్ కుమార్, కాంస్య పతకం కోసం అబ్బాస్ కధిమ్‌తో తలపడనున్నాడు. ఇక రెండుసార్లు వరల్డ్ పారా ఆర్చరీ సిరీస్ స్టేజ్ విజేత అయిన భావన, ఈ ఏడాది రికర్వ్ సెమీఫైనల్‌లో ఇరాన్‌కు చెందిన సోమయే రహీమీతో జరిగిన షూట్‌ఆఫ్‌లో ఓడిపోయి, ఈ సర్క్యూట్‌లో తన మొదటి ఓటమిని చవిచూసింది. ఈ ఫలితంతో వరుసగా మూడో టైటిల్ సాధించాలన్న ఆమె ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పుడు ఆమె తన స్వదేశీయురాలైన రాజశ్రీ రాథోడ్‌తో పూర్తిగా భారతీయుల మధ్య జరిగే పోరులో కాంస్య పతకం కోసం తలపడనుంది. మరోవైపు, పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు పతకం దక్కలేదు. పారాలింపిక్ ఛాంపియన్ హర్విందర్ సింగ్‌తో సహా నలుగురు ఆర్చర్లలో ఎవరూ చివరి నలుగురిలోకి ప్రవేశించలేదు. హర్విందర్ సింగ్ రౌండ్ ఆఫ్ 16లోనే నిష్క్రమించాడు.




# జీసెక్స్‌లో ఎఫ్‌పిఐలకు సెబీ కొత్త మినహాయింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:** భారత ప్రభుత్వ సెక్యూరిటీల్లో మాత్రమే పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు ఇకపై తమ ఇన్వెస్టర్ గ్రూప్ వివరాలను నియంత్రణ సంస్థలకు సమర్పించాల్సిన అవసరం ఉండదని సెబీ సోమవారం సర్క్యులర్ జారీ చేసింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో మాత్రమే పెట్టుబడులు పెట్టే విదేశీ ఇన్వెస్టర్లకు అనుసరణ (కంప్లయన్స్) నిబంధనలను మరింత సులభతరం చేయడమే ఈ నిర్ణయం ఉద్దేశం. ఇప్పటివరకు ఫుల్లీ యాక్సెసిబుల్ రూట్ ఫార్ ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే ఎఫ్‌పీఐలకు మాత్రమే ఈ మినహాయింపు ఉండేది. ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే ఎఫ్‌పీఐలు మాత్రం ఇన్వెస్టర్ గ్రూప్ వివరాలను తప్పనిసరిగా సమర్పించాల్సి వచ్చేది. ఇన్వెస్టర్ గ్రూప్ వివరాలను వెల్లడించడం ద్వారా పరస్పర సంబంధం ఉన్న పెట్టుబడిదారులను గుర్తించడంతో పాటు, పెట్టుబడులపై నిర్దేశించిన పరిమితులు ఉల్లంఘనకు గురవుతున్నాయా లేదా అనే విషయాన్ని నియంత్రణ సంస్థలు పర్యవేక్షిస్తాయి. ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడులకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను సడలించడంతో ఈ మార్పు చేసినట్లు సెబీ పేర్కొంది. జనరల్ రూట్ ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే ఎఫ్‌పీఐలు నిర్దేశిత పెట్టుబడి కేంద్రీకరణ పరిమితులను పాటించాల్సిన నిబంధనను ఆర్‌బీఐ తొలగించింది.

# 14.9 శాతానికి పెరిగిన ఎన్బీఎఫ్‌సిల రుణపరపతి




**ముంబయి, సెప్టెంబరు 7:** నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ఇచ్చిన రుణాల్లో గణనీయంగా వృద్ధి నమోదయింది. జూలై 31తో ముగిసిన నెలలో ఎన్‌బీఎఫ్‌సీల మొత్తం రుణ బకాయిలు వార్షిక ప్రాతిపదికన 14.9 శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే నెలలో రుణ వృద్ధి 10.6 శాతంగా నమోదైంది. ముఖ్యంగా రిటైల్ రుణాలు, అందులోనూ గృహ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. రిటైల్ రుణాల వృద్ధి జూలైలో 21.4 శాతానికి చేరింది. ఏడాది క్రితం ఇది 13.7 శాతంగా ఉంది. దీంతో ఎన్‌బీఎఫ్‌సీల రుణ వృద్ధికి రిటైల్ విభాగం ప్రధాన చోదక శక్తిగా మారింది. ఈ విభాగంలో రుణ వృద్ధి ఏడాది ప్రాతిపదికన దాదాపు 8 శాతం పాయింట్లు పెరిగింది. గృహ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు వేగంగా పెరగగా, వాహన రుణాలు మాత్రం స్థిరమైన వృద్ధిని కొనసాగించాయి. బంగారంపై రుణాలకు డిమాండ్ పెరగడంతో ఈ విభాగం మంచి పనితీరు కనబరిచింది. ఇదే సమయంలో గృహ రుణాలకు కూడా డిమాండ్ బలంగానే కొనసాగింది. వ్యవసాయ రుణాల్లో భారీ పెరుగుదవ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు ఎన్‌బీఎఫ్‌సీలు అందించిన రుణాలు జూలై 2026లో 18 శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి కేవలం 5.4 శాతంగా ఉంది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రుణాల కోసం డిమాండ్ బలపడటాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పారిశ్రామిక రంగానికి ఇచ్చిన రుణాల వృద్ధి మందగించింది. జూలైలో ఈ విభాగం రుణాలు 7.4 శాతం పెరగగా, 2025 జూలైలో 9.3 శాతం వృద్ధి నమోదైంది. మౌలిక వసతుల రంగంలో రుణ వృద్ధి బలహీనంగా ఉండటమే పారిశ్రామిక రుణాల వృద్ధి తగ్గడానికి ప్రధాన కారణంగా నిలిచింది




# జాగ్వార్, ల్యాండ్ రోవర్‌లో 4,000 ఉద్యోగాల కోత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:** టాటా గ్రూప్‌కు చెందిన బ్రిటిష్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ ప్రపంచవ్యాప్తంగా 4,000 ఉద్యోగాలను తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. వచ్చే రెండేళ్లలో ఈ ఉద్యోగాల కోత అమలు చేయనున్నట్లు తెలిపింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్‌కు అనుబంధ సంస్థ అయిన జేఎల్ఆర్ వచ్చే రెండేళ్లలో సుమారు 1.7 బిలియన్ పౌండ్ల వ్యయ పొదుపు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. కంపెనీ బ్రేక్‌ఈవెన్ స్థాయిని సుమారు 3 లక్షల వాహనాల స్థాయికి తగ్గించేందుకు ఈ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం జేఎల్ఆర్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 43,000 మంది ఉద్యోగులను కలిగి ఉంది. ప్రపంచ ఆటోమొబైల్ మార్కెట్లో పెరుగుతున్న పోటీ, వేగంగా మారుతున్న మార్కెట్ పరిస్థితులు, కొనసాగుతున్న భౌగోళికరాజకీయ అనిశ్చితి నేపథ్యంలో స్థిరమైన లాభదాయక వృద్ధిని సాధించే సామర్థ్యాన్ని పెంచుకోవడమే ఈ వ్యయ పొదుపు కార్యక్రమం ఉద్దేశమని కంపెనీ తెలిపింది. వచ్చే రెండేళ్లలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 4,000 ఉద్యోగాలను జేఎల్ఆర్ తగ్గించనుంది. ఈ ఉద్యోగాల కోత ప్రత్యక్ష తయారీ ఉద్యోగాలపై ప్రభావం చూపే అవకాశం లేదు. సాధ్యమైనంత వరకు స్వచ్ఛంద పద్ధతిలోనే ఉద్యోగాల సంఖ్యను తగ్గిస్తాం" అని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొదటి విడత ఉద్యోగాల కోతకు సంబంధించి సోమవారం నుంచే సంప్రదింపులు ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

## వాణిజ్యం



# ఆర్బీఐ రూ.3.53 లక్షల కోట్ల అదనపు లిక్విడిటీ విత్‌డ్రా

**ముంబై:** బ్యాంకింగ్ వ్యవస్థలో అధికంగా ఉన్న నగదును ఉపసంహరించుకునే చర్యల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం నిర్వహించిన ఓవర్‌నైట్ వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలంలో రూ.3.53 లక్షల కోట్లకు పైగా నిధులను రాబట్టింది. ఒక రోజు కాలపరిమితితో నిర్వహించిన ఈ వేలం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోని అదనపు లిక్విడిటీని తగ్గించినట్లు ఆర్బీఐ వెల్లడించింది. రివర్స్ రెపో వేలం కోసం ఆర్బీఐ రూ.5 లక్షల కోట్లను నోటిఫై చేయగా, బ్యాంకుల నుంచి రూ.3,53,390 కోట్ల మేరకు బిడ్లు వచ్చాయి. అంటే నోటిఫై చేసిన మొత్తంలో 70 శాతానికి పైగా నిధులను ఆర్బీఐవిత్‌డ్రాచేసింది. కట్‌ఆఫ్ రేటు, వెయిటెడ్ యావరేజ్ రేటు రెండూ 5.24 శాతంగా నమోదయ్యాయి.

# ప్రైవేటు పెట్టుబడుల్లో 11.9% వృద్ధి!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:** భారత్‌లో చాలాకాలంగా ఎదురుచూస్తున్న ప్రైవేటు పెట్టుబడుల పునరుద్ధరణ వేగవంతం అవుతోంది. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో పెట్టుబడులు 11.9 శాతం పెరిగాయి. కోవిడ్ కాలంలో చోటుచేసుకున్న అస్థిరతను మినహాయిస్తే, 2018 చివరి తర్వాత ఇదే అత్యంత బలమైన వాస్తవ పెట్టుబడి వృద్ధి అని సిటీ విశ్లేషకులు పేర్కొన్నారు. కార్పొరేట్ క్యాపెక్స్ ఊపందుకుంటోందన్న తమ అభిప్రాయానికి తాజా గణాంకాలు మరింత బలం చేకూర్చాయని వారు తెలిపారు. కేంద్ర ఎన్ఎస్ఓ డేటా ప్రకారం, దేశ ఆర్థిక వ్యవస్థలో స్థూల స్థిర మూలధన కల్పన వాటా 2025 ఏప్రిల్‌జూన్‌లో 31.4 శాతం ఉండగా, 2026 ఏప్రిల్ జూన్‌లో 34.3 శాతానికి పెరిగింది. రైల్వేలు, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లలో పెట్టుబడులు పెరగడం ఆర్థిక వృద్ధికి మద్దతుగా నిలుస్తోందని పరిశ్రమల సమాఖ్య అసోచామ్ సెక్రటరీ జనరల్ సౌరభ్ సన్యాల్ తెలిపారు. 2026 జనవరి మార్చి త్రైమాసికంలో కర్మాగారాల సామర్థ్య వినియోగం దాదాపు 77 శాతానికి చేరుకోవడంతో ఆటోమొబైల్స్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులు వేగం పుంజుకున్నాయని అంచనా. ఈ త్రైమాసికంలో ప్రధానంగా ప్రైవేటు రంగం ఆధారంగా సాగిన మూలధన పెట్టుబడులు ఏడాది క్రితంతో పోలిస్తే రూ.5 లక్షల కోట్లకు పైగా పెరిగాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పెట్టుబడుల నుంచి ప్రైవేటు రంగం వైపుగత రెండేళ్లలో ఎక్కువ కాలం పెట్టుబడుల వృద్ధికి ప్రభుత్వ మౌలిక వసతుల వ్యయమే ప్రధాన ఆధారంగా నిలిచింది. పన్ను తగ్గింపులు, రాష్ట్ర ప్రభుత్వాల నగదు సహాయ పథకాలు వినియోగ డిమాండ్‌కు మద్దతుగా నిలిచాయి.( ప్రభుత్వ వ్యయం వ్యయ ప్రణాళికల కారణంగా




ప్రైవేటు పెట్టుబడుల ఆసక్తి కూడా బ్యాంకర్లు చెబుతున్నారు. జూలై 31తో ముగిసిన పక్షం రోజుల్లో బ్యాంకు రుణాలు 19 శాతానికి పైగా పెరిగాయి. దశాబ్ద కాలంలో ఇదే అత్యంత వేగవంతమైన వృద్ధి. పరిశ్రమలకు ఇచ్చిన రుణాలు కూడా 20 శాతం పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పెద్ద కార్పొరేట్ సంస్థలు, నాన్ బ్యాంకింగ్ రుణ సంస్థలు, బంగారు రుణాల నుంచి రుణ డిమాండ్ పెరుగుతోందని యాక్సిస్ బ్యాంక్ సీఈఓ అమితాబ్ చౌదరి తెలిపారు. 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో లిస్టెడ్ భారత కంపెనీల మూలధన వ్యయం 11 శాతం పెరిగింది. అంతకుముందు ఇది 8 శాతంగా ఉంది.

# మార్కెట్లను వెంటాడిన పశ్చిమాసియా భయాలు



## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:** అమెరికాఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు బలంగా ఉండటం వంటి పరిణామాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. అమెరికా ఉద్యోగాల గణాంకాలు బలంగా ఉండటంతో సెప్టెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు మళ్లీ ఊపందుకున్నాయి. మరోవైపు అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం కూడా వర్ధమాన మార్కెట్లపై ఒత్తిడిని పెంచింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల అమ్మకాలు కొనసాగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచింది. భారీ ఐపీఓల వరుస కారణంగా మార్కెట్లో లిక్విడిటీపై కూడా ఒత్తిడి నెలకొంది. పలు పెద్ద ఐపీఓలు త్వరలో మార్కెట్లోకి రానుండటంతో సెకండరీ మార్కెట్ నుంచి భారీగా నిధులు మళ్లే అవకాశం ఉందన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఐటీ, మెటల్ షేర్లలో అమ్మకాల కారణంగా నిఫ్టీ దిగువన ముగిసింది. ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 382.62 పాయింట్లు తగ్గి 76,132.81 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 118.55 పాయింట్లు నష్టపోయి 23,779.15 వద్ద స్థిరపడింది.
ఇన్ఫోసిస్ 3.76 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.95 శాతం చొప్పున క్షీణించి సూచీలపై ప్రధానంగా ప్రతికూల ప్రభావం చూపాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.59 శాతం తగ్గగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడింది. బీఎస్ఈలో మొత్తం 2,010 షేర్లు లాభాల్లో ముగియగా, 2,474 షేర్లు నష్టపోయాయి. మరో 261 షేర్లలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ నవంబర్ 2026 ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌కు 48 సెంట్లు లేదా 0.50 శాతం పెరిగి 96.76 డాలర్లకు చేరింది. బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 96 డాలర్ల స్థాయికి చేరింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గింది. పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 94.5000 స్థాయిలో ట్రేడవగా, గత సెషన్‌లో ఇది 94.4300 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.13 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,52,572 వద్ద నమోదయింది. వీఏ టెక్ వాబాగ్ 0.33 శాతం, అవలోన్ టెక్నాలజీస్ 6.76 శాతం లాభపడ్డాయి. జిందాల్ స్టెయిన్‌లెస్ 0.39 శాతం తగ్గింది. సుదర్శన్ ఫార్మా ఇండస్ట్రీస్ 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. పీవీఆర్ ఐనాక్స్ 6.13 శాతం పడిపోగా, యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీస్ 3.82 శాతం, టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ 3.03 శాతం పెరిగాయి. ఇండోకో రెమెడీస్ 4.28 శాతం క్షీణించింది. అర్బన్ ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ 8.42 శాతం, బ్రైట్‌కామ్ గ్రూప్ 7.46 శాతం చొప్పున దూసుకెళ్లాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



వంట ఎంత జాగ్రత్తగా చేసినా ఒక్కోసారి కూరలు, వంటకాలు మాడి పోవడం.. వాటి రుచి తగ్గడం.. తెలిసిందే. ఇలాంటప్పుడు చాలామంది ఆయా పదార్థాలను పడేస్తుంటారు.

# మాడు తగ్గే చిట్కా!

అయితే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే మాడు వాసన రాకుండా జాగ్రత్తపడచ్చుంటున్నారు నిపుణులు. ఒక్కోసారి మనం సమయానికే స్టౌ కట్టేసినా.. ఉండే పదార్థం కొద్దిగా మాడి పోతుంటుంది. అలాంటప్పుడు రుచి తగ్గకుండా, మాడు వాసన రాకుండా ఉండాలంటే. అందులో నిమ్మరసం, వినెగర్, టొమాటో ముక్కలు, టొమాటో రసం.. కొద్దిగా జత చేస్తే ఫలితం ఉంటుంది. పైగా కొన్ని పదార్థాలకు వీటి వల్ల అదనపు రుచి వస్తుంది. కూరలు, గ్రేవీ.. వంటి పదార్థాలు మాడిపోయినప్పుడు క్రీమ్, వెన్న, పెరుగు అలాగే ఆ పదార్థానికి మరింత చిక్కదనం కూడా వస్తుంది. 7 గ్రిల్ చేసిన పదార్థాల నుంచి కూడా మాడు వాసన రావడం గమనిస్తాం. అలాంటప్పుడు వాటికి సాస్లను జత చేసి తీసుకుంటే.. అందులోని తియ్యదనం, పులుపుదనం.. ఆయా పదార్థాల రుచిని పెంచడంతో పాటు మాడు వాసన రాకుండా చేస్తుంది. బిర్యానీ, పులావ్.. ఉల్లిపాయ అడుగంటిన ప్పుడు.. ఒక నాలుగు ముక్కలుగా తరిగి.. గిన్నెలో నలుమూలలా ఉంచి మూతపెట్టాలి. పావుగంట తర్వాత వీటిని తొలగిస్తే ఫలితం ఉంటుంది. ఒక్కోసారి గిన్నె అడుగు పల్చగా ఉన్నా కూరలు మాడి పోతుంటాయి. కాబట్టి అలాంటి గిన్నెలకు బదులుగా మందపాటి అడుగు ఉన్న గిన్నెల్ని కూర కోసం ఎన్నుకుంటే సమస్య ఉండదు.

# పద్మమే ఎందుకు ?

పూలు లేకుండా ఏ పూజా పూర్తి కాదు. అందులోనూ శ్రావణ శుక్రవారంనాడు ఎంతో భక్తితో చేసుకునే పూజలో చామంతులూ మందారాలూ గులాబీలూ.. ఇలా ఎన్నో రకాలు ఉంటాయి. వాటిల్లో తామరలూ తప్పనిసరిగా కనిపిస్తాయి. బంతిపూల దండలూ, మామిడాకుల తోరణాలూ, బ్యాక్‌డ్రప్ అలంకరణలూ.. ఇలా ఎన్ని ఉన్నా అరవిరిసిన పద్మాలు ఉంటేనే ఆ వరలక్ష్మీదేవి శోభాయ మానంగా కనిపిస్తు తుంది. సిరులు కురిపించే ఆ శ్రీమహాలక్ష్మి పుట్టింది ఈ తామరపువ్వులోనే, అందుకే ఆమెకు ఈ పూలంటే ఎంతో ఇష్టమట. అంతేకాదు, ఈ పుష్పాలను సంతాన సామర్థ్యానికీ, అందులేని సంపదకీ ప్రతిబింబగానూ భావిస్తారు. ముఖ్యంగా తామరపువ్వు.. ఆధ్యాత్మికతను ప్రబోధిస్తుంది. అంతర్గత శక్తి, ప్రశాంతత, స్వచ్ఛతలని సూచిస్తుంది. బురదలో పుట్టినా అందమైన పద్మంగా వికసించి..తన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచంమీద విజయాన్నిసాధిస్తుంది. దీని ద్వారా భవబంధాలకు అతీతంగా అసలైన ఆనందానికి మూలమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. అన్న విషయాన్ని చెప్పకనే చెబుతోంది. ఆ కారణంతోనే ఈ పవిత్రపుష్పాలతో ఆ మహాలక్ష్మిని కొలుస్తారు.

# నిద్రకు ముందు 'టీ వద్దు!

ఈ రోజు ఉదయాన్నే టీ తాగలేదు.. అందుకే తలనొప్పి.. ఎన్నిసార్లు వినుంటాం, అనుంటాం? అంతెందుకు తలనొప్పి వచ్చినా, దీన్నే ఆశ్రయిస్తుంటాం. నిజంగానే టీ దాన్ని తగ్గించేస్తుందా? ఉదయాన్నే పనులు చకాచకా అవ్వాలంటే మనల్ని నడిపే ఇంధనం.. చాలావరకూ టీనే! అల్లం, యాలకులు, దాల్చినచెక్క మెత్తగా దంచి వేస్తాం కదా! ఆ ఘుమఘుమకే సంగం ప్రాణం లేచొస్తుంది. ఇక తాగాక తెలియని ఉత్సాహం శరీరంలోకి చేరుతుంది. బయట వాతావరణం చల్లగా ఉన్నా, పనులు ఒత్తిడిలో బుర్ర పని చేయనని మొరాయించినా మనలో చాలామంది చూసేది దానివైపే కదూ! ఆఫీసైనా, పనుల్లో



పడ్డామంటే తిండి సరికదా.. నీళ్లూ గుర్తుండవు మన ఆడాళ్లకు. ఆ డీహైడ్రేషన్ కాస్త తలనొప్పికి దారితీస్తుంది. ఓ కప్పు వేడివేడిగా తీసుకుంటామా..కాస్త నీళ్ల భర్తీ ఉండె అయ్యి ఉపశమనం కలుగుతుంది. అదీకాక ఉదయాన్నే లేస్తాం కదా.. ఆచల్లగాలికీ తలపట్టేస్తుంది. అల్లం, యాలకులతోపాటు టీలో ఉండే కెఫీన్ ఆ సమస్యకు చెక్ పెట్టేస్తాయి. ఇక వాటి సువాసనలైతే ఆరోమా థెరపీలా పనిచేస్తాయి. కాబట్టి, ఉపశమనం దొరుకుతుంది. అయితే ఇంకేం చక్కగా తాగేయొచ్చు అనుకుంటు న్నారేమో! టీ.. ఐరన్, కొన్ని మైక్రో న్యూట్రియంట్లను శరీరం గ్రహించకుండా చేయగలదు. ఆందోళన, కడుపుబ్బరం,నిద్రలేమికీ దారితీయగలదు. వీటి కారణంగానూ తలనొప్పి వస్తుంది. కాబట్టి, తాగండి.. అయితే రెండుసార్లకు మించొద్దు. తలనొప్పి, ఒత్తిడి అంటూ పదే పదే తాగితే మాత్రం అనారోగ్యాలను కొని తెచ్చుకున్నట్టే. ఇంకా ఈ కాలం తప్పక అల్లం, దాల్చినచెక్క వంటివి చేర్చుకుంటే ఆరోగ్యానికి ప్రయోజనం. అయితే భోజనానికి, నిద్రకు ముందు మాత్రం తీసుకోవద్దు.

# మనసుకు తేలిక పరిచే నేల పడక !



**పనులన్నీ పూర్తయ్యాయి. ఒళ్లంతా అలసిపోయినా నిద్ర మాత్రం దరిచేరదు. పని భారంతో తెలియని కోపం, విసుగు. ఎవరితోనూ గొడవలేదు, బాధపడే సంఘటనలూ జరగలేదు.. అయినా మనసు భాగంగా తోస్తుంది. మనకీ లక్షణాలు తరచూ కనిపించేవే కదూ! అలాంటప్పుడు నేలపై పడుకుని చూడమంటున్నారు నిపుణులు. ఎందుకంటే..**

యోగా చేసేవారికే కాదు, చేయనివారికీ పరిచయమున్న ఆసనం.. శవాసనం. నేలమీద వెల్లకిలా పడుకొని, చేతులు, కాళ్లను దూరంగా ఉంచడమే! ఎంత సులువైన ఆసనమో కదా! ఇది కండరాల మధ్య ఉన్న ఒత్తిడిని తగ్గించేస్తుంది. అంతెందుకు నేల ఎంత గట్టిగా ఉంటుంది! పడుకోవడానికి ఒకింత కష్టమే కానీ.. ఆ గట్టిదనం తెలియకుండానే భరోసానిస్తుందట. అందుకే మనసూ శాంతపడు తుంది. ప్రకృతి చేసే మాయే వేరు. నేలపై పడుకున్నప్పుడు మనసు ఆ వైబ్రేషన్లను గమనిస్తుంటుందట. తద్వారా దానితో ముడిపడినట్లు భావించితెలియకుండానే మనసు తేలికపడుతుంది. అంతేకాదు, ఆందోళనలో ఉన్నప్పుడు ఒకసారి నేలమీద పడుకోండి. అసంకల్పిత ప్రతీకార చర్య ను శాసించే నాడులు ఒక్క సారిగా ఉ త్తేజితమై, ఒత్తిడి హార్మోన్లను నియంత్రి స్తాయి. దాంతో మనసు కుదుట పడుతుంది. ఒక వస్తువును కూర్చొనో, నిల్చొనో, తెలిసో తెలియకో గమనిస్తూనే ఉంటాం. కింద పడుకొని చూస్తున్నప్పుడు అది మనసుకికొత్త కణంలో కనిపిస్తుందట. ఆ గమనించే క్రమంలో కూడా ఒత్తిడి దూరమవు తుందట. అందుకే కొత్త ఆలోచనలు రావట్లేదు అనిపించినా, మనసు భారంగా తోచినా,ఒత్తిడి నలిపేస్తున్నా నేల మీద పడుకోమంటున్నారు నిపుణులు. అయితే.. శ్వాసనీ, శరీరంలోని ప్రతి అవయవాన్నీగమనించుకుంటూ కూడా ఉండగలగాలిమరి. అప్పుడే మరింత ప్రయోజనం





అశేష ప్రజానీకం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా

# కుటుంబ విలువలకు జోహార్ విశ్వసుందరి జోహెర్రీ

నిర్వహిస్తున్న వేళ వియత్నాంలో జరిగిన 'విశ్వసుందరి' పోటీలలో వృత్తి రీత్యా ఉపాధ్యాయు రాలైన యువతి ఎంపికవడం విశేషం. ఆమె సామాజిక కార్యకర్త. 'వాయిసెస్ ఆఫ్ టుమారో' అనే సంస్థ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇంగ్లీష్ విద్యను అందిస్తు న్నారు. ఆమె కమ్యూనిటీ సేవ, విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ కిరీటం దక్కింది 73వ మిస్ వరల్డ్ 2026 పోటీలలో ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహెర్రీ మోలా డొమింగ్వెజ్ గెలుచుకుంది. 'మిస్ వరల్డ్' కిరీటం మిమ్మలేననలా మెప్పిస్తుంది? అన్న ప్రశ్న 'నా బ్యూటీ విత్ పర్పస్ ముఖ్య ఉద్దేశం... బలహీన వర్గాల పిల్లలకు ఆంగ్లాన్ని బోధించడం. ఎందుకంటే, ఈ భాష వాళ్లకు అనేక అవకాశాలు అందిస్తాయని నమ్ముతాను. అదే మన భావాలను వ్యక్తపరచడానికీ, లక్ష్యాన్ని తెలియజేయడానికీ కావాల్సిన సామర్థ్యాన్ని ఇస్తుంది. అందుకే, నా జీవితంలో ఎంతో ముఖ్యమైన దాన్ని వాళ్లకు అందివ్వగలగడమే మహదానందం ఇది జీవితాంతం వాళ్లతోపాటే ఉండి, ప్రయోజనం చేకూర్చే ఓ మంచి సాధనం అని బదులి చ్చారామె. మానవ సంబంధాలు, సానుభూతి, ఉమ్మడి కుటుంబవిలువలే తనను ముందుకు నడిపిస్తున్నాయంటారు జోహెర్రీ.


# పట్టుచీరెలు 'భద్రం'గా..



**ఎంతో ఖరీదైన పట్టు చీరలను మహిళలు కట్టు కోవటం కంటే అల్మారాల్లోనే ఎక్కువ రోజులు దాచుకుంటూ ఉంటారు.** ఏదో ఫంక్షన్‌కు కాసేపు కట్టుకుని మళ్లీ అల్మారాకే పరిమితం చేస్తారు. మరి అలాంటి పట్టుచీరలను పదేపదే ఉతకటం సాధ్యం కాదు. కాబట్టి... కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మనసుకు నచ్చిన చీరలను ఏళ్ల తరబడి పదిలంగా కాపాడుకోవచ్చు. అదెలాగంటే... పట్టు చీరలను ఏళ్ల తరబడి పదిలంగా కాపాడు కోవాలంటే...ఒకసారి వాడిన చీరను రెండు మూడు గంటలసేపు నీడలో గాలి తగిలేలా ఆరేయాలి. ఆ తరువాత పైట చెంగు లోపలివైపు వచ్చేలా మడతపెట్టాలి. పైటంచు భాగం లోపలివైపు ఉంటే మంచిది. పొడిగా ఉండే తెల్లటి కాటన్ లేదా మస్లిన్‌వస్త్రంలో చుట్టి బీరువాలో పెట్టాలి.పట్టుచీరలను మూడు నెలలకోసారి బయటకు తీసి కాసేపు నీడపట్టున ఆరేయాలి. ఆ తరువాత గతంలో వేసిన మడతను మార్చాలి. ఒకే మడతలో ఎక్కువ రోజులుంటే పోగులు తెగిపోవచ్చు. వీటిని డ్రైక్లీనింగ్‌కు ఇవ్వాలి. చీర మీద కాఫీ, టీ మరకలు పడితే అక్కడ రెండు చుక్కలు షాంపూ వేసి చన్నీటితో శుభ్రం చేయాలి. పట్టుచీరలను హ్యాంగర్‌లకూ తగిలించొచ్చు. కానీ హ్యాంగర్‌కు ఒక్క చీరే ఉండాలి. వేరే హ్యాంగర్లకు మధ్య దూరం ఉండేలా చూసు కోవాలి. స్టీలు/ ఇనుప హ్యాంగర్ల వల్ల చీరలపై మెటల్ మరకలు పడే ప్రమాద ముంది కాబట్టి చెక్క హ్యాంగర్లనే వాడాలి. నాఫ్తలిన్ ఉండలను వేసి మూటకట్టి చీరల మధ్య పెడితే పురుగుల బెడద ఉండదు. మంచి పరిమళమూ వస్తుంది. అలాగే ఎండు వేపాకులను మూటకట్టి చీరల అడుగున పెట్టాలి. దీనివల్ల చిన్నచిన్న పురుగులు దరిచేరకుండా పట్టుచీరలకు చిల్లులు పడకుండా ఉంటాయి.



# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' హృదయాలను దోచుకుంటుంది: ఆదిత్య హాసన్



**మీ కుటుంబ నేపథ్యం ఏంటి? సినీ పరిశ్రమలోకి ఎలా వచ్చారు?**

మాది వనపర్తి. టెన్త్ వరకు అక్కడే చదువుకున్నాను. మా నాన్న స్కూల్ టీచర్ గా రిటైర్ అయ్యారు. అమ్మ హౌస్ వైఫ్. అన్న, వదిన బ్యాంక్ ఉద్యోగం చేస్తు న్నారు. టెన్త్ తర్వాత నాకు సినిమాపై ఆసక్తి పెరిగింది. ఎవరి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేయలేదు. హైదరాబాద్ లో డిగ్రీ చదివి, ఆ తర్వాత మాస్టర్స్ కోసం యూకే వెళ్ళాను. అప్పటికే షార్ట్ ఫిలిమ్స్ చేసిన నేను, యూకే నుంచి తిరిగి వచ్చిన తర్వాత సినిమా ప్రయత్నాలు మొదలుపెట్టాను. .

**'90ఎస్' వెబ్ సిరీస్ అవకాశం ఎలా వచ్చింది?**

మా నాన్న గారి నిజజీవితం ఆధారంగా 90ఎస్ కథ రాసు కున్నాను. మొదట ఒక ఓటీటీ సంస్థ ఆ కథ నచ్చి, నిర్మించడానికి ముందుకొచ్చింది. కానీ, ఆరు నెలల తర్వాత వెనకడుగు వేశారు. అప్పటికే ఆ కథ గురించి తెలిసిన విన్ సాయి, నితిన్‌పిలిచారు. అలా 90ఎస్ వెబ్ సిరీస్ తెరపైకి వచ్చింది.

**మీకు ఆదిత్య హాసన్ పేరు ఎలా వచ్చింది?**

నా అసలు పేరు ఆదిత్య. నేను కమల్ హాసన్ వీరాభిమానిని. ఆ అభిమానంతోనే నా పేరును ఆదిత్య హాసన్ గా మార్చుకున్నాను.

**'ఎపిక్' సినిమా మీ బయోపిక్ అంటున్నారు నిజమేనా?**

నిజ జీవిత సంఘటనల స్ఫూర్తి ఖచ్చితంగా ఉంటుంది. కానీ, నా జీవితం మాత్రం అంత అందంగా లేదు (నవ్వుతూ). ఎంతో కొంత సినిమాటిక్ లిబర్టీ తీసుకుంటాము.

**'ఎపిక్' సినిమా ఎలా ఉండబోతుంది?**

ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. మన నిజ జీవితంలోని కొన్ని కొన్ని అందమైన సంఘట నల ఆధారంగా కథ ఉంటుంది. 90ఎస్ సిరీస్‌కు ఇది సీక్వెల్. అందులోని తమ్ముడి పాత్రకు సంబం ధించిన జీవితంలోని ఒక భాగం ఎపిక్ కథగా ఉంటుంది.

**'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' అని టైటిల్ పెట్టడానికి కారణమేంటి?**

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' కథకు కొనసాగింపు ఉం టుంది. 'ఎపిక్ ఫైనల్ సెమిస్టర్' పేరుతో ఆ కథ కొన సాగుతుంది. మొదటి భాగంలో ముగింపు కొత్తగా ఉంటుంది.

**బేబీ జోడితో సినిమా చేయడం ఏమైనా ఒత్తిడి అనిపించిందా?**

మొదట్లో అనిపించింది. కానీ, దానిని బ్రేక్ చేసేలా'ఎపిక్' సినిమా ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. హీరోగా ఆనంద్ ను నేనే ఎంపిక చేశాను.

**నిర్మాత నాగవంశీ గురించి?**

90ఎస్ వెబ్ సిరీస్ చూసి, నన్ను నమ్మి నాగవంశీ ఈ అవకాశం ఇచ్చారు. ప్రతిదీ దగ్గరుండి వంశీ చూసుకున్నారు. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఎంపిక కూడా వంశీదే.

**గోరటి వెంకన్న ఈ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?**

నాకు చిన్నప్పటి నుంచి గోరటి వెంకన్న గారంటే అభిమానం. నేను లండన్ లో చదువుకునే రోజుల్లో కూడా ఆయన పాటలే వింటూ ఉండేవాడిని. నా మొదటి సినిమాలో ఖచ్చితంగా ఆయన పాట ఉండాలి అనుకునేవాడిని. అందుకే ఎపిక్ సినిమాలో గోరటి వెంకన్నతో 'సంచారమే' రాయించి, పాడించి.. ఆ పాటతోనే ప్రమోషన్స్ మొదలుపెట్టాము.

# నందమూరి మోక్షజ్ఞతేజ, ప్రతిష్ఠాత్మక చిత్రం అనౌన్స్‌మెంట్



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తేజ తెలుగు చిత్రసీమలో తన తొలి అడుగు వేయడానికి సిద్ధమయ్యారు. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న డెబ్యూ సినిమాను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అభిమానులకు నందమూరి కుటుంబానికి, నాంది పలకనుంది.తన ఇది మరో గొప్ప అధ్యాయానికి ఎంచుకునేందుకు మోక్షజ్ఞ కావాల్సిన డెబ్యూ కోసం సరైన కథను విన్న తర్వాత తనకు నచ్చిన కథకు సమయం తీసుకున్నారు. పలు కథలను చిరంజీవి ప్రతిష్ఠాత్మక సోషియో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం మెగాస్టార్ దర్శకుడు వశిష్ఠ ఈ కథను సిద్ధం చేశారు. ఫాంటసీ చిత్రం విశ్వంభర చేస్తున్న అంచనాలు నెలకొన్నాయి. అందులోనూ ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు మరింత ఆసక్తి నెలకొంది.చిత్ర ప్రాజెక్ట్‌ను నిర్మించనుండటంతో సినిమాపై యంగ్ లయన్ కు పుట్టినరోజు బృందం బాలకృష్ణ, మోక్షజ్ఞలను కలుసుకుని, మేకర్స్ విడుదల చేశారు. ఈ శుభాకాంక్షలు తెలియజేస్తున్న కొన్ని స్టిల్స్‌ను హ్యాండ్సమ్ కనిపించడం అందరినీ స్టిల్స్ మోక్షజ్ఞ స్టైలిష్‌గా, ఫిట్‌గా, చాలా మోక్షజ్ఞ ఇప్పటికే ఇంటెన్స్ ఆకట్టుకుంది. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు అన్ని అంశాల్లో శిక్షణ గా ప్రిపేర్ అయ్యారు. కమర్షియల్ హీరోకు స్క్రీన్ ప్రెజెన్స్ పై ప్రత్యేకంగా తీసుకుంటూ ఫిజికాలిటీ, పెర్ఫార్మెన్స్, హీరోగా ఎంట్రీ ఇస్తుండటం, దృష్టి పెట్టారు. మోక్షజ్ఞ తేజ వహిస్తుండటం, మైత్రీ మూవీ మేకర్స్ వశిష్ఠ దర్శకత్వం ఈ కాంబినేషన్‌పై భారీ నిర్మిస్తుండటంతో అంచనాలు నెలకొన్నాయి.

# 'దాదా'గా బాలయ్య


గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో తెరకెక్కుతున్న స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ K #NBK111, బాలయ్య పుట్టినరోజున 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' అనే టైటిల్‌తో గ్లింప్స్ విడుదలైనప్పటి నుండి భారీ బజ్‌ను క్రియేట్ చేస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ను పోస్టర్, పవర్ ఫుల్ గ్లింప్స్ ద్వారా ప్రకటించారు. K #NBK111కు 'దాదా'అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. బాలకృష్ణ పోషిస్తున్న పాత్ర స్వభావాన్ని ప్రజెంట్ చేసేలా ఈ టైటిల్ ఉంది. పోస్టర్‌లో బాలకృష్ణ మాస్ అవతార్‌లో కనిపించారు. సన్‌గ్లాసెస్, లెదర్ జాకెట్, మెడలో భారీ గోల్డ్ చైన్‌తో స్టైలిష్‌గా కనిపిం చిన ఆయన.. భుజంపై వెపన్‌తో రౌడీ, గ్యాంగ్‌స్టర్ తరహా వైబ్‌ను తీసుకొచ్చారు. ఆయన సీరియస్ ఎక్స్‌ప్రెషన్, కమాం డింగ్ బాడీ లాంగ్వేజ్ క్యారెక్టర్‌లోని పవర్‌ను మరింత ఎలివేట్ చేశాయి. టైటిల్ గ్లింప్స్ బాలకృష్ణ క్యారెక్టర్ పవర్, ఆరాను ప్రజెంట్ చేస్తూ, ఆయనను 'షేర్' (సింహం)గా సంబో ధించే వాయిస్‌ఓవర్‌తో వీడియో ఓపెన్



అవుతుంది. పోలీస్ అధికారులు ఆయనను చుట్టుముట్టి ఛాతిలో కాల్చేస్తామని హెచ్చరి స్తారు. నాకు గురి పెట్టడానికి ఒంట్లో పొగరు వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్స్‌కి బలుపు, గన్స్‌కి గట్స్ ఉండాలిఖి అని బాలయ్య చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ అదిపోయింది, ఈ సీక్వెన్స్ అభిమానులను, మాస్ ఆడియన్స్‌ను ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేసేలా ఉంది.దర్శకుడు గోపీచంద్ మలినేని బాలకృష్ణను లార్జర్ దేన్ లైఫ్ మాస్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు.

# చరిత్ర తిరగరాసిన స్పైడర్‌మ్యాన్

హాలీవుడ్ చిత్రాలు భారత్‌లో వసూళ్ల వర్షం కురిపించడం కొత్తేం కాదు. ముఖ్యంగా 'అవెంజర్స్', 'అవతార్', 'స్పైడర్‌మ్యాన్' ఫ్రాంఛైజీ చిత్రాలతో పాటు, దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ సినిమాలకూ మన దేశంలో పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. అందుకే ఇక్కడి స్టార్ల సినిమాలతో పోటీపడేలా భారీ వాటికి మొత్తంలో వసూళ్లు వస్తాయి. అయితే ఇప్పటివరకూ ఏ హాలీవుడ్ చిత్రానికీ సాధ్యం కాని రీతిలో ఇండియన్ బాక్సాఫీసు వద్ద ప్రభంజనం



సృష్టించింది 'స్పైడర్‌మ్యాన్' : బ్రాండ్ న్యూ డే ఏకంగా రూ.500 కోట్లు కలెక్ట్ చేసి సత్తా చాటింది. భారత్‌లో ఈ మైలురాయిని అందుకున్న తొలి భారత దేశంలో). (రూ. 500 కోట్లు రాబట్టిన తొలి హాలీవుడ్ చిత్రం మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమైన 'స్పైడర్‌మ్యాన్' పాత్రతో తెరకెక్కిన ఈ సినిమా జులై 30న భారీ అంచనాలతో విడుదలైంది. తొలిరోజు నుంచే కళ్లుచెదిరే వసూళ్లతో అదరగొట్టింది. తొలి వారంలోనే రూ.330 కోట్లకు పైగా వసూలు చేసింది. 39 రోజుల్లోనే రూ.500 కోట్ల మార్కును అధిగమించడం విశేషం. స్పైడర్మ్యాన్ పాత్రలో మరోసారి టామ్ హాలండ్ నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్త వసూళ్లలోనూ తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకు రూ.22,600 కోట్లకు పైగా వసూలు చేసింది.

# 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిన సినిమా: అఖిల్ అక్కినేని



మహేంద్రగిరి వారాహి ఖచ్చితంగా థియేటర్‌లో చూడాల్సిన సినిమా. మంచి డివైన్ కంటెంట్ ఉంది. సినిమా చాలా పెద్ద హిట్ కాబోతుం దనే నమ్మకం ఉంది: ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో అఖిల్ అక్కినేని సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక పాత్రలో కనిపిస్తున్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో అఖిల్ అక్కినేని ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ: ఇలాంటి మంచి ప్రాజెక్ట్ నిర్మించిన లక్ష్మణ్‌కి కంగ్రాచ్యులేషన్స్. ఈ రోజుల్లో ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే అలాంటి కంటెంట్‌ను అందించగలగాలి. ఇప్పుడు టీజర్, ట్రైలర్ చూస్తుంటే ఖచ్చితంగా ఇది ప్రేక్షకులు థియేటర్‌లో చూడదగ్గ సినిమా అనిపిస్తుంది. ఇలాంటి నిర్మాతలు మన పరిశ్రమకు మరింతమంది కావాలి. నేను చిన్నప్పటి నుంచి సుమంత్ అన్న ఒడిలోనే పెరిగాను. నాకు ఏది కావాలన్నా ఎక్కువగా సుమంత్‌నే అడిగేవాడిని. ఒక్కరోజు కూడా ఆయన ఎప్పుడూ నాకు నో చెప్పలేదు. ఈరోజు ఆయన ఫంక్షన్‌కు వచ్చి మాట్లాడుతుంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. చాలా పాజిటివ్ ఫీలింగ్. ఐ లవ్ యూ బ్రదర్. సిద్దుకి థాంక్స్ చెప్పాలి. ఎందుకంటే ఆయన సినిమాలు పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. కానీ ఆయన వేరే సినిమా కోసం సపోర్ట్ చేస్తూ ఇందులో చేయడం నిజంగా అభినందనీయం. ఏదో ఒక రోజు ఆయన సినిమాలో నేను కూడా భాగం కావాలని కోరుకుంటున్నాను.సెప్టెంబర్ 11న అందరూ థియేటర్‌లో చూడండి. మంచి కంటెంట్ ఎంజాయ్ చేయండి.

# 'జయంత్ అండ్ ది జింగోపెన్' ఫస్ట్‌లుక్ లాంచ్



నమో జయం ప్రొడక్షన్స్ పతాకంపై నేషనల్ అవార్డు విన్నర్ నవీన్ దేశబోయిన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం జయంత్ అండ్ ది జింగోపెన్. జయంత్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి తాతగా, సత్యం రాజేష్ స్కూల్ టీచర్‌గా నటించటం విశేషం. దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను టీచర్స్ డే సందర్భంగా జాతీయ అవార్డు పురస్కారం అందుకున్న టీచర్ మారం పవిత్ర గారి చేతుల మీదుగా జయ టుంత్ అండ్ ది జింగోపెన్' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జయంత్ మాట్లాడుతూ- ఇదో కొత్త తరహా చిత్రం. మనం రోజు స్కూల్లో ఎదుర్కొనే సమస్యలతో పాటు విద్యావ్యవస్థ గురించి మా సినిమాలో చెప్పటం జరిగింద్ధి అన్నారు. దర్శకుడు నవీన్ దేశబోయిన మాట్లాడుతూ-"నేను ఈ సినిమా చేసినందుకు ఎంతో గర్వంగా ఫీలవుతున్నాను. నా గత చిత్రం"లతా భగవాన్ ఖర్తే, చిత్రానికి దేశవ్యాప్తంగా 32 అవార్డులు వచ్చాయి. వాటితో పాటు ఫిలింఫేర్, నేషనల్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాను. జయంత్‌ను హీరోగా పెట్టి నేను చేసిన 'జయంత్ అండ్ జింగోపెన్' మలయాళ సినిమా"ఫిలిప్ అండ్ ది మంకీ పెన్ఠ్ అనే చిత్రం రీమేక్. మలయాళంలో ఈ చిత్రం 111 రోజులు ప్రదర్శించి ఘన విజయం సాధించింది. ఎన్నో ఫ్యామిలీ ఎమోషన్స్ ఉండటంతో అంత పెద్ద విజయం సాధించింది. తెలుగు ప్రేక్షకుల నుండి కూడా మంచి ఆదరణ లభిస్తుందని నమ్ముతున్నా అన్నారు.

8-9Pg8-f:8-9Pg8-f.qxd 9/7/2026 11:25 PM Page 1




# ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం చలో అసెంబ్లీ

## హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో అడ్డుకున్న పోలీసులు



అసెంబ్లీ ప్రదర్శన సందర్భంగా హిమాయత్‌నగర్‌లో ఆర్.కృష్ణయ్యను అడ్డుకుంటున్న పోలీసులు

**సైఫాబాద్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులకు 8 వేల కోట్ల ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో అసెంబ్లీ ప్రదర్శన' వందలాది మంది విద్యార్థులను పోలీసులు సోమవారం అడ్డుకుని భగ్నం చేశారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్‌పటేల్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు నారాయణగూడ నుంచి చలో అసెంబ్లీ ప్రదర్శనకు బయలుదేరారు. హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో కొంత మంది విద్యార్థులు రోడ్డుమీదనే బైఠాయించారు. విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వివాదం, కొద్దిసేపు తొక్కిసలాట జరిగింది. ప్రదర్శనలో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతోపాటు, బిసి సంఘం, బిసి విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసి విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద కులాల విద్యార్థులు చదువుకోకుండా ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని, ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసి,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులపై ఎందుకు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క చిన్న పథకాన్ని సైతం ప్రవేశపెట్టలేదని, ఉన్న స్కీమ్‌లను కూడా సక్రమంగా అమలు చేయలేకపోతున్నారని ఆరోపించారు. ఈ ఫీజులు బకాయిలు 8 వేల కోట్ల రూపాయలు చెల్లించడం ప్రభుత్వానికి ఒక లెక్కకాదని, ఫీజులు చెల్లించకపోవడంతో మూడున్నర సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న బాధలు చెప్పతరం కాదని, కోర్సులు పూర్తి చేసిన ఆరు లక్షల మంది విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని దీంతో ఉన్నత విద్యను అభ్యసించడానికి, ఉద్యోగాలు చేసుకోవడానికి అటంకం ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో జోక్యం చేసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. లేకపోతే విద్యార్థులు చేపట్టే వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలిసి ఉంటుందని హెచ్చరించారు. ఈ ప్రదర్శన కార్యక్రమంలో నిఖిల్‌పటేల్, బిసి సంఘం నాయకులు అనంతయ్య, అరుణస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# ఎఐ కెమెరా కంటికి చిక్కని దుస్తులు!

**బెర్లిన్, సెప్టెంబరు 7:** ఎదురుగా మనిషి నడుచుకుంటూ వెళ్తున్నా.. వారిని గుర్తించలేకపోతే..! అలా సిసిటివిలను ఏమార్చే దుస్తులను జర్మనీకి చెందిన డిజైనర్ సైమన్ వెకెర్ట్ తయారుచేశారు. ఎఐ ఆధారిత విడియో నిఘా వ్యవస్థను తికమకపెట్టే ఉద్దేశంతోనే ఆయన వాటిని రూపొందించారు. దానికి సంబంధించి ఆయన షేర్ చేసిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. జర్మనీ రాజధాని బెర్లిన్ సహా పలు నగరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ప్రజల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఎఐ కెమెరాలను అమర్చాలని అధికారులు నిర్ణయించుకున్నారు. అయితే అవి ఏ మేరకు పనిచేస్తాయో చెక్ చేసేందుకు ఒక ప్రత్యేకమైన 'డిజిటల్ కామోఫ్లాజ్' చొక్కాను సైమన్ వెకెర్ట్ డిజైన్ చేశారు. అది ధరించిన వ్యక్తితోపాటు రోడ్డుపై నడుస్తోన్న పలువురు అక్కడ ఏర్పాటు చేసిన ఎఐ కెమెరాలకు చిక్కారు. ఈ డిజైనర్ చొక్కా ధరించిన వ్యక్తిని మినహా మిగతా అందరిని ఆ కెమెరా 'పర్సన్'గా లేబుల్ చేసింది. ఒక వ్యక్తిని గుర్తుపట్టేలా ఆ ఎఐ కెమెరా సిస్టమ్స్ ముందుగానే లక్షలాదిగా మనుషుల చిత్రాలను నేర్చుకుని ఉంటాయి. దాంతో ఆ కెమెరాల ముందు నుంచి ఎవరైనా వెళ్తుంటూ.. మనుషుల శరీరాకృతి, రంగులు, దుస్తుల అంచు వంటి వాటి ఆధారంగా తాను లెర్న్ చేసిన దృశ్యాల నుంచి అతడిని గుర్తించే ప్రయత్నం చేస్తాయి. కానీ 'డిజిటల్ కామోఫ్లాజ్' చొక్కా మాత్రం ఎఐని మాయ చేస్తుంది. దానిపై ఉండే ప్రకాశవంతమైన రంగుల్లో మార్పులు, కలిసిపోయినట్లుగా ఉండే ఆకారాలు.. ఎఐ చూపును తికమకపెట్టేస్తాయి. రంగులు దాని కంట్లో పడినా.. కలిసిపోయినట్టుగా ఉన్న ఆకారాల కారణంగా అవుట్‌లైన్ కచ్చితంగా గుర్తించలేకపోతుంది. ఆ గందరగోళం వల్ల తాను చూస్తున్నది ఒకే వ్యక్తినా కాదా? అనే అంచనాకు రాలేకపోతుందని డిజైనర్ షేర్ చేసిన దృశ్యాలను బట్టి తెలుస్తోంది.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ముందడుగు

- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఎఎఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం - రన్‌వే, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం

- రైల్వే లైన్ వల్ల కలిగే సాంకేతిక అంశాలపై ప్రత్యేక పరిశీలన - సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు

**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుని మొదటి రోజు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధ్యయనం చేసింది. జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే మరియు సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోంది. ఈ సందర్భంగా సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమై ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ఏటీఆర్72 తరహా విమానాలతో పాటు పెద్ద ఎయిర్‌బస్ ఏ320/ఏ321 విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది. పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి, భవిష్యత్ విస్తరణకు అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా సాంకేతిక బృందం పరిశీలనలో ప్రధాన అంశంగా నిలిచింది. రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాల నేపథ్యంలో దాని వల్ల ఏర్పడే సాంకేతిక ప్రభావాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే 'షీల్డింగ్' ప్రక్రియ ద్వారా సాంకేతిక అవరోధాన్ని అధిగమించే అవకాశాలను కూడా పరిశీలించడంతో పాటు, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్‌ఓసీ పొందే అంశంపై చర్యలు చేపట్టనున్నారు. పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులు సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ మ్యాపులు, భౌగోళిక కోఆర్డినేట్లు, స్థల హద్దులు, అప్రోచ్ రోడ్లు, రెవెన్యూ మరియు సాంకేతిక రికార్డులను సిద్ధంగా ఉంచి ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలిస్తూ, రికార్డులతో సరిపోల్చి బృందం సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తోంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ...

జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లా డుతూ... జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమా నాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు.

# భార్య తలనరికి ఫ్రిజ్‌లో దాచిన శాడిస్టు భర్త



**గువాహతి, సెప్టెంబరు 7:** పెళ్లైన కొన్ని నెలలకే ఒక వ్యక్తి తన భార్యను నరికి చంపాడు. ఆమె చేతి వేళ్లు సగానికి నరికాడు. తెగిన తలను ఫ్రిజ్‌లో దాచి అక్కడి నుంచి పారిపోయాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన పొరుగువారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. అస్సాం రాజధాని గువాహతిలో ఈ సంఘటన జరిగింది. కొత్తగా పెళ్లైన జంట ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. గత రెండు రోజులుగా పొరుగువారికి వారు కనిపించలేదు. ఆ దంపతుల ఫోన్లు కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉన్నాయి. ఈనెల 6న ఆ అపార్ట్‌మెంట్ నుంచి దుర్వాసన రావడాన్ని పొరుగువారు గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. అపార్ట్‌మెంట్ లాక్ బ్రేక్ చేసి లోపలకు వెళ్లి చూశారు. మహిళ మృతదేహం ఛిద్రమైన స్థితిలో కనిపించడంతో షాక్ అయ్యారు. ఆమె చేతి వేళ్లు సగం వరకు నరికి ఉన్నాయి. మృతదేహం కుళ్ళిపోవడం మొదలైంది. తొలుత ఆ మహిళ తల కనిపించలేదు. పోలీసులు ఇంట్లో సోదా చేయగా రిఫ్రిజిరేటర్‌లో దాచిన ఒక పాలిథిన్ బ్యాగ్‌లో ఆమె తల లభించింది. మరోవైపు హతురాలిని 25 ఏళ్ల రియా తాలుక్‌దార్‌గా పోలీసులు గుర్తించారు. తెగిన తలతో సహా ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఆ మహిళ భర్త ఆచూకీ ఎక్కడా లభించలేదు. శుక్రవారం అతడ్ని చివరిసారి చూసినట్లు పొరుగువారు తెలిపారు. అయితే ఆదివారం రాత్రి రియా భర్త పోలీసులకు లొంగిపోయాడు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యకు గల కారణాలు గానీ, నిందితుడు లొంగిపోవడానికి దారితీసిన పరిస్థితుల గురించి గానీ పోలీసులు ఇంకా వెల్లడించలేదు.

# రిటైర్డ్ డిఎస్‌పి రవి కుమార్ కన్నుమూత



శ్రీరామ్ రవి కుమార్

**చిక్కడపల్లి సెప్టెంబర్ 7 ( ప్రభాతవార్త ) :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వద్ద ముఖ్య భద్రతాఅధికారిగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన డిఎస్పీ శ్రీరామ్ రవి కుమార్ (66 ) తీవ్ర అనారోగ్యంతో ఆదివారం రాత్రి బాగ్ లింగంపల్లి లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సులక్షన, కుమారుడు రఘువరన్ ఇద్దరు కుమార్తెలు రాధికా, రమ్య ఉన్నారు. పోలీస్ ఉన్నతాధికారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి హోమ్ మంత్రి దేవేందర్ గౌడ్ తో పాటు పలువురు మంత్రుల వద్ద విధులు నిర్వహించి సమర్థవంతమైన అధికారిగా పేరును సంపాదించారు. కాగా అంత్యక్రియలు గోల్నాక స్మశానవాటికలో మంగళవారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. రవి కుమార్ మృతి పట్ల సిపిఐ నగర నాయకుడు బి.వెంకటస్వామి గౌడ్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. తన స్వగ్రామం అయినా తెల్కపల్లి ప్రాంతానికి చెందిన రవి కుమార్ ఎప్పుడు కలిసిన ఏం లీడర్ ఎంతో ఆప్యాయంగా అండ్ ప్రేమగా పిలిచే వ్యక్తి అని అన్నారు. ఆయన లేని లోటు తీర్చనిదన్నారు. వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి కూడా తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. డిఎస్పీ గా తనతో పాటు విధులు నిర్వహించిన పలువురు అధికారులు రవికుమార్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

# ప్రపంచ సోదరభావానికి ప్రతీక స్వామినారాయణ్ మందిరం

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** భారత్‌ఫ్రాన్స్ సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని అన్నారు. ఆదివారం పారిస్‌లో నిర్మించిన స్వామినారాయణ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోడీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్, ఫ్రాన్స్ మధ్య ఉన్న స్నేహం, వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు సాంస్కృతిక సంబంధాల ప్రాధాన్యతను వివరించారు. ఈ ఆలయం కేవలం ఆధ్యాత్మిక, నిర్మాణ పరమైన ప్రాధాన్యత కలిగిన ప్రదేశం మాత్రమే కాదని వసుధైవ కుటుంబం అనే భారతీయ తత్వానికి, ప్రపంచ సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని పేర్కొన్నారు. భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధాలు ఇటీవలి సంవత్సరాల్లో కొత్త స్థాయికి చేరుకున్నాయని ప్రధాని మోడీ అన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో కలిసి ఇరు దేశాలు ప్రత్యేకమైన గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని తెలిపారు. భారత్‌ఫ్రాన్స్ సంబంధాలకు సుదీర్ఘమైన సాంస్కృతిక, రాజకీయ అనుబంధం బలమైన పునాదిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఇరు దేశాల భాగస్వామ్యం మరింత విస్తరిస్తోందని చెప్పారు. భారత్, ఫ్రాన్స్‌లు అనేక కీలక రంగాల్లో కలిసి పనిచేస్తున్నాయని ప్రధాని మోడీ తెలిపారు. ముఖ్యంగా సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రక్షణ, అంతరిక్షం, వాతావరణ మార్పులు వంటి రంగాల్లో సహకారం కొనసాగుతోందని చెప్పారు. అలాగే 2026 సంవత్సరాన్ని భారత్‌ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఇయర్‌గా నిర్వహిస్తున్న విషయాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. రెండు దేశాల మధ్య ఆవిష్కరణలు, సాంకేతిక భాగస్వామ్యం మరింత పెరగడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. పారిస్‌లో స్వామినారాయణ ఆలయ ప్రారంభోత్సవం కేవలం ఒక మతపరమైన కార్యక్రమం కాదని ప్రధాని మోడీ అన్నారు. ఇది ప్రాచీన భారతీయ తత్వమైన వసుధైక కుటుంబంతో పాటు ప్రపంచ సోదరభావానికి సజీవ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# రాష్ట్రానికి తక్షణమే హోం మంత్రిని నియమించాలి

## అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

**సైఫాబాద్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోజు రోజుకు శాంతి భద్రతలు క్షిణిస్తున్నాయని, మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆరోపిస్తూ తక్షణమే రాష్ట్రానికి హోం శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ అనేక మంది ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు సోమవారం 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ఆందోళనా కార్యక్రమంలో పాల్గొన్నారు. అసెంబ్లీకి చేరుకున్న నాయకులను, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. అరెస్టుల సందర్భంగా తీవ్రంగా ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. అంతకు ముందు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు హేమాసుదర్శన్ జిల్లోజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికి హోం శాఖ మంత్రి లేకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. దీంతో శాంతి భద్రతలు పూర్తిగా క్షిణించాయని, చిన్న చిన్న పిల్లలపైన, మహిళలపైన అత్యాచారాలు, హత్యలు, దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఇటీవల శిరీషా అనే ఒక నర్సును దారుణంగా హత్య చేయడం జరిగిందన్నారు. మహిళలపై దాడులకు పాల్పడితే నిందితులను తక్షణమే అరెస్టు చేయా లని, కఠినంగా చర్యలు చేపట్టాలని, తక్షణమే హోం శాఖకు ఒక మంత్రిని నియమించాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతుందని హెచ్చరించారు. శిరీషా కేసును సిబిఐకి అప్పగించాలని, ఆమె కుటుంబానికి 5 కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

# భర్తను చంపి పెట్టెలో దాచి కుటుంబ సభ్యులు అదృశ్యం

**అచ్చంపేట,సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** అమ్రాబాద్ మండల కేంద్రం లో ఓ వ్యక్తి అనుమానాస్పద హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. కొన్ని రోజుల క్రితం జహంగీర్ హత్యకు గురైనట్లు తెలుస్తుండగా, మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి ఓ పెట్టెలో కుక్కి గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు భార్య, కుమారులు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే మృతదేహాన్ని తరలించడం సాధ్యం కాక పోవడంతో ఇంట్లోనే వదిలేసి ఇంటికి తాళం వేసి వారు పరారైనట్లు తెలుస్తోంది. కొంతకాలంగా ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అమ్రాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తాళాలు తెరిచి మృతదేహాన్ని గుర్తించారు.

క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలను సేకరించారు. కుటుంబ కలహాలే హత్యకు కారణమా హత్యకు దారితీసిన పరిస్థితులు ఏమిటి మృతదేహాన్ని పెట్టెలో కుక్కి తరలించేందుకు ఎందుకు ప్రయత్నించారు అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు అమ్రాబాద్ సిఐ చంద్రయ్య తెలిపారు.

# భూత్పూర్ వద్ద ఘోర ప్రమాదం : ఇరువురి మృతి, ఒకరికి తీవ్రగాయాలు



భూత్పూర్ ఎన్‌హెచ్-44 ఫ్లైఓవర్‌పై డీసీఎంను ఢీకొన్న కారు

**భూత్పూర్,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త :** కారు-డీసీఎంలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందగా,ఒకరికి తీవ్రగాయాలైన విషాదకర సంఘటన ఆదివారం అర్ధరాత్రి భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారి-44 ఫ్లైఓవర్ బ్రిడ్జిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు కోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం భూత్పూర్ వద్దకు రాగానే టైరు బ్రస్ట్ కావడతో డీసీఎం ఎన్‌హెచ్-44 ఫ్లైఓవర్ బ్రిడ్జిపై డీసీఎం ఒక్కసారిగా రోడ్డుపై అటూ ఇటూ వెళ్లడందో వెనక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు డీసీఎంను ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఆదోని జిల్లా దేవన్నకొండ మండలం బుర్కుంట గ్రామానికి చెందిన హారీష్‌గౌడ్(26),ఇదే కారు వెనక నుంచి వస్తున్న మరో డీసీఎం కారును ఢీకొట్టగా, డీసీఎం డ్రైవర్ గుజ్జాల శేఖర్(30)అక్కడికక్కడే మృతి చెందారు.కారులో ప్రయాణించే కళ్యాణ )కి తీవ్రగాయాలయ్యాయి.తీవ్రంగా గాయపడిన కళ్యాణిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు భూత్పూర్ పోలీస్ ఎస్సై నాగన్న తెలిపారు.

# రైస్ మిల్లర్లపై దాడులు ఆపాలి

## అక్టోబర్ 29న ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా

### తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 7,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్లు తీవ్ర భయ భ్రాంతులకు గురవుతున్నారని మిల్లర్లపై నిర్వహిస్తున్న ఫిజికల్ వెరిఫికేషన్ తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అధికారులు రైస్ మిల్లర్ లపై కేసులు పెట్టి జైళ్లకు పంపడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపింది. ఈమేరకు సోమవారం తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతలు మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌లు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు.మా దగ్గరుంది కేవలం ఒకటిన్నర కోట్ల టన్నుల ధాన్యమేనని దానిని పౌరసరఫరా శాఖకు తిరిగి ఇచ్చేందుకు రెండు మాసాల సమయం ఇవ్వాలని కోరారు. తమలో కొందరు రైస్ మిల్లర్లు గత ప్రభుత్వంతో లాలూచి పడి అక్రమాలకు పాల్పడింది నిజమే అయినప్పటికీ అందరినీ అదే కోవాలో కలుపడం దురదృష్టకరమన్నారు. గతంలో జరిగిన ప్రకృతి వైపరీత్యాలు,వర్షాభావ పరిస్థితులు, రైతాంగం ధాన్యాన్ని ఆరా పెట్టిన విధానం వల్ల ధాన్యం రైస్ మిల్లులకు రావటమే కొత్త నాణ్యతలోపంగా వచ్చిందన్నారు. తడిసిన ధాన్యం, ముక్కిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకే కొనుగోలు చేయడంతో కొంత నష్టం వాటిల్లిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్ల ఆవేదనను ప్రభుత్వానికి తెలిపేందుకు అక్టోబర్ 29న ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నాకు పిలుపునిస్తున్నామన్నాని సమస్యలను మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు.

# పెండింగ్ స్కాలర్షిప్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి..

## పాలిటెక్నిక్ జీవో 97 ను వెంటనే రద్దు చేయాలి

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త సుబేదారి:** పెండింగ్ స్కాలర్షిప్ బిల్లులను వెంటనే విడుదల చేసి చేసి జీవో 97 ను రద్దు చేయాలని కోరుతూ నిరసన ర్యాలీలో పాల్గొన్న టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం రోజు హనుమకొండ జిల్లా అంబేద్కర్ జంక్షన్ వద్ద విద్యార్థుల యొక్క స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని నిరసన కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ జంక్షన్ నుండి కాళోజి మార్గం మీదిగా అదాలత్ జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ చేరుకోగానే పోలీసులు అడ్డగించడంతో కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు తదనంతరం పోలీసులు నచ్చచెప్పడంతో కలెక్టర్ ని కలిసి విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ కి వివరించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ విద్యార్థుల పెండింగ్ స్కాలర్షిప్ లోను వెంటనే విడుదల చేసి వారి యొక్క భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా ప్రభుత్వం బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. అంతేకాకుండా జీవో నెంబర్ 97 నో రద్దుచేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా నిలవాలని ఇంటర్ కాలేజ్ వ్యవస్థను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఇప్పటికే చిన్న చిన్న కాలేజీలు స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ లేక మూతబడినటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయని .విద్యావ్యవస్థ కొంటుపట్టే ఆస్కారం ఉందని తెలియజేశారు స్కాలర్షిప్లు చెల్లించకపోవడం వల్ల బాలికల విద్యా వ్యవస్థ పై పెను ప్రమాదం పొంచి ఉందన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం చర్య తీసుకుని స్కాలర్షిప్లను విడుదల చేసి 97 జీవోను రద్దు చేయాలని కోరారు.

ఈ నిరసన కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు పాత్ ఫైండర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వరరావు వివిధ సంస్థల విద్యార్థినీ విద్యార్థులు యజమానులు టిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిఒ97 రద్దు చేయాల్సిందే

## చర్చలకు పిలిచి విద్యార్థులను బెదిరించడం సరికాదు

### - తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి జెఏసి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్, జనార్ధన్, అక్షయ్, విశాల్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 7,ప్రభాత వార్త:** జీవో 97 పై ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగులతో చర్చించేదుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హై లెవల్ కమిటీ విద్యార్థులను చర్చల కోసం పిలిచి వారు లేవనెత్తిన అంశాలకు సరిగ్గా సమాధానాలు చెప్పకుండా బెదిరించడం సరికాదని పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ 30 కాలేజీల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రతి తెలంగాణ బిడ్డ పాల్గొన్నట్టే పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగులంతా ఈ పోరాటంలో వున్నారన్నారు. జీవో 97 పై మంత్రి వివేక్, విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి, కమిటీ చైర్మన్ కేకే తలోరీతిలో మాట్లాడుతున్నారని తమ ప్రశ్నలకు సరైన సమాధానం రావడం లేదని తెలిపారు. ముందుగా పాలిటెక్నిక్ విద్యను నాశనం చేసిన నవీన్ మిట్టల్‌ను వెంటనే కమిటీ నుండి తీసివేయాలని డిమాండ్ చేశారు. అలాగే 97 జీవో పై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం కమిటీ పేరుతొ కాలయాపన చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ సమావేశం ముగిసే లోపు జీవోను రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జేఏసీ నేతలు జనార్దన్, అక్షయ్, విశాల్, విక్కి, సిరి, ప్రణిత, అమూల్య, కీర్తన, జ్ఞానదీప్, దీరజ్, పరమేష్, రాబిన్, సాత్విక 70కి పైగా మంది పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏడుగురు మంత్రులు తిరుగుబాటు.. సిజెపి నేతల ఆరోపణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** ఢిల్లీలో విద్యార్థుల నిరసనల తర్వాత దేశంలో రాజకీయాలు వేగంగా మారుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అదే సమయంలో ఢిల్లీ నిరసనలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ప్రయత్నాలు ప్రారంభించిన ప్రధాని మోడీ ఆ తర్వాత పార్లమెంట్ సమావేశాలపై దీని ప్రభావం పడుతుందని భావించి వెనక్కి తగ్గారు. ఆ తర్వాత కూడా కేబినెట్ ప్రక్షాళనకు వీలుగా ముందుగా బీజేపీ జాతీయ కార్యవర్గంలో మార్పులు చేశారు. రాజ్యసభ పదవీకాలం ముగిసిన కేంద్రమంత్రులకు పొడిగింపు కూడా ఇవ్వకుండా సాగనంపారు. అయినా కేబినెట్ ప్రక్షాళనపై ముందడుగు పడకపోవడం వెనుక కీలక కారణాలున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కేబినెట్ ప్రక్షాళన కోసం ఇప్పటికే ప్రధాని మోడీ, అమిత్ షా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడం వెనుక మంత్రుల తిరుగుబాటే కారణంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపిస్తోంది. బీజేపీలోని పలువురు మంచి మనసున్న వ్యక్తులు పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.